# రెండు గీతలు

భగవద్గీత - ఉత్తరగీత

మహాభారతంలో శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశించిన

భగవద్గీత, ఉత్తర గీతలకు స్వేచ్ఛా వ్యాఖ్యానం


"శాంతిశ్రీ"

జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి

ప్రశాంతినిలయం



# రెండు గీతలు

## భగవద్గీత - ఉత్తరగీత

మహాభారతంలో శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశించిన

భగవద్గీత, ఉత్తర గీతలకు స్వేచ్ఛా వ్యాఖ్యానం

" శాంతిశ్రీ"

జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి

ప్రశాంతినిలయం

RENDU GEETALU ©

BHAGAVADGEETA UTTARA GEETA

ప్రతులు : 1000

# రెండు గీతలు

## భగవద్గీత - ఉత్తర గీత

- ' SANTISRI'

**JANDHYALA VENKATESWARA SASTRY**

వెల రూ. 20-00

*This Book is published with the financial assistance of Tirumala Tirupati Devasthanams under their scheme aid to religious books.*

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No. 56067
Date..................
TIRUPATI.

ప్రచురణ :
శాంతిశ్రీ
జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి
EP II /2
ప్రశాంతినిలయం - 515 134

శ్రీ వాసవి డి.టి.పి. సెంటర్, తాడేపల్లిగూడెం
ముద్రణ : నాగేంద్ర ఎంటర్ ప్రయిజెస్ - విజయవాడ - 2

# మమధర్మమే గీత సందేశం

- భగవాన్ శ్రీ సత్యసాయిబాబా

పూర్ణ ప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
సత్య త్యాగ శాంతి క్షాంతు లబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట సాయిమాట !

ప్రేమ స్వరూపులారా !

' జ్ఞానానాం జ్ఞాన ముత్తమమ్' ప్రపంచంలో ఎన్నియో విధములైన జ్ఞానము లున్నవి. సంగీత సాహిత్య నృత్య చిత్ర శిల్ప ఇత్యాది జ్ఞానములే కాక లౌకిక వైజ్ఞానిక జ్ఞానములు లోకములో అనేక విధములుగా నున్నవి. కానీ యీ జ్ఞానము లన్నింటికంటె ఆత్మజ్ఞానమే అత్యంత ఉత్తమమైనది. శ్రేష్ఠమైనది.

ప్రపంచములో భౌతిక కళల చేత మానవుడు శాంతిని అందుకొనలేడు. మానవునకు ఒక్క ఆత్మజ్ఞానం వలననే శాంతి సుఖములు పొందుటకు అవకాశమున్నది. అందువలననే నహి నహి రక్షితి డుకృఞ్ కరణే అన్నాడు శంకరుడు. భౌతిక జ్ఞానం లోక సంబంధమైన సౌఖ్య సంతోషములను మాత్రమే ఇవ్వగలదు. కానీ ఆత్మజ్ఞానం సుస్థిరమైన శాంతి సుఖములు అందిస్తుంది.

ఆత్మజ్ఞానమన్నను, బ్రహ్మజ్ఞానమన్నను, ఆధ్యాత్మిక జ్ఞానమన్నను ఒక్కటే. అయితే అనేకత్వములోని ఏకత్వాన్ని నిరూపించేది, మృత్యుత్వములో అమృతత్వమును నిరూపించేది ఆత్మజ్ఞానం. పవిత్రమైన సృష్టి స్థితులను పవిత్రమైన దివ్య మార్గాన్ని ప్రసాదించేంది ఆధ్మాతిక జ్ఞానం.

ఈ జ్ఞానమునకు ఆధారమేమిటి ! దీనికి నిర్మలమైన చిత్తము చిత్తశుద్ధి అత్యవసరము ' చిత్తశుద్ధియే కర్మ' చిత్తశుద్ధికి పవిత్రమైన కర్మలు అత్యవసరము.

ఈ కర్మలు సదాచారములే. సత్ప్రవర్తనచే సద్గుణములచే సత్సంగముచే ఆచరించే పవిత్రమైన కార్యములు. ఇంతియేకాక పవిత్రమైన భారత భాగవత రామాయణ గీత ఉపనిషత్ బ్రహ్మసూత్ర ఇత్యాది గ్రంథములు పఠించుట కూడను సత్కర్మలే. దానధర్మాది కర్మలు యజ్ఞ యాగాది క్రతువులు సత్కర్మల క్రిందనే రూపొందును. లోక సంబంధమైన విద్యలు అభ్యసించిన వాడు పండితుడు కావచ్చును. మేధావి కావచ్చును, విద్యా వంతుడు కావచ్చును. కానీ సర్వజ్ఞుడు కాలేదు. శోకమును నివారణ చేసుకొనే మార్గమునకు ఉపాయము బోధించేదే ఈ ఆత్మవిద్య.

'తరతి శోకమాత్మవిత్' శోకం దాటటానికి ఆత్మజ్ఞానమే మార్గం. అన్యమార్గాలచే శోకం నివారణ చేసుకోటానికి వీలుకాదు. కనుక బ్రహ్మ విద్యయే పరమావధి. దాని కొరకు గీతను ఆశ్రయించవలసి యున్నది.

భగవద్గీత యొక్క స్వరూపము మొట్ట మొదట హృదయంలో చిత్రించుకోండి. భగవద్గీత చెప్పిన సారము ఏమిటి? ఒకడు జ్ఞాన మంటాడు. ఒకడు భక్తి అంటాడు. ఒకడు కర్మ అంటాడు, మరొకరు యోగమంటారు. వారి వారి స్థాయిలో వారికది సత్యము కావచ్చు. ఒక మనిషి యొక్క సరియైన రూపాన్ని గుర్తించాలంటే కాళ్ళనుంచి తలదాక చూచి నప్పుడే ఫలానా మనిషి అని మనము నిర్ణయించవచ్చు. కేవలం పాదములు చూచి గుర్తించలేము. ముఖము చూడాలి.

భగవద్గీత మొట్టమొదటి శ్లోకం -

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ

ఈ శ్లోకంలో మొదటి పదము 'ధర్మ' భగవద్గీత కడపటి శ్లోకం

యత్రయోగీశ్వరః కృష్ణోయత్రపార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువానీతిర్మతిర్మమ

ఈ శ్లోకంలోని కడపటి పదం 'మమ'. అక్కడ ధర్మ ఇక్కడ మమ ఈ రెండూ చేరిస్తే 'మమధర్మ' బోధించింది గీత. కనుక ఎవరి కర్తవ్యం వారు నిర్వర్తించుకొనేటట్లు చెప్పేదే గీతయొక్క ప్రధానమైన బోధ.

విద్యార్థులు విద్యార్థుల కర్తవ్యాన్ని, ఆశ్రమాలలోని బ్రహ్మచారులు బ్రహ్మచారుల కర్తవ్యాన్ని, యువకులు యువకుల కర్తవ్యాన్ని, పెద్దలు పెద్దల కర్తవ్యాన్ని, గృహస్థులు గృహస్థుల కర్తవ్యాన్ని, సమాజంలో భక్తులు భక్తుల కర్తవ్యాన్ని, గృహిణులు గృహిణుల కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలి. ఎవరి స్థానమునకు వారు తగిన దానిని కర్తవ్యంగా భావించి నిర్వర్తించేటట్లు చెప్పేదే గీత. ప్రతి విషయమందు కూడను ఎవరి మార్గం వారికి నిరూపింప జేసేది భగవద్గీత. తనకర్తవ్యాన్ని నిర్వర్తించుకొంటూ మానవుడు ఆదర్శవంతమైన జీవితం ఐడియల్ లైఫ్ తీర్చిదిద్దుకొనేవాడుగా తయారు కావాలి. అర్జునుడు గృహస్థుడే. అతని కర్తవ్యం యుద్ధం నిర్వర్తించటమే. మోహం చేత, అభిమానంచేత, మమకారం చేత తపించుచున్న అర్జునకు శ్రీ కృష్ణుడు నిజకర్తవ్య ధర్మం బోధించి మంచిమార్గంలో నిలబెట్టాడు. ఇది నరులందరికీ ప్రబోధమే - దీనిని అందరూ అర్థం చేసుకోవాలని ఆశిస్తూ మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను.

# తుభ్యం నమోస్తు

ఓంకారస్వర మంగళాచరణ మంత్రోద్యన్మహా బ్రహ్మణీ !
ఐంకారోదిత సామగానరస సత్యానంద చిద్రూపిణీ !
హ్రీంకారోజ్జ్వల బిందు తర్పణ కళాప్రేమైక చింతామణీ !
శ్రీంకారోపరి శారదా ! శతనుతుల్ శ్రీసాయి నారాయణీ !

పరమేశ్వర ! పర్తీశ్వర !
కరుణాకర ! సత్యసాయి ! కామితదాయీ !
నిరతము నీపాదంబులు
మరువని జ్ఞానమ్ము నిమ్ము మానస నిలయా !

నా మనో మందిర సుఖాసనమ్ము పైన
సుస్థిరమ్ముగా వచ్చి కూర్చుండు మయ్య !
నన్ను నడుపు – ఈ బృహదరణ్యమ్ములో ప్ర
శాంతిగా ప్రయాణము కొనసాగుటెట్లు ?

# గీతాత్రయం

శ్రీ కృష్ణభగవానుడు మూడు గీతా ప్రబోధాలు చేశాడు. రెండు అర్జునుడికి మరొకటి ఉద్ధవుడికి వినిపించాడు. ఉద్ధవుడికి ఉపదేశించింది ఉద్ధవగీతగా ప్రసిద్ధి పొందింది.

ఈమూడు వేదశాస్త్ర ఉపనిషత్ సార సంగ్రహాలే. ఉద్ధవగీత వచనంలో లోగడ వెలయించాను. మొదటిది భగవద్గీత. పార్థుడు యుద్ధ రంగంలో బంధుహింసకు భయపడి అస్త్ర సన్యాసం చేసి చతికిల పడ్డప్పుడు ఉత్సాహం మేళవించి మానవజీవన పరమార్థతత్త్వాన్ని ప్రబోధం చేశాడు. ఈ ప్రబోధమే భగవద్గీత.

తత్ఫలితంగా అర్జునుడు మహారణరంగంలో విజయుడై విజయ దుందుభి మ్రోగించాడు. ధర్మరాజ్యం స్థాపించబడింది.

కొన్ని సంవత్సరాలు దొర్లి పోయాయి. రాజ్య కార్యకలాపాలలో కొంత విశ్రాంతి లభించింది. అధ్యాత్మవిద్యను బాగా లోతుగా అవగాహన చేసుకోవాలని అర్జునుడికి ఆలోచన కలిగింది. వెంటనే శ్రీకృష్ణదేవుణ్ణి దర్శించి జ్ఞానం అర్థించాడు. ఆత్మజిజ్ఞాస అవసరం అని గుర్తించి శ్రీకృష్ణ పరమాత్మ 'ఉత్తరగీత' ఉపదేశించాడు.

ఉత్తరగీతను వ్యాసులవారు మహాభారతంలో అశ్వమేధపర్వంలో వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం అధిక ప్రతులలో ఇది కనిపించడం లేదు. అది మన దురదృష్టం.

శ్రీమచ్ఛంకరాచార్య గురుదేవులైన గౌడపాదాచార్యులవారు ఇది వ్యాస భారతం అశ్వమేధ పర్వం లోనిది అని భాష్యం వెలయించారు. ఇది చక్కని వేదాంత గ్రంథం.

శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన రెండు గీతా ప్రబోధాలను ప్రస్తుతం భగవాన్ శ్రీసత్యసాయీశ్వర కృపాబలంచేత నా శక్తికొలది స్వేచ్ఛా వ్యాఖ్యానం చేశాను. విద్వన్మణులు గుర్తింతురు గాక !

– శాంతిశ్రీ

# గీత ప్రశాంతి దాత

గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర విస్తరైః ।
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మ వినిస్సృతా ॥

శ్రీకృష్ణపరబ్రహ్మమూర్తి స్వయంగా ఈ గీతామృతం నరుడికి వినిపించాడు. ఇది నరులందరికీ అన్నివేళలా కర్తవ్యం బోధిస్తుంది. ఎప్పుడు ఏ విధంగా నడుచుకోవాలో తెలియజేసే మార్గదర్శి ఇది. ఇది మహాత్ములకు సయితము చేయూతనిస్తుంది. ఇది అన్ని శాస్త్రాలసారం. ఇది దగ్గరుండగా మరొక శాస్త్రం చూడవలసిన అవసరం లేదు. ఈ గీతను అర్థం చేసుకొని ఆచరణలో పెట్టగల్గితే మానవుడు పూర్ణ మానవుడై మాధవుణ్ణి చేరగలుగుతాడు.

వేదోపనిషత్తులు గోవులై నిలిచాయి. కృష్ణుడు గోపాలుడై గోవులను పోషిస్తున్నాడు. అర్జునుడు లేగదూడయై గోవులను జేరవచ్చాడు. దూడను చూడగనే ఆవులకు చేపువచ్చింది. గోపాలుడు ఆవులను చేపనిచ్చి పాలుపితుక సాగాడు. నరులు ఈ గీతామృత క్షీరం తనివితీరా త్రాగసాగారు. గోపాలుడైన శ్రీకృష్ణదేవుడు క్షీరదాత అయినాడు. దూడ అనే జ్ఞానార్థిని చూడగనే వేద ఉపనిషత్ గోవు చేపుకువచ్చి జ్ఞానక్షీరం కురిపించ సాగింది. ఆకలిగొన్న ఆర్తులందరూ కడుపునిండ పాలు త్రాగుతూనే ఉన్నారు. ఆ జ్ఞాన క్షీరమే ఈ గీతాసార దుగ్ధం. ఇక త్రాగండి కమ్మని గుమ్మపాలు.

పూర్ణప్రేమ యందె పుట్టును సౌఖ్యంబు
సత్య ధర్మ ప్రేమ శాంతులబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట సాయిమాట !

– బాబా

# 1

" ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ "

" సంజయ మంత్రీ ! నీకు దూరదర్శన శక్తి అద్భుతంగా ఉంది. ఇపుడు కురుక్షేత్రరణరంగంలో జయాపజయాలు న్యాయాన్యాయాలు ధర్మాధర్మాలు తేలిపోతాయి. రంగంలో నా కుమారులు మరియు పాండుపుత్రులు ఏమేమి చేస్తున్నారో పరిశీలించి చూచి చెప్పు" అని ధృతరాష్ట్ర మహారాజు సంజయ మంత్రిని తనవద్ద కూర్చోబెట్టుకొని అడుగుతున్నాడు. అపుడు సంజయుడు కురుక్షేత్రాన్ని నాల్గుప్రక్కలా చూచి ఈ విధంగా వినిపించసాగాడు-

" మహారాజా ! అదుగో ! మీ పెద్ద కొడుకు. దుర్యోధనుడు తన సేనా వ్యూహాలను చూచి పాండవ సైన్య విభాగాలను నిశితంగా పరిశీలించి ద్రోణాచార్యులతో ఇలా అంటున్నాడు.

ఆచార్యదేవా ! నీశిష్యుడు ధృష్టద్యుమ్నుడు పాండవ పక్షంలో సైనిక వ్యూహం కూరుస్తున్నాడు. చూశారా ! ఆ సైన్యంలో భీమార్జునులతో సమానమైన సాత్యకి, విరాటరాజు, ద్రుపదుడు, ధృష్టకేతుడు, కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, అభిమన్యుడు, శైబ్యుడు, ఉత్తమౌజుడు, ఉప పాండవులు కొమ్ములు కాచియున్నారు. ఇంకా ఇంకా మిగిలిన యోధాగ్రేసరులు శస్త్రాస్త్రాలు బూని ఆకలిగొన్న పులుల వలె యున్నారు. చూడండి.

ఇక మనసైన్యంలో తమరూ, భీష్మాచార్యులవారూ, కర్ణుడూ, కృపాచార్యులు మీ అశ్వత్థామ, మా వికర్ణుడూ, భూరిశ్రవుడు, జయద్రధుడు మొదలైన వీరులున్నారు. ఇక్కడ భీష్మ పితామహుడు సేనాధ్యక్షుడిగా ఉండి సేనా పర్యవేక్షణ చేస్తున్నాడు.

పాండవుల వైపు భీమసేనుడు సేనాపతిగా ఉన్నాడు. పాండవసేన అపరిమితం. మనసేన పరిమితం. జాగ్రత్తగా చూడు.

సరే ఇక తమరంతా యథాస్థానాలలో నిలిచి తాతగారిని కనిపెట్టి ఉండండి. తాతగారి బలమే మనకు కొండంత బలం. ఈ మాటలు వినగానే వృద్ధకేసరికి మహా సంతోషం కలిగింది. ఇంతలో ముహూర్తం సమీపించింది. పితామహుడు సేనాగ్రభాగంలో నిలిచి శంఖం పూరించాడు. అది సింహం గర్జించినట్లే ఉంది. భీష్ముడి సమరోత్సాహం చూచి దుర్యోధనుడికి మేను పులకరించింది. సైన్యం సిద్ధం అన్నట్లు నాలుగు ప్రక్కల నుంచి సేనాధిపతులు తమ తమ భేరీలు మ్రోగించారు. ఆ సూచనలు అందుకొని పాండవసైన్యంలోని వీరాధివీరులు శుభంకర శంఖాలు పూరించారు. శ్రీకృష్ణ భగవానుడి పాంచజన్యం మూడు లోకాలలోనూ ప్రతిధ్వనించింది. ధర్మరాజు అనంత విజయం, భీముడు పౌండ్రం, అర్జునుడు దేవదత్తం, నకులుడు సుఘోషం, సహదేవుడు మణిపూరం మంగళకరంగా మారుమ్రోగించారు. మిగిలినవారు తమ తమ వాద్యాలు మిన్నుముట్టేలా ధ్వనులు చేశారు. పాండవ సేనా నివహంలోని భేరీభాంకార రావాలు దుర్యోధనాదుల హృదయాలకు కొంచెం జంకునే కల్గించాయి.

హే మహారాజా ! అపుడు గాండీవం పట్టిన కౌంతేయుడు ఒకసారి కౌరవ బలగాన్ని చూస్తూ సారథి స్థానంలో కూర్చున్న శ్రీకృష్ణ స్వామితో ఇలా అన్నాడు. బావా ! ఈ యుద్ధానికి వచ్చిన వారిని పరికించాలని ఉంది. రెండు సేనల మధ్యలోనికి రథం కొంచెం పోనియ్యి అన్నాడు. శ్రీకృష్ణుడు అట్లే అని రథాన్ని ముందుకు తోలాడు. పార్థుడు పరిశీలిస్తున్నాడు.

భూరిశ్రవాది పితృసమానులు, భీష్మాది పితామహులు, ద్రోణాది గురుదేవులు, శల్యాది మేనమామలు, సుయోధనాది సోదర తుల్యులు, లక్ష్మణాది పుత్రసమానులు, అశ్వత్థామాది మిత్రగణాలు, కృతవర్మాది స్నేహ పాత్రులు అర్జునుడికి కనిపించారు. దయార్ద్ర హృదయం గల అర్జునుడు వారిని చూచి ఘోరమైన ఈ మహాయుద్ధంలో పూజ్యులైన పెద్దలనూ, అయిన వారినీ అంతం చేయాలా ! ఆయుధం పట్టేది ఆప్తులను హతం చేయటానికా ! అని తలంచి ఒక్కసారి నీరుగారి రథం మీద కుప్పకూలి పోయాడు. శ్రీకృష్ణుడు ఈ హఠాత్ పరిణామానికి కొంచెం ఆశ్చర్య పడ్డాడు. అపుడు అర్జునుడిలా అన్నాడు. బావా ! బంధువులతో భండనం చేయలేను, పూజనీయులపై కత్తులు దూయలేను. గురువులపై క్రూరబాణాలు వేయలేను. ఏమిటీ ఘోరకార్యం ! నాకు విజయం వద్దూ ! రాజ్యం వద్దూ !ఈ నెత్తురు కూడు నేను తినలేను ! అయినవారందరిని హతం చేయలేను. కొందరు దుర్మార్గులుండవచ్చు. అందుకై అందరినీ ఊచకోత కోసి సర్వం నాశనం చేయలేను. ఒకవేళవారే నన్ను చంపటానికి వచ్చినట్లయితే చచ్చున్నాపోతాగానీ నేను కత్తిపట్టి కుత్తుకలు కోయలేను. ఇది మహాఘోరం మహా

మారణకాండ ! నావల్లకాదు ! బావా ! నావల్లకాదు అని పార్థుడు పసిబాలునివలె రణరంగం మధ్యలో బాణాసనం వదలి కూర్చుండి కన్నీరు కార్చసాగాడు. రాజా ! అని సంజయుడు వినిపిస్తున్నాడు.

ఇక్కడ ప్రథమ శ్లోకంలో ధృతరాష్ట్రుడి నోటిగుండా అనుకోకుండా భవిష్యద్వాణి వినిపిస్తుంది. శ్లోక ప్రారంభం 'ధర్మ' శబ్దంతో శ్లోకం మధ్య 'కురు' శ్లోకం చివర 'జయ' దీని భావం 'ధర్మంచేయి – జయం లభిస్తుంది.' అది ధర్మరాజుదే 'జయం' అని ధ్వని గమనించాలి.

ప్రథమ శ్లోకంలో ధర్మక్షేత్రే లో 'ధర్మం' గీత చివరగల 'మతిర్మమ' మమ ధర్మం గీత అని సారాంశం.

మనసు నాధారముగ గొను మానవుండు
పశువుకంటెను హీనుడై పతనమగును
బుద్ధినాధారముగ గొన్న బుధజనుండు
పశుపతిగ మారునని రూఢి పలుకు సాయి

– శ్రీ సత్యసాయి బాబా

## 2

ఇదియేమీ ! ఇదియేమి ! యేమిటి ! కిరీటీ ! ఈ వృధావిస్మయా
స్పద నిర్విణ్ణత కర్ధమేమి ! గ్రహదోషమ్మో ! పరీహాసమో !
మదిరాపాన మొనర్చితో ! నిదురలో మాట్లాడు చున్నావొ ! నీ
హృదయంబున్ పదిలంబు చేసుకొను మోయీ ! సుంత వీరాగ్రణీ !

– కరుణశ్రీ

మహారాజా ! ఈ విధంగా అర్జునుడు అస్త్రం సన్యసించి విషాదంతో కూర్చుండి పోతే హృషీకేశుడు ఆశ్చర్యపడి అతనితో ఇలా అన్నాడయ్యా రాజా !" అని సంజయుడు రాజుకు వివరిస్తున్నాడు–

"సవ్యసాచీ ! నీ ప్రతాపాగ్నితో లోకాలను తపింపచేసినవాడవు. మహారుద్రుణ్ణే సమరంలో నిలదీసిన మొనగాడవే. నేడు అంతా సిద్ధమైన తరువాత ఇంత బెంబేలు పడిపోయావేమిటి? ఈ కన్నీళ్ళేమిటి? ఈ వణుకు ఏమిటి ? ఈ చూపులేమిటి ?

ఈ సమయంలో ఇట్టి హృదయ దౌర్బల్యం మంచిదికాదు. ఇది కాపురుషలక్షణం కానీ కారుణ్యం అనిపించుకోదు. ఇది భూతదయా, జాలీ, కాదు. ఇట్టి సంకట సమయంలోనే స్థైర్యం ధైర్యం కలిగి ఉండాలి. ప్రతిపక్షంపై ఇలా జాలిపడటం దుఃఖ పడటం తగదు. దీనివల్ల అపకీర్తి వస్తుంది. అధోగతి కల్గుతుంది. యుద్ధం చేయటానికి వచ్చిన అరివీరులు నిన్నుచూచి " పిరికిపంద – మమ్మల్ని చూచి పారిపోయాడు " అని నవ్వుకొంటారు. ఇది అవివేకం అజ్ఞానం అయోమయం. ఇది క్షణిక దౌర్బల్యం. నీవంటివాడికిది తగదు. ముందు అనుకొన్నట్లు అందరిముందు ప్రతినబూనినట్లు సమరం సాగించు. ఇది నీ ధర్మం.యుద్ధం చేయటానికి సిద్ధపడు. శ్రీకృష్ణదేవుడిలా చెప్పగా అర్జునుడు అన్నాడు గదా –

'బావా ! నా మనస్సు బాగాలేదు. నేను పోరుకు భయపడి కాదు. బంధువులపైనా ! అందులో గురువుల పైనా ! ఆప్తవర్గంపైనా ! అసిధారా వర్షం కురిపించేదా ! కులగురువులతో కొట్లాడుటయా ! స్నేహితులపై మారణాస్త్ర ప్రయోగమా! ఎంత ఆలోచించినా ! ఈ యుద్ధం నావల్ల కాదు. ఈ నెత్తురు కూడునేను తినలేను. జీవించటానికి రాజ్యాలే లేవా! బిచ్చమెత్తు కొని బ్రతకవచ్చు. అయిన వారిని చంపుకొని ఏమి బావుకొంటాను?

వలదు జయలక్ష్మీ వికాసము
వలదు రాజ్య రమా విలాసము
వైభవోజ్జ్వల సౌధవాసము
వలదు వలదయ్యా !

నేనేం చేసేది ? నాకు శోకం ముంచుకువస్తోంది. నా వారు నాకు కావలసిన వారు వీరితో ఎలా యుద్ధం చేసేది? నా హృదయం ఘోషిస్తోంది స్వామీ ! ఈ మహా మారణ హోమంలో పడి దేశం భ్రష్టమై నష్టమై కష్టాల పాలవుతుంది. వీరులు చనిపోయి కులస్త్రీలు విధవలవుతారు. అనేక వేల మంది అనాథలై అగచాట్లు పడతారు. ధర్మాలు తారు మారవుతాయి. నేను దేశాన్ని సర్వనాశనం చేసిన వాణ్ణి అవుతాను. నీవే ఆలోచించు. ఏది మంచిదో ! ఏది చెడ్డదో ! నాకు అర్థం కావడం లేదు. యుద్ధం చేయటానికే వచ్చాను. కానీ నాకీ ఆత్మఘోష ఒక్కసారి పెల్లుబికింది. ఈ స్థితిలో నన్ను నీవే కాపాడాలి. నా శరీరం నా స్వాధీనం తప్పుతోంది. ఏమీ తోచడం లేదు. నీవే గతి స్వామీ ! నీవే ! అని శోకాతురుడైనాడు అర్జునుడు. అపుడు రాజా! శ్రీకృష్ణదేవుడిలా చెప్పాడు అని సంజయుడు వివరిస్తున్నాడు–

"నా మనఃక్షేత్రమందు సంతతము జరుగు
ధర్మ నిర్ణయ న్యాయ యుద్ధమ్ములోన
నరుడు గాండీవమును విడనాడినాడు
కృష్ణ ! కర్తవ్యబోధ గావింపవేల ! "

– శాంతిశ్రీ

అర్జునా నీవెంతో దృఢనిశ్చయుడవు అనుకొన్నాను. సమయం కాని సమయంలో నీవిలా అయిపోతావని తలంచలేదు. అందరూ యుద్ధానికి సిద్ధమై ఖడ్గాలు ఝుళిపిస్తుంటే ఇపుడు ఎక్కడ నుంచి ముంచు కొని వచ్చిందయ్యా ఈ శోకం ! ఈ కాతరత నీకు తగంది సుమా !

అశోచ్యానన్వశోచస్త్వం
ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే ।

శోకింప తగని వారికై శోకిస్తున్నావు. మహా పండితుడివలె మాట్లాడు తున్నావు. తెలివితక్కువగా గప్పాలు కొడుతున్నావు ! నీ ఉపన్యాసం ఆపు. ఇది అనర్థదాయకం. ఆ ఆలోచనలు ఈ సమయంలో రాకూడనివి. ఇది నీ హృదయ దౌర్బల్యం అంటారు. ఏమిటి నీకు తెలిసింది. జ్ఞానం గూర్చి నీకు ఏం తెలుసు. నేను చెప్తాను విను-

నిజమైన జ్ఞానులు మరణించే వారిని గూర్చి ఏడవరు. జీవించే వారిని చూచి సంతోషించరు. నీవు మరణిస్తే ఎలా ! నేను లేకపోతే నీవెలా ఉంటావు అని, దుఃఖించేది అల్పులు. ఇది మనశ్చంచల స్వభావం. హృదయ దౌర్బల్యం కాపురుష లక్షణం. ఇవి నీవంటి వీరపురుషుడికి తగవు. నీకు అసలు సంగతి చెప్తాను విను-

ఈ రాజులు, రంగప్పులూ, నీవు, నేను అందరమూ పూర్వమూ ఉన్నాము. ఇప్పుడూ ఉన్నాము. ముందూ ఉంటాము. ఎప్పుడూ ఉంటాము. ఈ శరీరాలు మాత్రం వస్తుంటాయి, పోతుంటాయి. శరీరాలు పోయినా ఉన్నా, మనం మాత్రం నిత్యం ఉంటాము. దేహధారులమైనప్పుడు జీవులకు బాల్యయౌవన వార్ధక్యాలు వస్తుంటాయి. దేహానంతరం జీవులకు ఎట్టి మార్పు ఉండదు. జ్ఞానులు ఈ సంగతి తెలుసుకొని నిశ్చితంగా ఉంటారు. దేహం రథం, దేహి రథికుడు ఈ రథాన్ని నడిపేవాడు సారథి. జన సారథి ఈ శ్రీకృష్ణదేవుడు. జీవనరంగమే రణరంగభూమి. ధర్మ అధర్మాలు న్యాయ అన్యాయాలు మంచి చెడ్డలు రెండు పక్షాలు యుద్ధం చేస్తున్నాయి. దేహధారులకు విషయేంద్రియ సంయోగం వలన శీతోష్ణాలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలు కల్గుతుంటాయి. ఇవన్నీ అనిత్యాలు. పుట్టడం, చావటం సహజం. ఈ సహజానికి ఏడవటం తెలివితక్కువ.

సుఖదుఃఖాలకు చలించనివాడే ధీరుడు. వాడే అమృత స్వరూపుడు. అట్టివాడే విజయుడు. సహనం మనిషికి సహజకవచం. దుఃఖ నివారణకు ఇతర చర్యలకంటె కష్టసహనమే గొప్పది. కష్టనష్టాలకు వ్యథ చెందని వాడే అమృత పదవికి అర్హుడు. ఈ సహనం లేనివాడు అల్పుడు. అతి సామాన్యుడు. మానవుడు జ్ఞానంవలన అసామాన్యుడూ అతిలోక శూరుడు అవుతాడు. శీతోష్ణాది కష్టనష్టాలు అభ్యాసం వలన సహించవచ్చు. అభ్యాసం వలన అద్భుతమైన ఆత్మజ్ఞానం అలవడుతుంది. అనాత్మ వస్తువులకు శాశ్వతత్వం లేదు. ఆత్మ వస్తువులకు నాశనం లేదు. ఆత్మవేత్తలు ఇది గుర్తించి వర్తిస్తుంటారు. ఆత్మ అవినాశి. అవ్యయం. నిత్యం, సత్యం. అవ్యయాత్మకు అవనతిలేదు. ఆత్మ ప్రత్యక్ష ప్రమాణాలకు అంతుపట్టదు. ఆత్మకు అంతం లేదు. అది శాశ్వతం. అట్లే నీవు శాశ్వతుడవు. నీవు ఆత్మ స్వరూపుడవు. కనుకనే పండితులు సభలో మాట్లాడేటపుడు 'ఆత్మ స్వరూపులారా' ! అని సంబోధిస్తారు. నీవు దేహం అని భ్రమించబోకు. దేహాలు

దహించుకొనిపోయేవి. శరీరాలు జీర్ణమైపోయేవి. నశించిపోవటం దేహాలకు సహజం. ఒకరు ఆపితే ఆగేవి కావు. ఈ పోయే దేహాలకు గాను నీ ధర్మం నీవు వదులు కోవద్దు. భ్రమలో పడి కర్తవ్యం మరువవద్దు. దేహాలు పోతాయి కానీ ధర్మం శాశ్వతం. నీవు శాశ్వత ధర్మం నిర్వర్తించు.

దేశాన్ని రక్షించేది ధర్మం. ధర్మువు ధరించి దేశాన్ని కాపాడు. ధర్మచ్యుతియైన దేశం ఎంత ఆయుధబల సంపన్నమైనా పతనం కావాల్సిందే. ధర్మువు త్యజించరాదు. ఈ దేహాలు వస్త్రాలు ధరించినట్లే నరుడు ధరించి వదిలివేస్తుంటాడు. ఈ ఆత్మ పురుషుణ్ణి ఏ ఆయుధాలు సంహరించలేవు. అగ్ని కాల్చలేదు. నీరు ముంచలేదు. ఆత్మ చిరంజీవి. ఆత్మ సత్యం. అది నిత్యం. అర్జునా ! నీవు తెల్లనైన పరిశుద్ధ హృదయం గలవాడవు. ఆత్మజ్ఞానం అర్ధం చేసుకో ! అన్యులకు ఆత్మ అర్థం కావటం చాలా కష్టం. ఆత్మ ఆయావ్యక్తుల స్థాయిని బట్టి దర్శనమిస్తుంది. ఒకే ఆత్మ కొందరికి ఆశ్చర్యంగానూ, మరికొందరికి అతి సుందరం గానూ ఇంకా కొందరికి ఆనందంగానూ అనుభవమవుతుంది. ఆత్మను గూర్చి వినేవారూ కనేవారూ తలంచే వారు కూడ అద్భుతంగా దర్శనమిస్తారు. ఆత్మ చాలా చిత్ర విచిత్రమైనది.

పార్థా ! దేహాలు పోయినా దేహంలోని ఆత్మ పోదు. దేహాలు ఎంత ఏడ్చినా పోయేవే. కనుక దుఃఖంమాని ఆత్మ జ్ఞానం కలిగి నీధర్మం నీవు నిర్వర్తించు. నీకు నీ ధర్మం అనాయాసంగా ప్రాప్తించినవరం. దానిని సద్వినియోగ పరచుకోవటం నీ ప్రధాన కర్తవ్యం. క్షత్రియులకు యుద్ధం ధర్మం. ఇది నీ అదృష్టం వల్ల నీకు లభించింది. యుద్ధం చేయకపోతే ధర్మం తప్పిన వాడవవుతావు. అపకీర్తి వస్తుంది. దాని ఫలం దారుణం. స్వధర్మ త్యాగం వలన మనిషి పతితుడవుతాడు. అపకీర్తి కంటె మృత్యువు మంచిది. నీవు యుద్ధం మానితే కర్ణాదులు నిన్నుచూచి నవ్వుతారు. భయపడ్డావని పరిహాసం చేస్తారు. అవమానిస్తారు. నీవు యుద్ధంలో వీరమరణం చెందినా నీకు వీరస్వర్గం వస్తుంది. గెలిచావంటే మహారాజ్యం, మహాభోగం. రెండు విధాలా నీకు శ్రేయస్సే లభిస్తుంది. నీవు యుద్ధం చేయటానికి నిశ్చయ బుద్ధితో నిలబడు. యుద్ధంలో జయాపజయాలు దైవాధీనాలు. నీవు జయాప జయాలను సమంగా భావించు. ఇలా తలంచి యుద్ధం చేశాంటే నిన్ను ఏపాపం అంటుకోదు. ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి. ఇంకనూ అర్థం కాకపోతే కర్మరహస్యం చెప్తాను. ఇది తెలుసుకొంటే కర్మబంధం నుంచి బయట పడతావు. మోక్షమార్గమైన నిష్కామ యోగంలో ఎన్నడైనా ఎక్కడైనా లోపం జరిగినా ఫలం విఫలంకాదు. ఇది ఈశ్వరార్పణ బుద్ధితో జరుగుతోంది. కనుక దీనికి ఏదోషమూ

సోకదు. దీనివలన జనన మరణ భయాలు తొలగి పోతాయి. నిష్కామ కర్మలో బుద్ధి ఏకనిష్ఠంగా ఉంటుంది. ఒకవేళ కొన్ని లోపాలు జరిగినా నష్టంలేదు. యథాశక్తి నిష్కామంగా కర్మలు చేయవలసిందని విధివాక్యం ఈ నిష్కామ కర్మ విధానంలోనూ కామ్య కర్మ విధానంలోనూ భేదం ఉంది. కామ్య కర్మలు చేసేవారు సామాన్యులు. వారు కోరికలు తీర్చుకొని సుఖించాలని కార్యకలాపాలు చేస్తుంటారు. యజ్ఞయాగాలు నిర్వహిస్తుంటారు. దానధర్మాలు చేసి స్వర్గ సౌఖ్యాలు పొందవచ్చు అని వారి ఆశయం. వారు వాంఛలతో నిండిన మనస్సు గలవారు. స్వర్గభోగకాముకులు. కామ్యాసక్తులకు అంతఃకరణ శుద్ధిలోపిస్తుంటుంది. ఏ దేవత కోరిక తీరుస్తుందంటే ఆదేవతను పూజిస్తారు. వారు దేవుడితో బేరాలాడుతుంటారు. ఏ పని వలన ఎంత లాభం వస్తుందని ఆలోచన సాగిస్తుంటారు. కర్మకాండతో కూడినది వేదంలో ఒక భాగం. వేదం త్రిగుణాత్మకం. అందులో సకామ విషయాలు నిష్కామ విషయాలు వర్ణించబడ్డాయి. సకామవిషయ భాగాలు బంధహేతువులు. నిష్కామ విషయ విభాగాలు పరమపద హేతువులు. నీవు నిష్కామ కర్మచేయి. సత్త్వం ఆశ్రయించు. నీ యోగక్షేమాలు నేను చూస్తాను. నీవు ధర్మం చేయి. ఒక పెద్దవెల్లువలో నూతులు చెరువులు మునిగిపోయి కనుపించనట్లు బ్రహ్మజ్ఞానంలో వేదోక్తమైన వివిధ కర్మలు మగ్నమై యుంటాయి. అపుడు ఈశ్వరారాధనీయకర్మలే చేస్తాను అనటానికి వీలులేదు. నిత్యనైమిత్తిక ధర్మ కర్మలు అన్నీ చేయవలసి వస్తుంది. తత్త్వ జ్ఞానం తెలియగోరేవాడు కర్మలు చేయాలి. చేయకతప్పదు. కులధర్మాలు విధియుక్తంగా చేయటం ప్రతివాని కర్తవ్యం. అయితే జ్ఞాని వాంఛారహితంగా చేస్తాడు. కర్మ ఫలాలపై ఆసక్తి చూపడు. ఫలాపేక్ష లేకుండా చేస్తాడు. కామం కలిగి చేసేవారు బంధితులు అవుతారు. ఫలాపేక్షాపరులు సామాన్యులు. నీవు నిష్కామంగా కర్మాచరణ సాగించు. ఇది ఒక యోగం అనుకొని చేయి. ఫలం ఈశ్వరార్పణంగా చేయి. సమబుద్ధితో నీ కర్తవ్యం నీవు చేయడం నీ ధర్మం. దీనివలన నీకు పరమపదం లభిస్తుంది. నీ బుద్ధిని పరమాత్మపై నిలుపు. అపుడు తత్వం అర్థమవుతుంది. ఇది స్థిత ప్రజ్ఞలక్షణం. ఇది ఆలకించి అర్జునుడు కృష్ణపరమాత్మను అతి భక్తితో ఇలా అడిగాడు.

" ఓం పరంధామా ! విశ్వనాథా ! తమరు సర్వజ్ఞులు, స్థిత ప్రజ్ఞావంతుని లక్షణాలు ఇంకా ఏమిటి? ఎలా అతడు ప్రవర్తిస్తాడు? వివరించ ప్రార్థన". అర్జునుడి ఆసక్తి చూచి కృష్ణ ప్రభువు ఇలా వివరించి చెప్పాడు. "ధనంజయా ! జ్ఞానం విషయంలో ఎంతగానైనా అడగాలి. మంచిదే. విను. స్థితప్రజ్ఞుడైనవాడు తనలో తాను సంతృప్తిగా ఉంటాడు. కోర్కెలను జయిస్తాడు. దుఃఖానికి కృంగడు.

సుఖానికి పొంగడు. అతనికి ఒకరిపై మమకారం కానీ మరొకరి పై ద్వేషం కానీ ఉండవు. భయం అనేది ఆయనవైపు కన్నెత్తి చూడదు. అన్ని సందర్భాలలో అతడు సమచిత్తంతో ఉంటాడు. అన్ని ఇంద్రియాలు అతనికి వశమై ఉంటాయి. తాబేలు తన అవయవాలు తనలో ముడుచుకొని ఉన్నట్లు స్థితప్రజ్ఞుడు తన ఇంద్రియ శక్తులను తన వశంలో నిల్పుకొని వాటిచేత పనిచేయించుకొంటాడు కానీ తాను వాటికి వశం కాడు. ఇంద్రియజయం సకల దేశాలపై విజయంకంటె చాలా గొప్పది. స్థిత ప్రజ్ఞుడు మహాచక్రవర్తి కంటె మిక్కిలి గొప్పవాడు.

అర్జునా ! ఎంత తపస్సు చేసినా విషయ వాసనలు నివృత్తికావు. ఒక్క ఆత్మ సాక్షాత్కారం వల్లనే అవి హరిస్తాయి. దీనికి ఈశ్వరానుగ్రం ముఖ్యం. విషయ చింతన వలన కామం, కామం వలన క్రోధం, క్రోధం వలన అవివేకం, అవివేకం వలన స్మృతి భ్రంశం, స్మృతి భ్రంశం వలన సద్విచార భ్రష్టం క్రమక్రమంగా జరుగుతుంటాయి. దీనితో యోగియైనవాడు కూడా భోగియై జోగియై రోగి అవుతాడు. విషయ చింతన లేనివాడి చిత్తం నిర్మలంగా ఉంటుంది. చిత్తం నిర్మలంగా ఉన్నవాడికి దుఃఖాలు బహుదూరం. నీవు నిర్మలమైన బుద్ధితో ఆత్మజ్ఞానం అర్థం చేసుకో.

సామాన్యులు సాధారణంగా పగలు మేలుకొని పనులు చేసుకొని రాత్రి వేళల నిద్ర పోతారు. సామాన్యులు చేసేది చూసేది మాయా సంసార నాటకం. రాత్రి అలసటతో తమస్సులోకి జారిపోతారు. జ్ఞానులు పగలు నిద్రపోతారు. రాత్రి మేల్కొంటారు. అంటే జ్ఞానులు సామన్యుల వలె పగలు సంసారంలో పడి సంపాదనలో కాలం వ్యర్థపుచ్చక కనులు మూసుకొని కమలాపతి వైభవాన్ని మననం చేసుకొంటూ ఉంటారు. రాత్రి అజ్ఞానుల వలె తమస్సులో పడిపోకుండా బ్రహ్మసమాధిలో భగవంతునితో మంతనాలాడుతుంటారు. అంటే దివారాత్రాలు జ్ఞానులకు బ్రహ్మచింతన లోనే కాలం దొర్లిపోతుంది. క్షణక్షణం ఈశ్వర కటాక్ష వీక్షణాలతో వారు తలమున్కలవుతుంటారు. నదులెన్నివచ్చిపడినా సముద్రం చెలియలి కట్టను దాటనట్లు ప్రారబ్ధకర్మలు ఎన్నివచ్చినా జ్ఞాని మనస్సు తొట్రు పడదు. శాంతిని కోల్పోదు. 'నేను-నాది' అనే మమకారం లేని యోగీశ్వరుడు పరమ శాంతి పొందుతాడు. ఇంద్రియ విజయమే యోగికి బలం. బ్రహ్మ నిర్వాణస్థితికి అట్టి స్థితప్రజ్ఞ గలవాడే యోగ్యుడు.

నీ కర్తవ్యధర్మ నిర్వహణకు తాతలపైగల గౌరవాదరాలు బంధువులపై గల అనుబంధాలు, మాతాపితలపై గల మమకారాలు ఇతరులపైగల మమతలు స్నేహితులపైగల అనురాగాలు వంటివి అనేకం అసంఖ్యాంగా అడ్డువస్తుంటాయి. ఈ బంధాలను జ్ఞాన ఖడ్గంతో ఖండించుకొని ఆత్మజ్ఞానం వైపు ప్రయాణం

సాగించాలి. విశ్వంలో మంచి చెడ్డ అనేది నీవు ఏమి నిర్ణయించగలవు ! భగవంతుడు చెప్పినట్లు చేయి. ఒక విషయం ఉదహరిస్తాను చూడు –

ఒక ఫలం చూచావు – బాగుంది. రూపం, రంగు, రుచి, చూచి తిన్నావు. ఆఫలమే మరునాడు మలమై బయటికి వచ్చింది. అపుడు అసహ్యపడ్డావు. కానీ వస్తుత ః ఫలం మలం కూడా ఒకే వస్తువు యొక్క రెండు రూపాలు. ఈ మార్పుచెందక పోతే నీకెంత ప్రమాదం వచ్చేది. భగవంతుడు అన్నీ తెలిసిన వాడు. మనశ్రేయస్సుకై అన్ని మార్పులు చేస్తుంటాడు. ఏది చేసినా మనమేలు కొరకే అనేది గుర్తుంచుకో. పండు స్థితి ప్రవృత్తి మార్గం. మలం స్థితి నివృత్తి మార్గం. అట్లే యుద్ధం ముందు స్థితి ప్రవృత్తి మార్గం. యుద్ధం తదుపరిస్థితి నివృత్తిస్థితి శ్రేయోమార్గం. ఇవి రెండూ మంచివే. అని ఈ విధంగా హృషీకేశుడు అంటే ఇంద్రియాధిపతి కృష్ణపరమాత్ముడు గుడాకేశుడికి అంటే ఇంద్రియనిగ్రహం గల అర్జునుడికి సాంఖ్యం బోధించాడు. సాంఖ్యం అంటే జ్ఞానం. జ్ఞాన కాంతికి ఆటంకాలు అనేక సంఖ్యలో ఉన్నాయి. ఈ అడ్డంకులను తొలగించి జ్ఞానం చెప్పేదే సాంఖ్యం.

దాంతులైన వేదాంతులు ఆత్మజ్ఞానాన్ని అనేక కోణాలలో పరిశీలించి పరిశోధనలు చేశారు. అట్టి వారిలో కపిలాచార్యుడు ముఖ్యుడు. ఈయన అంతకు ముందు శాస్త్రాలను పరిశీలించి క్రొత్త మార్గం సూచించారు.ఈ ప్రపంచం అనుకూల, ప్రతికూల శక్తుల సమన్వయం. ఇందు ప్రకృతి శక్తులు ఇరువది నాలుగు జీవతత్త్వం ఒకటి ఈశ్వర తత్త్వం ఒకటి మొత్తం ఇరువదిఆరు శక్తులు. తత్త్వసమ్మేళన ఫలం మానవత్వం. ఇది అనేకత్వంలోని ఏకత్వం. ఈ తత్త్వసంఖ్య విచారణే సాంఖ్యం. ఈ గీతా శాస్త్రంలో రెండో అధ్యాయానికి వ్యాసమహర్షి సాంఖ్యం అని పేరుపెట్టారు. యుద్ధ క్షేత్రంలో అనేక శక్తులు విజృంభించాయి. జీవుడు అర్జునుడు ఈ ప్రకృతి శక్తులు చూచి విషాదం చెందాడు. అపుడు ఈశ్వరుడైన కృష్ణుడు పరతత్వం బోధించి విషాదం తొలిగించాడు. ఇది సాంఖ్యం సారాంశం.

"లెమ్ము ధనుంజయా ! విధి బలీయము – న్యాయముగెల్చు – నిల్చు స
త్యమ్ము – నశించు స్వార్థము – సదా యుగ ధర్మమిదే గదోయి ! క
న్గొమ్మిక అంత్యకాలమున నూర్గురు బిడ్డల తండ్రికైన పిం
డమ్మిడు దిక్కుకల్గదకటా ! గ్రహచారము తప్పి వచ్చినన్ !! "

– కరుణశ్రీ

# 3

కర్మవీరా ! నిల్వబడి నీ
ఘర్మ కణములు తుడుచుకోరా !
ధర్మువును చేబట్టి విజయ
ధ్వజము నెత్తుమురా !

- కరుణశ్రీ

"శ్రీకృష్ణ పరమాత్మా ! కర్మకంటె జ్ఞానం శ్రేష్ఠమని నీ మాటల్లో అర్థమవుతోంది. అయితే నీవు నన్ను ఘోరమైన మారణకర్మ చేయమంటా వేమిటి? నీ మాటలు నన్ను సందిగ్ధంలో పడేస్తున్నాయి. కర్మగొప్పదా ! జ్ఞానం గొప్పదా ! తేల్చి చెప్పు. నన్ను ఊరికే అటూ ఇటూ లాగి నలిపి వేయబోకు" అని అర్జునుడు దిగాలుపడి దీనుడై కన్నీరు పెట్టుకున్నాడు.

అపుడు శ్రీకృష్ణ భగవానుడు ఇలా బోధించసాగాడు- " పార్థా ! కంగారు పడబోకు ! నిదానంగా స్థిమితంగా ఆలోచించు. నేను చెప్పింది- జ్ఞానంలో అభిరుచీ ప్రవేశంగలవారికి జ్ఞాన మార్గం. కర్మమార్గంలో ప్రవేశంగల అందరికీ కర్మయోగం చెప్తూతూ వస్తున్నాను. ఇది వేదాలలో చెప్పబడిందే. చిత్త సంస్కారాన్ని . జ్ఞానం కలవారికి చిత్తం సమాయత్తమౌతుంది. చిత్తం పరిపక్వస్థితి చెందని వారికి కర్మ విధానం అనుసరణీయం. ఇందులో ఒకటి గొప్పదీ ఒకటి తక్కువదీ కాదు. అవసరాన్ని బట్టి వ్యక్తులను బట్టి మార్గాలు ఎన్నుకోవాల్సి ఉంటుంది. చిత్తశుద్ధి కలిగేవరకూ కర్మలు చేయవలసి ఉంటుంది. అసలు కర్మలు చేయకుండా నైష్కర్మ్య స్థితి కలుగదు. కర్మలు చేయకుండా లోకంలో ఏ ఒక్కడూ ఉండలేడు. నిత్య

కృత్యాలు కర్మలే. చూడటం, నడవటం, శ్వాస పీల్చడం, వదలడం, లేవడం, పడుకోవడం అన్నీ కర్మలే. నీ నిత్యకృత్యాలు చేయకుండా ఎలా !

కర్మమున పుట్టు జంతువు
కర్మముననెవృద్ధిపొందు కర్మమున చనున్
కర్మము నరునకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణ మరయన్

-భాగవతం

ఇక సత్త్వ రజస్తమో గుణాల ననుసరించి అందరూ రకరకాలుగా కర్మలు చేస్తుంటారు. కర్మలు చేయటం లేదని చెప్పేవాడు కపటి, మూర్ఖుడు, మోసగాడు. ఈ కర్మలు నిష్కామంగా చేసేవాడు జ్ఞాని. తన స్వార్థం కోసం చేసేవాడు అజ్ఞాని. నిస్స్వార్థంగా, నిష్కామంగా పరమేశ్వరప్రీతికై కర్మానుష్ఠానం చేసేవాడు చిత్తశుద్ధి కలిగి జ్ఞానం పొందిన ముముక్షువు అవుతాడు.

నీవు శాస్త్రంలో చెప్పిన నిత్య కర్మలు చేయి. కర్మలు చేసేవాడు చేయననే ఆత్మవంచకునికంటె సర్వవిధాలా శ్రేష్ఠుడు. కర్మలు చేయకుండా ఎవరికీ జరుగదు. ఈశ్వరార్పణ బుద్ధితో నీకు విధించిన కర్మలు చేయి. ఇదే జీవికి తరణోపాయం. లౌకిక స్వార్థకర్మలు మానవుణ్ణి బంధితుడుగా చేస్తాయి. నీవు అనాసక్త భావంతో నీ కర్తవ్యం చేయి. ఇందులో తప్పులేదు. నీవు యుద్ధం ధర్మం కొరకు, న్యాయం కొరకు చేస్తున్నావు. చేయి. అది శ్రేయస్సునిస్తుంది. క్షత్రియుడు అంటే క్షతినుండి జనులను రక్షించేవాడు. నేడు ధర్మానికి దెబ్బ తగిలింది. ఇపుడు జనాన్ని కాపాడాలి. లేచి సత్యధర్మాలను రక్షించు. అది నీ కర్తవ్యం. ఒకసారి బ్రహ్మ ప్రజాపతులతో అన్నాడు. ధర్మం నిలపండి. ధర్మ కార్యాలైన యజ్ఞాలు చేయండి. చేయించండి. ధర్మం వలన సుఖసమృద్ధి కలుగుతుంది. ఈ యజ్ఞాది ధర్మకార్యాలు అభీష్టాలు నెరవేర్చే కల్పతరువులు. యజ్ఞాది ధర్మకార్యాల వలన దేవతలు సంతోషిస్తారు. వర్షాలు కురిపిస్తారు. మానవులు చేసే ధర్మకార్యాలతో దేవతలు, దేవతల ప్రసాదంతో మానవులు పరస్పరం సుఖిస్తారు. ప్రకృతి పురుషుడు తృప్తి చెందడం వలన సృష్టి సజావుగా సాగుతుంది.

అయితే దేవతాప్రసాదంగా ప్రాప్తించిన సుఖ సామగ్రిని ఈశ్వరునికి నివేదించకుండా భోగించేవాడు కృతఘ్నుడు, మహాపాపి. యజ్ఞం అంటే ధర్మకర్మ. ప్రకృతి ఆరాధన. ఈ యజ్ఞంలో అనేక కోట్ల జీవులు తృప్తి పడతాయి. ప్రకృతి పరిశుభ్రమవుతుంది. దైవ ప్రీతిగా కర్మలు చేయబడతాయి. యజ్ఞకర్మలో పాల్గొని యజ్ఞ ప్రసాదం తిన్నవాడు పాపరహితుడవుతాడు. కేవలం తమ పొట్టకే తినేవాడు

పాపం భుజిస్తున్న వాడవుతాడు. తినే పదార్థం ఈశ్వర నివేదనం వలన అమృతమవుతుంది. అన్నం బ్రహ్మస్వరూపం. అన్న యజ్ఞాలే అన్న సంతర్పణలు. అన్నం వలన ప్రాణులు శరీరాలు ఏర్పడుతాయి. అన్నం వర్షాల వలన పండుతోంది. ఆ వర్షం మేఘాల నుండి కురుస్తోంది. ఆ మేఘం పవిత్ర హోమధూమం వలన కలుగుతోంది. ఆ హోమధూమం ఆకాశంలో పరిశుద్ధ వాతావరణం కల్పిస్తోంది. ఆ వాతావరణ ప్రభావం వల్ల మానవులకు ఆయురారోగ్య భాగ్యాలు లభిస్తున్నాయి.

ఈ యజ్ఞ విధానం వేదంలో చెప్పబడింది. అట్టి వేదం పరమాత్మ నుండి వచ్చింది. ఇది తెలుసుకున్నవాడు జ్ఞాని అవుతాడు. ఈ విశ్వచక్రం ఒక నియమ క్రమం ప్రకారం తిరుగుతోంది. ఈ చక్రం నడిపేవాడే చక్రధారి. చక్రధారిని తృణీకరించే అల్పులు పాపకర్ములు. వారు పవిత్రమైన మానవజన్మను వ్యర్థం చేసుకొంటున్నారు. ఈ కర్మవిధానం అంతా చిత్తశుద్ధికే ఏర్పడింది. దీనివల్ల మానవులకు చిత్తశాంతి కల్గుతుంది. చిత్తశాంతితో అనిర్వచనీయమైన ఆనందం లభిస్తుంది. ఈ విధానం తెలిసి ప్రవర్తించే వాడే ఆత్మజ్ఞాని. ఆత్మజ్ఞానంలో పక్వమైన యోగికి ప్రత్యేక కర్తవ్యాలంటూ ఏమీ ఉండవు. ఆత్మజ్ఞానికి కర్మలు చేయవలసినవి ఏమీ లేవు. చేసినా చేయకపోయినా అతనికి నష్టమూ లేదూ, లాభమూ లేదు. అయితే ఆ ధర్మం కోసం ఈశ్వర ప్రీతికి కర్మలు చేస్తుంటాడు. కానీ చేయనట్లే ఉంటాడు. ఆ మహాత్ముడికి ఏ బంధమూ లేదు. తామరాకుపై నీటి బొట్టువలె లోకానికి అంటీ అంటనట్లే ఉంటాడు.

అయితే అర్జునా ! నీవు ఆత్మజ్ఞానివి కావు. కనుక నీవు అనాసక్తతతో కర్తవ్యకర్మలు చేయవలసిందే. చేయి. కామశూన్యుడై కర్తవ్యం నిర్వహించే వాడే నిశ్చయంగా మోక్షం పొందుతాడు. కర్మలు ప్రతివాడు చేయవలసిందే. లేకపోతే సృష్టి జరగదు. పెద్దలను పిన్నలు అనుసరిస్తారు. కనుక పెద్దలు ఆదర్శవంతులుగా ఉండాలి. జ్ఞానులు ఆదర్శం కొరకే ఆసక్తి రహితంగా కర్మలు చేస్తారు. అలా చేస్తే బంధం ఉండదు.

మహాత్ములు వైయక్తికంగా జ్ఞానయజ్ఞం చేస్తుంటారు. దీనికి వస్తుసామగ్రి అవసరం లేదు. శాస్త్రం అర్థం చేసుకొని బుధులతో చర్చించి మనస్సుతో మననం చేసేది జ్ఞానజయ్ఞం. ఇది చాలా ఉత్త మోత్తమం. ఇందులో విజ్ఞులు ఆత్మ విచారణ చేసుకొని ఆత్మతత్త్వం అధ్యయనం చేసుకొంటారు. ఇది హృదయ క్షేత్రంలో అనుక్షణం చేసుకోతగింది.

" భక్తి భగవంతు దలచుటే పరమప్రీతి
నిత్య ధర్మముల్ నెరపుచు సత్యనిష్ఠ
కలిగి జనకుండు రాజయోగంబు బూని
అందరానట్టి మోక్షంబునందలేదె "

– బాబా

జనకాదులు ఇట్టి యజ్ఞాదులు జేసి కర్మలు ఆచరించే ఆత్మ జ్ఞానం పొందారు. ఆదర్శంగా నిలిచారు. అట్లానే నీవు కర్మలు చేయటం మంచిది.

సామాన్యులు సంఘంలో ఉత్తమ పురుషులను ఆదర్శంగా తీసుకుంటారు. నన్ను చూడు. నాకు లోకంతో పనిలేదు. లోకంలో నాకు కర్తవ్యం అంటూ ఏమీలేదు. నేను చేయవలసిన పని ఏదీలేదు. అయినా లోక కళ్యాణం కోసమే నేను కార్యకలాపాలు చేస్తుంటాను. నేను ఒకవేళ కర్మలు చేయలేదనుకో ! లోకులు నన్ను అనుసరించి భ్రష్టులవుతారు. అపుడు నేనే జనులను పాడుచేసిన వాడినవుతాను. అర్జునా ! అజ్ఞానులు ఆసక్తిగలవారై కర్మఫలం ఆశించి కార్యాలు చేస్తుంటారు. జ్ఞానులు ఆసక్తి లేనివారై లోకానికి ఆదర్శం అందించడానికి కర్మలు చేస్తుంటారు. సామాన్య ప్రజల కర్మ ఆసక్తతను వ్యర్ధపుచ్చరాదు. కర్మలు చేయటంలోనే వారిని నిమగ్నం చేయాలి. అలా చేయనిచో జనులు సోమరులవుతారు. కర్మాచరణం వలన క్రమ క్రమంగా జనులకు చిత్తశుద్ధి కలుగుతుంది. దానితో జనులు బాగుపడతారు. సోమరుల మనస్సు సోమరితనం వలన వెర్రి పోకడలు పోతుంది. ఆత్మశుద్ధిలేక, జ్ఞానం తెలియక జనులు భ్రష్టు లవుతారు. కనుక పెద్దలు బ్రహ్మాత్మబుద్ధి కలగటానికి, విశ్వం విష్ణుమయమని సర్వకర్మలు ఈశ్వరప్రీతికై చేయాలి. జ్ఞాని, అజ్ఞానికి పాఠాలు చెప్పుట కొరకే కర్మలు చేస్తాడు అని తలంచు. జనంలో సహజంగా సత్త్వ రజస్తమో గుణాలు లౌకిక పారమార్ధిక కర్మలను జరిపిస్తుంటాయి. అహంకారంగల అజ్ఞానులు ఈ కర్మలను నేనే చేస్తున్నాను, ఈ ఘనకార్యాలన్నీ నేనే చేస్తున్నాను అనుకొంటారు. గర్వం చెంది విర్రవీగుతారు.

త్రిగుణాల చర్యల వల్లనే ఇంద్రియాలు ప్రవర్తిల్లు తుంటాయి. ఆత్మకు ఇందులో ప్రమేయం లేదు. అందుకనే ఆత్మను 'అప్రమేయం' అన్నారు. ఆత్మ అసంగుడు అని యెరిగి కర్తను నేను కాదని జ్ఞాని నిష్కామంగా కర్మలు చేస్తూ పోతాడు. త్రిగుణాల వలన భ్రమలలో తగుల్కొన్నవారే ఇంద్రియ వ్యాపారాలందు ఆసక్తులై అగచాట్లు పడుతుంటారు. పండితుడు తాను ఇంద్రియాల ఆటల్లో పడడు. అవివేకులవలె సంచరించడు. వివేకం కలిగి ప్రవర్తిస్తాడు. ఆత్మానందం

అనుభవిస్తాడు. కనుకనీవు వివేకంతో కర్మలు భగవదర్పితం చేసి నిష్కామంగా ధర్మయుద్ధం చేయి. యుద్ధం నేను చేస్తున్నాను అనుకోకు. అసూయ ద్వేషం, స్వార్థం వహించబోకు. భగవత్కర్మగా నీ ధర్మం నీవు చేయి. ఇలా చేశావంటే కర్మబంధంలో చిక్కుకోవు. కర్మఫలాలు నీకు చెందవు. నీవు ముక్తుడవవుతావు.

కౌంతేయా ! కామం అంటే కోరిక. తీవ్రమైన ఆకాంక్షయే. ఈ ఆకాంక్ష అగ్నికంటె భయంకరం. అగ్నికి ఎన్ని ఆహుతి చేసినా ఇంకా ఇంకా నాలుకలు చాస్తుంటుంది. అన్నిటినీ కాల్చుకు తిని బూడిద చేస్తుంది. కామం కూడా అంతే. ఈ కామాగ్ని జ్ఞానికి పరమ శత్రువు. ఇది వివేకాన్ని నాశనం చేస్తుంది. లోకంలో ఇంద్రియాలు కోరికలను ఆశ్రయిస్తాయి. ఇంద్రియాల వలన పెరిగే కోరికలు వివేకాన్ని నాశనం చేస్తాయి. అవి దేహాభిమానాన్ని పెంచి భ్రమలో పడేస్తాయి.

కోరికలు జ్ఞానమార్గంలో ప్రతిబంధకాలు. వాంఛా పిశాచం మనిషిని మట్టి చేస్తుంది. కనుక నీవు కోరికలు వదులుకో ! స్థూలదేహం కంటె ఇంద్రియాలు, ఇంద్రియాలకంటె మనస్సు, మనస్సు కంటె బుద్ధి, బుద్ధి కంటె ఆత్మ ఉన్నతం. నీవు ఆత్మజ్ఞానివి కమ్ము. నీవు నిశ్చయాత్మక బుద్ధి కలిగి ద్రష్టవై ఆత్మజ్ఞానం పొందు. శ్రేయస్సులు అందు.

పూవులేక కాయపుట్టదు చెట్టుకు
కాయలేక ఫలము కలుగ బోదు
కర్మ నిష్ఠ లేక కలుగదు భక్తియు
భక్తి లేక జ్ఞానఫలము లేదు

– శ్రీ సత్యసాయి

# 4

కనులకగపడు దృశ్యంబు గాంచి మీరు
సత్య మిదియని యెంచక సంబరమున
తెరను దాగిన సత్యంబు తెలిసికొనగ
విశ్రమించక నాతోడ వెడలిరండు !

– శ్రీసత్యసాయి

అర్జునా ! అవ్యయమైన ఈ జ్ఞానయోగం నేను పూర్వం సూర్యుడికి తెలిపాను. సూర్యుడు తన పుత్రుడైన మనువుకు చెప్పాడు. మనువు తన సుతుడైన ఇక్ష్వాకునకు చెప్పాడు. ఇక్ష్వాకుడు తన కుమారులకు వారు వారి వారి బిడ్డలకు చెప్పుకుంటూ వచ్చారు. ఈ విధంగా రాజులు రాజర్షులు మహర్షులు ఉపదేశం చేసుకొంటూ వచ్చారు. పరంపరాగతంగా వచ్చిన ఈ క్రమం కొంతకాలానికి నష్టమైపోయింది. అయితే ఇపుడు ఈ యోగం నీకు చెప్పాలనిపించి చెప్పుతున్నాను. నీవు నా ప్రియభక్తుడవు కదా ! నీ ద్వారా ఈ జ్ఞానయోగం మరల వ్యాపిస్తుంది.

అని శ్రీకృష్ణ భగవానుడు పల్కగా పాండవ మధ్యముడు అత్యాశ్చర్యంగా ముఖంపెట్టి ఇలా అన్నాడు. బావా ! ఏమిటీ మాటలు ! నీవు నాకంటె కొంచెం పెద్ద వాడివి అనుకో ! పదో పదిహేనో సంవత్సరాలు ముందు పుట్టి ఉండవచ్చు అంతేకానీ సూర్యుడెక్కడ ! నీవెక్కడ ! కొన్ని యుగాల ముందు నుంచి మింటిపై మెరుస్తున్నవాడాయె సూర్యుడు. నీవేమిటి ! ఈ యోగం సూర్యుడికి చెప్పటమేమిటి ? ఇలా ఎలా సంభవం ! నాకు అయోమయంగా ఉంది. అపుడు శ్రీకృష్ణస్వామి మందహాసం చేసి ఇలా వివరించాడు– అర్జునా ! ఎంత అమాయకుడవోయీ !

నీవు, నేనూ ఇప్పటి వారము కాము. మనం అనేక జన్మల నుంచి వస్తున్నాము. ఈ జన్మ పరంపర సంగతి నాకు ఎరుకలో ఉంది. నీకు ఎరుకలేదు. నాకు మాయ అధీనంలో ఉంది.

నీవు మాయకు అధీనమైయున్నావు. నాకు భూత భవిష్యద్వర్తమానాలు తెలుసు. నీకు వర్తమానం ఒకటే తెలుసు నేను సర్వభూతాధి పతిని. సర్వజ్ఞుడను.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత !
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ !!

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ !
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే !!

ఓ భారత కుమారా ! ధర్మానికి హాని కలిగి అధర్మం అన్యాయం అక్రమం సంఘంలో పెరిగిన నపుడు సాధు సంరక్షణ చేసి దుష్ట సంహారం చేయటానికి మరల ధర్మం నాల్గు పాదాలపై నడపటానికి నేను ప్రతి యుగంలోనూ అవతరిస్తుంటాను. ఈ మాయా శరీరం దాలుస్తుంటాను. ధర్మచ్యుతులైన వారిని సంస్కరిస్తుంటాను. ధర్మోద్ధరణ చేయటం సాధుజనులను రక్షించటం నా కర్తవ్యాలు.

ఈ ధర్మోద్ధరణలో నాకు తోడుపడేవాడు అత్యంత ప్రియతముడు. ఎవరు ఏ రీతిగా నన్ను ఉపాసిస్తారో వారిని ఆ రీతిగా ఉద్ధరిస్తాను. కోట్లాది మానవులు నన్నే అనుసరిస్తున్నారు. దేవతలు నన్నే సేవిస్తున్నారు. కొందరు కర్మఫలాలను కోరి ఇతర దేవతలను పూజిస్తుంటారు. ఆ దేవతలూ నా అంశలే. అయినా నన్ను పూజించిన వారు పొందినంత ఫలం వారు పొందలేరు. కామ్యఫలం త్వరలో లభ్యం అవుతుంది. జ్ఞాన ఫలం అంతత్వరగా లభ్యమానం కాదు.

నా వలననే సకామ నిష్కామ కర్మఫలాలు ఇవ్వబడుతున్నాయి. సత్త్వ రజస్తమో గుణాలు మానవులలో కల్గుతున్నాయి. శమదమాలు నేను కల్పిస్తుంటాను. ఈ గుణాల ద్వారా నియమక్రమంలో వర్షాలు కురుస్తున్నాయి. అన్నిటికీ నేనే కర్తను అని తెలుసుకో ! నేను ఆసక్తి రహితుడను. నేను అవ్యయుణ్ణి. దేనికీ కర్తను కాదు. అహంకారం లేదు. అనురాగంలేదు. ఆశలేదు. భోక్తను కాదు. సర్వసాక్షిగా చూస్తుంటాను. ఆత్మస్వరూపుడను. అన్నీ తెలిసినవాడను. అంతే.

నా యీ తత్త్వం తెలుసికొన్న జ్ఞానులు నన్ను చక్కగా సేవించి పరమపదం పొందుతారు. ఆసక్తిరహితులు నిష్కాములు కూడా కర్మలు చేయవలసిందే. కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన కర్మలు చేయటమే మీ పని. ఫలం ఈయటం ఈయక పోవడం నాపని. అది నాకు విడిచి పెట్టండి. కనుక నీవు కర్మచేయి. ఫలం ఆశించకు, చెప్పినట్లు విను. కర్తవ్య కర్మలు చేస్తూ కర్మబంధాలలో చిక్కకుండా మనస్సును మాధవునకర్పణం చేయటం యోగం కర్తవ్యాకర్తవ్య నిర్ణయంలో పండితులు కూడా భ్రాంతిలో పడుతుంటారు. సంసార కూపంనుంచి బయట పడే దారి చెప్తాను విను.

కర్మలు మూడు విధాలు. కర్మ, వికర్మ, అకర్మ. కర్మలు శారీరకంగా జరిగే నిత్యకృత్యాలు. వికర్మలు అంటే విహితమైనవీ విశేష ఫలప్రదమైనవి విశిష్టమైనవి. అకర్మలు అంటే నిషిద్ధ కర్మలు. చేయతగనివి. నిత్య నైమిత్తిక కర్మలు శరీరధారికి తప్పనిసరిగా జరిగిపోతుంటాయి. దానికి మనిషి సంకల్పంతో కూడా పని ఉండదు. శ్వాస రక్తప్రసరణ జీర్ణకోశ కర్మలు మొదలైనవి సహజమైనవి. వికర్మలు విశిష్టమైన పుణ్యకర్మలు. విశ్వ కళ్యాణ కారకాలు. పవిత్ర భావంతో మానవుడు అభ్యాసంతో విశ్వేశ్వర సమర్పణ బుద్ధితో సాధించే భగవత్కార్యాలు, స్వార్థరహితాలు. అకర్మలు చేయకూడని నీతి బాహ్య కర్మలు. మానవులైన వారికి కూడని పనులు. కర్మలను నిష్కామంగా బ్రహ్మభావంతో సర్వజన క్షేమంకోసం చేసే దానిని అనాసక్త బుద్ధితో చేయటం అంటారు. అట్లు చేసేవాడు మహాజ్ఞాని. అతడు ఎన్ని కర్మలు చేస్తున్నాకూడా కర్మబద్ధుడు కాడు. అతడు చేస్తున్న కార్యం సఫలమైనా, విఫలమైనా అతడు బాధపడడు. ఉబ్బిపోడు, అతనికి కర్మఫలం పై ఆసక్తిగానీ, కర్తృత్వంపై మమకారంకానీ ఉండదు. అతడు సతతం సంతుష్టిగా ఉంటాడు. నిష్కామయోగి ఇతరుల నుంచి ఏమీ ఆశించడు. దేహం కాపాడుకోవాలని తాపత్రయం పడడు. అతడు ఏమి చేసినా, ఏమి చేయకపోయినా అతనికి ఏ పుణ్యపాపాలు బాధించవు. కాలానుగుణ్యంగా లభించిన దానితో సంతుష్టి చెందేవాడు శీతోష్ణాదులను లెక్కపెట్టక విశ్వకల్యాణం కొరకు శ్రమించేవాడు పరునిలో పరమాత్మను చూచి పరోపకారం వ్రతంగా చేస్తుండేవాడు, మదమాత్సర్యాలు మచ్చుకైనా లేనివాడు, లాభ నష్టాలను సమచిత్తంతో పరిగణించి సేవా కార్యరంగంలో ముందుకు పోయేవాడు భగవంతుడికి మిక్కిలి ఇష్టమైన భక్తులు. అట్టివారు పరమ పద ప్రాప్తికి అర్హులు.

భక్తి సహితమైన కర్మ జ్ఞాన సహితమైన భక్తి ఉంటే సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యాలు సులభంగా లభిస్తాయి. భక్తి పుష్పం లేకుండా జ్ఞానఫలం లభించదు. బాహ్యంగా కర్మ, అంతరంగాన ధ్యానం జ్ఞాన సంపాదనకు సాధనాలు.


సగుణభక్తి నిర్గుణభక్తి కుడి ఎడమ కాళ్ళవంటివి. రెండు సమంగా నడవాలి. (నడిచేటపుడు ఒకటి ముందు, రెండవది వెనుక ఉంటుంది గదా !) యజ్ఞాలు అనేక విధాలు. సత్కర్మలు అన్నీ యజ్ఞాలే. యజ్ఞంలో పదార్థాలు సాధనాలు అన్నీ బ్రహ్మ పదార్థాలే. వ్యక్తులు బ్రహ్మస్వరూపులే. యజ్ఞఫలాలు విశ్వకల్యాణాలే. లోకంలో ఈ యజ్ఞాలన్నీ మనో వాక్కాయ శుద్ధికి సంబంధించినవే. కానీ ఆత్మకు సంబంధించినవి కావు.

ఆత్మ సాక్షి మాత్రం. ఆత్మ నిర్వ్యాపారి. అంటే కేవలం ఏమి చేయని మొద్దు అని కాదు. అన్నీ చేయగలిగి ఏమీ చేయదు. కదులుతుంది కదిలిస్తుంది. కదలదు. ఆత్మ ఇట్టిది అని చెప్పజాలం. ఆత్మ అగ్రాహ్యం. ఆత్మను శరణుజొచ్చితే శుభం కలుగుతుంది. ఆత్మను శరణు జొచ్చిన వాడే ముక్తుడు. నీకు ఈ యుద్ధం పవిత్ర యజ్ఞకర్మ. దీనిని నిస్స్వార్థంగా నిర్వర్తించు. ఇదే బ్రహ్మయజ్ఞం అవుతుంది. ఈ జ్ఞానం కలిగినచో ఇక నిన్ను మోహం ముట్టుకోదు. నిర్జీవరాసులన్నిటిలో బ్రహ్మను దర్శించగలవు. బ్రహ్మ ఆత్మ ఒక్కటే. పాపియైన వాడుకూడా బ్రహ్మజ్ఞానం అనే తెప్పను చిక్కించు కొంటే ధర్మాధర్మాలు తత్త్వ రహస్యాలు తెలుసుకొంటాడు. జ్ఞాని అవుతాడు. వాల్మీకి అట్టి మహానుభావుడు. బ్రహ్మజ్ఞానం అంత గొప్పదని తెలుసుకో. శ్రద్ధా భక్తులు కలవాడే యోగ్యుడు. సందేహ మనస్కుడు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ చెడిపోతాడు.

పాండవ కుమారా ! సంశయాలను జ్ఞాన ఖడ్గంతో ఖండించి కర్మయోగంబూని యుద్ధం చేయి !

కర్మమార్గంబు విడరాని కాలినడక
భక్తిమార్గంబు సుళువైన బండినడక
జ్ఞాన మార్గంబు జూడ విమాన పధము
ఇంతకన్నను వేరెద్ది యెరుక పరతు

– శ్రీ సత్యసాయి బాబా



5

మదిని గెలిచిన శాంతికి మార్గమబ్బు
శాంతి కలిగిన అన్నిట సమత దోచు
మంచి చెడ్డలు మానాభిమానములును
అహితులు హితులు ఒక్క బ్రహ్మాంబు కాదె !
– శ్రీ సత్యసాయి బాబా

అర్జునా అలా ఉన్నావేం! అడుగు అనుమానాలు మనస్సులోనే ఉంచుకుని మధన పడుట మంచిదికాదు అన్నాడు అఖండ బ్రహ్మాండ నాయకుడు. అపుడు అర్జునుడు ఆత్మవిచారణ చేసి అంజలి ఘటించి అశ్రు పూరిత నయనుడై అన్నాడు కదా !

భగవాన్ ! చిన్న సందేహం. కొంతసేపు కర్మలు త్యజించమంటావు ! కొంతసేపు కర్మలు చేయమంటావు ! ఏదీ నిర్ణయించుకోలేక యున్నాను. నీవే నిర్ణయించి ఆజ్ఞాపించు. నీవే నాకు శరణాగతి ! అపుడు అర్జున హృదయం అర్థం చేసుకొని శ్రీకృష్ణభగవానుడు ఇలా వివరించాడు.

పార్థా ! కర్మత్యాగం, కర్మాచరణ రెండూ మంచివే. వ్యక్తుల స్థాయిని బట్టి ఇవి ఆచరణీయాలు. రెంటిలో కర్మత్యాగం జ్ఞాన నిష్ఠాగరిష్ఠులకు మహా పండితులకు అనుసరణీయం. నీవంటి వారికి నిష్కామ కర్మాచరణ యోగ్యం. కనుక నిన్ను కర్మ చేయవలసిందని ప్రబోధిస్తున్నాను. దీనిలో ఒక రహస్యం ఉంది విను. స్వార్థం లేకుండా కేవలం పరమార్థం కోసం కర్మలు చేసేవాడు నిత్య సన్యాసి. సుఖదుఃఖాది ద్వంద్వ రహితునకు అనాయాసంగా ముక్తి లభిస్తుంది. సాధారణ పండితులు సన్యాసమూ, కర్మయోగము వేరు వేరు. ఒకటి అధిక ఫలదం, మరొకటి తక్కువ అంటారు. కానీ జ్ఞాన వేత్తలు అలా చెప్పరు. ఈ

రెంటిలో ఏది చేసినా రెండిటి ఫలమూ వస్తుంది. జ్ఞానులు పొందే ముక్తిని కర్మయోగులూ పొంది ఆనందిస్తారు.

నిష్కామ పరిశుద్ధ హృదయం ముఖ్యం అంటారు. నిష్కామ కర్మానుష్ఠానం లేకుండా కర్మసన్యాసం సాధ్యం కాదు. నిష్కామ కర్మ యోగి సర్వభూతాల ఆత్మను తన ఆత్మగా, తన ఆత్మను సర్వ భూతాలలోను దర్శిస్తాడు. అట్టివాడు కర్మలు చేసినా చేయకపోయినా కర్మలు బంధహేతువులు కావు.

నిష్కామకర్మపరాయణులు మమతా మమకారాలు వదులుకొని శరీరాన్ని స్నానాదులతోను, మనస్సును ధ్యానాదులతోనూ, బుద్ధిని తత్త్వ విచారణతోనూ, ఇంద్రియాలను శ్రవణకీర్తనాదులతోనూ, పవిత్రం చేసుకొంటారు. పరమ శాంతిని వహిస్తుంటారు.

సకామ కర్మలు చేయువారు సంసార చక్రంలో పడి నలిగిపోతుంటారు. జితేంద్రియులు కర్మబంధాలు త్యజించి నిర్లిప్త భావంతో నిత్య సంతుష్టులై ప్రకాశిస్తుంటారు. ఆత్మ అంటే ఈశ్వరుడు. ఈశ్వరుడు మానవులకు కర్మబంధాలు తగిలించేవాడు కాడు. ఈశ్వర పరిచారిక మాయ. అది కూడా కర్మానుసారంగా బంధాలు తగిలించి నాటకం ఆడిస్తుంది. మాయ అంటే అవిద్య, అజ్ఞానం.

ఈశ్వరుడు స్వయంగా ఎవరికీ ఏమీ చేయడు. సర్వసాక్షిగా పరికిస్తుంటాడు. అజ్ఞానం వలన జీవులు మోహంలో పడి ప్రవర్తిస్తుంటారు. మోహం తొలగగానే మోక్షం పొందుతుంటారు. ఇట్టి జ్ఞానవంతులు బ్రాహ్మణుడిలోనూ చండాలుడిలోనూ, అణువులోనూ, ఐరావతంలోనూ, గోవులోనూ, వ్యాఘ్రంలోనూ, చిన్నలోనూ, పెద్దలోనూ, శునకంలోనూ, కనకంలోనూ, శివంలోనూ, శవంలోనూ సమంగా ప్రకాశించే పరమాత్మను సమంగా దర్శిస్తుంటారు. వీరే సమదర్శనులు. ఇట్టి స్థితప్రజ్ఞులైన మహానుభావులు సర్వవేళలా బ్రాహ్మిస్థితిలో ఉండి అప్రియవస్తువులు లభించినా విషాదం పొందరు.

వారు బాహ్య వస్తువులపై నిరపేక్ష కలిగి సదా బ్రహ్మానంద స్థితిలో ఉంటారు. సన్న్యాసం అంటే ఇదే. సత్+ న్యాసం, బుద్ధిని స్వామిపై నిలపటమే. లోకంపై బుద్ధిని వదలి, లోకనాథునిపై బుద్ధిని నిలపడమే సన్న్యాసం. జీవితంలో కామక్రోధ లోభాదులకు వశం కాక మరణ పర్యంతం ధీరచిత్తుడై ఉండేవాడే శాంతిని తాను పొంది పరులకు శాంతిని ప్రసాదిస్తాడు.

అతడే ఆనంద పురుషుడు. ఆనందం విషయ భోగాలలో లేదని తెలుసుకొని ప్రవర్తించే వాడే ఉత్తమ సన్యాసి. ఆనందం ఆత్మ వస్తువులోనే ఉంది. ఆత్మ అంటేనే సమత్వ బుద్ధి. సమ్యక్ బుద్ధి సన్యాస బుద్ధి. సత్ పదార్థం పై బుద్ధి

ఉంచువాడే సన్యాసి. వాడే సుబుద్ధి.

విశ్వకళ్యాణ కార్యక్రమంలో నిమగ్నులైన సన్యాసులు జీవిత కాలంలోనే బ్రహ్మ నిర్వాణసుఖం పొంది సుఖిస్తుంటారు. మోహక్షయం మోక్షం. మోక్షం ఒక్కటే జీవన లక్ష్యంగా పెట్టుకొన్న యోగి నిత్య సన్యాసియే సుమా ! అతడు నన్నే లోక నాథుడుగా సర్వజీవుల ఆప్తమిత్రుడుగా భావించి నాతోనే సుఖమూ, శాంతి పొందుతుంటాడు.

హరిదాసుల మిత్రత్వము
ముర రిపున్నేన్ని కొనుచు మోదముతోడన్
భరితాశ్రు పులకితుండయి
పురుషుడు హరిమాయగెలుచు భూపవరేణ్యా !

– భాగవతం

# 6

దానవ - దైత్య - భుజంగమ
మానవ - గంధర్వ - సుర సమాజములో ల
క్ష్మీనాథు చరణ కమల
ధ్యానంబున నెవ్వడైన ధన్యత నొందున్ !

- భాగవతం

శ్రీ కృష్ణ యోగీశ్వరేశ్వరుడు పారమ్య చింతనాపరుడైన పార్థుడికి ధ్యాన విధానం వివరంగా చెప్పసాగాడు. అర్జునా ! నీహృదయం స్వచ్ఛమైనదోయి. పేరుకు తగినట్లే హృదయం గలిగినందుకు మరీ సంతోషంగా ఉంది. సన్యాసం అంటే నిష్కామకర్మయోగమే. ధ్యానం అంటే మానసిక ఈశ్వరారాధనమే అని తలంచు. చిత్తాన్ని శుద్ధిచేయటమే ధ్యానం. ఇంద్రియాలను నియమబద్ధం చేయటమే ధ్యాన లక్ష్యం. లౌకికంలో నుంచి స్వార్థం త్యాగం చేసి పరమార్థం వైపు ప్రయాణం సాగించుటే ధ్యాన క్రమం. మనిషి మనీషి కావాలి. మనోనియమం అవసరమని మనస్సుకు బోధిస్తూ క్రమశిక్షణలో మనస్సు వశం చేసుకోవాలి. మనస్సు విషయాకర్షణకు మరీ లొంగిపోతుంది. మనస్సు మదపుటేనుగువంటిది. యేనుగును మావటి వాడు మచ్చిక చేసుకొని అంకుశంతో దారికి తెచ్చినట్లుగా మనస్సును మచ్చిక చేసుకొని మంచి మార్గంలో పెట్టాలి. స్వాధీనమైన మనస్సు మనిషికి మంచి మిత్రుడు. మాటవినని మనస్సే మహా శత్రువు. మంచి మనస్సే బుద్ధి. మంచి బుద్ధియే ఆత్మ. మంచి ఆత్మయే పరమాత్మ. పరమాత్మయే పరమ ఆప్తబంధువు.

మనస్సును ధ్యానంలో నడిపి జితేంద్రియత్వం సంపాదించాలి. శీతోష్ణాలను, కష్టనష్టాలను అవమాన అపకారాలనూ లెక్కించని స్థితికి రావాలి. మనస్సును స్వాధీనం చేసుకొనే అభ్యాస క్రమమే ధ్యానం. ధ్యానంలో సిద్ధిని

పొందినవాడు మిత్రశత్రువులనూ, సదాచారదురాచారాలనూ, స్వజన పరజనులనూ, స్త్రీ పురుషులనూ నిష్కామంగా వాంఛా రహితంగా చూస్తాడు. సమదృష్టితో ప్రవర్తిస్తాడు. సాధకుడైనచో యేకాంత స్థలం ఎన్నుకొని సాధనను బుద్ధి బలంతో సాగిస్తుంటాడు. దేహేంద్రియాలను అంతఃకరణంతో సమాయత్తం చేసి ఆత్మను పరమాత్మతో లీనం చేసి తాదాత్మ్యస్థితి పొందుతాడు.

అర్జునా! ఈ ధ్యాన యోగం క్రమశిక్షణలో పరిమిత ఆహారం పరిమిత నిద్ర పరిమిత విశ్రాంతి పరిమిత శ్రమ శరీరానికి అభ్యాసం చేసుకొన్న వాడికి కల్పతరువు. నియమబద్ధంగా నడుచుకోవడం మనిషికి యెల్లపుడూ అవసరమే. పాపభీతి సంఘనీతి దైవప్రీతి మనిషి మనుగడకు మంచి సాధనాలు. మనిషి సదా ఈ ధ్యానంలో ఆత్మ జ్ఞానంలో సిద్ధి పొంది చరితార్థత సాధిస్తాడు. ఇతడు సకల భూతజాలంలోనూ సర్వేశ్వరుణ్ణి దర్శిస్తాడు. అట్టి యోగి నాకు ప్రియ భక్తుడు. వాడికీ నాకూ ఎప్పుడూ విడదీయరాని సంబంధం ఉంటుంది. అట్టివాడు ఏమీ చేయనక్కరలేదు. శాస్త్రంలో చెప్పిన విధి నిషేధాలు వాడికి వర్తించవు. ఇదంతా విని అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇలా అన్నాడు.

మహానుభావా ! మనస్సు అరికట్టినందువల్ల వచ్చే లాభాలు చెప్పావు, బాగుంది కానీ మరి అరికట్టే దారి చెప్పలేదే ఎలా ! 'సరే అలానా' అని కృష్ణ దేవుడు చెప్పసాగాడు.

క్రీడీ ! సాధనలు రెండు రకాలు. బహిరంగ సాధన అంతరంగ సాధన. ఈ సాధనలు ఫలించాలంటే రెండే ఉపాయాలు. అభ్యాసం, దైవానుగ్రహం. 1.బహిరంగ సాధనలు-భజన సమాజసేవ మొదలైనవి. 2. అంతరంగ సాధనలు. ధ్యానం జపం తపం మనోనిగ్రహం. అభ్యాసం వలన సాధ్యం కానిదేలేదు. అభ్యాసం కూసువిద్య. ఎట్టి కఠిన కార్యమైనా అభ్యాసానికి అలవడుతుంది. ఈ ధ్యానయోగం నిత్యం అభ్యాసం చేయి. మరియొక సందేహం ! ఒకవేళ సాధకుడు అభ్యాసయోగంలో సిద్ధి పొందకుండానే మరణిస్తే వాడిగతి అధోగతేనా ! పాపం ! అతడికి పరిస్థితులు అనుకూలించక రోగగ్రస్తుడైతే వాడికి తరణోపాయం ! అని అడిగాడు అర్జునుడు.

అపుడు కృష్ణ స్వామి చివాలున ఇలా చెప్పాడు. పార్థా !నీ హృదయం గ్రహించాను. విను. పవిత్ర కర్మలు చేస్తూ విధివశాత్తు కనుమూస్తే అట్టివాడు వ్యర్థుడు కాడు. అట్టి ఉత్తముడు ఈ లోకంలో కానీ పరలోకంలో కానీ నిందలూ నరకాలూ పొందడు. మంచి చేస్తుండే వాడు ఎప్పుడూ దుర్గతి చెందడు. సుగతులే పొందుతాడు. అతడు ఉత్తర జన్మలో ఉత్తమ కులంలో యోగుల వంశంలో ఉన్నవారి వంశాంకురంగా జన్మిస్తాడు. గత జన్మలో తాను చేస్తూ వచ్చిన యోగం

కానీ, సత్కార్యక్రమం కానీ మళ్ళీ ఈ జన్మలో ఆచరించ సాగుతాడు. తదుపరి మరీ వృద్ధి చెంది ఉన్నతపదం అందుకొంటాడు. భయంలేదు. ఇందుకు సందేహంలేదు. ధ్యానం చేసేవాడు ప్రియతమ భక్తుడు. నీవు ధ్యానం చేస్తూ ఉత్తమ యోగివి కమ్ము.

విమలంబై, పరిశుద్ధమై, తగుమనో విజ్ఞాన తత్త్వ ప్రబో
ధమతిన్ నిల్పి తదీయమూర్తి విభవధ్యానంబు గావించి చి
త్తము సర్వాంగ విమర్శన క్రియలకున్ దార్కొల్పి ప్రత్యంగమున్
సుమహాధ్యానము సేయగా వలయుబో ! శుద్ధాంతరంగంబునన్ !!

– భాగవతం

# 7

కరణ త్రయంబు చేతను
నరుడే కర్మంబు సేయు నయ్యై వేళన్
హరికర్పణమని పలుకుట
పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్

– భాగవతం

శ్రీ కృష్ణ భగవానుడు పార్ధుడికిలా బోధించటం మొదలు పెట్టాడు. "అర్జునా ! నా మాటపై మనసుంచి శ్రద్ధగా విను. నాలోని మహత్తర విజ్ఞానం మహైశ్వర్యం మహా సంపద్విభూతులు అనేకం చూడగలవు. నీవు పాత్రుడవని నీకు బోధిస్తున్నాను. ఆత్మ తత్త్వం తెలుసుకోవాలి అనే జిజ్ఞాసయే జ్ఞానం. ఈ జ్ఞానం మనుష్యులలో కొందరికే ఉంటుంది. అందులో కొందరికే నిశ్చలభక్తి కుదురుతుంది. ఆ భక్తులలో కొందరికే జిజ్ఞాస కలుగుతుంది. అట్టి వారిలో కొందరికే ఆత్మజ్ఞానం లభ్యమవుతుంది. వారిలో కొందరే నన్ను భజించే అవకాశం పొందుతారు. అట్టి వారికే విజ్ఞానం అర్ధమవుతుంది. కనుక వివరంగా చెప్తాను. శ్రద్ధగా విను. విన్నది చక్కగా అర్ధం చేసుకుని ఆచరణలో పెట్టు. ఇది నీ ప్రథమ కర్తవ్యం.

భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం ఈ ఎనిమిది విధాలుగా నా మాయాశక్తి విభజించబడింది. ప్రకృతి రెండు విధాలు. ఒకటి 'పరాప్రకృతి' రెండు 'అపరాప్రకృతి'. ఈ పరాప్రకృతినే చేతన ప్రకృతి అంటారు. అపరా ప్రకృతినే 'జడప్రకృతి' అంటారు. ఈ రెండు ప్రకృతి భాగాలు

కలిసి సర్వభూతాలను జనింపచేస్తుంటాయి. ఈ ప్రకృతి భాగాలు మాయా విధాలు నా పరిచారికలే సుమా ! నా చేతి పనిముట్లే. కనుక ఈ విశాల విశ్వాన్ని సృష్టించాలన్నా, లయం చేయాలన్నా, నా యిష్టమే. ఇదంతా ఒక లీలగా చేస్తుంటాను. ఈ జగత్తు నావలన జనియిస్తుంటుంది. వృద్ధి పొంది లయమై పోతుంటుంది. జలంలో రసం, సూర్యచంద్రులలో వెలుగూ, వేద వాఙ్మయంలో ఓంకారం, ఆకాశంలో శబ్దం, పురుషులలో పౌరుషం, భూమిలో గంధం, అగ్నిలో ఉష్ణం, జీవులలో ప్రాణం, ఋషులలోని తపోబలం నేనే. నేనే అన్నిటిలో ప్రధాన శక్తి రూపం దాలుస్తుంటాను. విశ్వంలోని సకల భూతాలు జనియించటానికి బీజం నేనే. సర్వమహాత్ముల లోని వివేకం తేజస్సు, సంకల్పం నేనే.

త్రిగుణాలకు అతీతమైన నా అవ్యయ అఖండ అద్భుత స్వరూపాన్ని కొందరు శరణాగతులై గుర్తించకల్గుతారు. నా మాయాజాలాన్ని ఎవరూ గుర్తించలేరు. కొందరు భక్తులు నన్ను ఆరాధించి నా అనుగ్రహం పొందుతారు. అందువలన మాయా బంధాలు అతనికి అనుకూలమై మోక్షమార్గం సుగమ మవుతుంది. దురహంకారుల పథకాలు నామాయ ముందు పారవు. వారు దుర్బుద్ధితో నన్ను గుర్తించలేక విర్రవీగుతుంటారు. వీరిది అజ్ఞానం అసుర స్వభావం. ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అని నా భక్తులను నాలుగు రకాలు చేయవచ్చు. వీరందరు నిష్కల్మష హృదయులు.

1. **ఆర్తులు** : లోకంలో బాధలు భరించలేక నన్ను రక్షించమని నన్ను ప్రార్థిస్తుంటారు. ఆర్తితో నన్ను ఆహ్వానిస్తారు. 'ఆర్తత్రాణ పరాయణా ! ఆదుకో ప్రభో ! అని పాపం ! ఆక్రోశిస్తారు. అన్యథా శరణం నాస్తి అని ఆరాటపడతారు. ఇట్టి వారిలో గజేంద్రుడు ద్రౌపది మొదలైన వారు అనేకులు వస్తారు.

2. **అర్థార్థులు** : వీరు ఆర్థికంగానూ, దాయాదులతోనూ చిక్కులలో చిక్కుకుని అవస్థలు పడుతుంటారు. మానసికంగా క్రుంగిపోయి ఉంటారు. ఇక ఈశ్వరుడే గతి అని ప్రార్థిస్తుంటారు. ఇట్టివారిలో ధ్రువుడు మొదలైన భక్తులు వస్తారు.

3. **జిజ్ఞాసువులు** : వీరు నన్ను తెలుసుకోవాలని కృషి చేస్తుంటారు. వీరికి జిజ్ఞాస ఆలోచన సదాకాంక్ష తీవ్రంగా ఉంటుంది. వీరు యజ్ఞ యాగాదులు ధర్మ కార్యాలు చేస్తుంటారు. పండితుల గోష్ఠిలో పాల్గొంటూ ఉంటారు. ఇట్టి వారిలో జ్ఞాన అధికంగా ఉంటుంది. ఇట్టి వారిలో ఉద్ధవుడు వంటి వారెందరో ఉన్నారు.

**4. జ్ఞానులు**: వీరు నాతత్త్వం ఎరిగి నన్ను సేవిస్తుంటారు. సతతం నన్నే స్మరిస్తూ నాకథా కలాపాలు వింటూ తాదాత్మ్య సౌఖ్యం పొందుతుంటారు. ఇట్టి వారిలో ప్రహ్లాదుడు వంటివారు కొందరున్నారు.

ఈ నాలుగు రకాలైన భక్తుల్లో జ్ఞానులు నాకు మిక్కిలి ప్రియతములు. వీరిది విజ్ఞాన శాఖావిధానం. బహు జన్మల పుణ్యఫలంగా వీరు విజ్ఞానం జీర్ణించుకొన్నవారు. సర్వకాలాలలోనూ సర్వేశ్వరస్వరూపంగా దర్శిస్తారు. అద్వైతభావంతో భగవంతుని భజిస్తుంటారు. ఈ ఆర్తుడు, అర్థార్థి జిజ్ఞాసువు, జ్ఞాని ఉన్నత స్థితిలోని క్రమం. జ్ఞాని గొప్పవాడు.

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందే గలడు – అని చాటి చెప్తుంటారు.

మరికొందరు అల్పసుఖాలకై వాంఛలు తీర్చుకోటం కోసం ఇతర దేవతలను కొలుస్తుంటారు. వారిభక్తి చంచలమైనది. అయినా కూడా నేనే ఆయా దేవతలరూపంలో వారి కోరికలు నెరవేరుస్తుంటాను. దేవతంలదరూ నా అంశలే కదా ! ఇక్కడ కొంచెం ఆలోచించాలి. నన్నే నేరుగా భజించే వారికీ నా అంశ దేవతలను భజించేవారికీ తేడాఉంది. నన్నే సేవించేవారు పొందినంత ఫలం నా అంశగల దేవతను పూజించేవారు పొందలేరు. ఇతర దేవతారాధకులు లౌకిక వాంఛాతత్పరులు. వారి లక్ష్యం కోరికలు తీర్చు కోవటంపైనే ఉంటుంది. దేవతలపై భక్తి నిలకడగా ఉండదు. కోరికలు తీరగానే దేవతలను మరచి పోవటం వారికి సహజం.

నన్నే సేవించే వారు దృఢమైన భక్తికలిగి శాశ్వత సుఖసంపదలు పొందుతారు. కైవల్యం అందుతారు. భక్తి చిత్తం లేక నన్నుచూచిన వారు కృష్ణుడు భగవానుడన్నారే. ఈతడేనా ! ఇతడి ఆకారం ఇదేనా ! అని పెదవి విరుస్తున్నారు. వారికి నా దివ్య మహిమాతిశయాలు అర్థంకావు. స్థూల దేహం ధరించి నేను అవతరించగానే కొందరు మోహభ్రాంతికి లోనైపోతాను. కొందరు నన్ను తెలుసుకోలేకపోతారు. ద్వేష, మోహ, ప్రేమ, అపోహలకు లోనై నన్ను తెలుసుకోలేక పోతారు. నన్ను సేవించలేక పాపంలో పడి పరితాపం చెందుతుంటారు. వారికి ముక్తి దొరకదు. ఎప్పుడో పాపంక్షీణించిన తర్వాత భక్తి మార్గం వారికి బోధ పడుతుంది.

'పూజ్యేష్వనురాగో భక్తిః' అన్నారు. పెద్దలపై అనురాగం, వారి సూక్తులపై గురి వారి మాట ప్రకారం నడుచుకోవటమే భక్తి. ఈలాంటి భక్తి అనేక జన్మల సంస్కార ఫలంగా ప్రాప్తిస్తుంది.

ఈ భక్తి వలన మానవుడు జ్ఞానిగా మహాభక్తుడుగా పరిణతి చెందుతాడు. అపుడు జ్ఞాని తన ఆత్మనే పరమాత్మగా సర్వం విష్ణుమయంగా భావిస్తాడు. ధర్మం దర్శిస్తాడు. అట్టి ధర్మ జ్ఞానం గలవాడికి మరొకటి తెలుసుకోవలసి ఉండదు. సర్వులలో నన్ను నాలో సర్వులను దర్శించి తరిస్తాడు. నా ప్రియభక్తులు మరణ సమయంలో కూడా నన్ను మరిచిపోరు. వారిని నేను మరచిపోను. వారి భక్తి నన్ను వారి హృదయంలో నుంచి కదలనివ్వదు. నన్ను విడిచి వారుండరు. వారిది పూర్ణమైన ఆత్మవిజ్ఞానం. వారికి విశిష్టమైన ఆత్మజ్ఞానం. వారి సాధనా ఫలం అట్టిది. అట్టి విజ్ఞాన ఫలం లభించడం వారి పుణ్యఫలం.

మనసు మాలిన్యముల నెల్ల మట్టు వెట్టి
పరమ పరిశుద్ధ భావముల్ పాదుకొలిపి
జ్ఞాన దృష్టియు నేర్పడ కానబడును
విశ్వమంతయు బ్రహ్మమై వెలుగునటుల !

– శ్రీ సత్యసాయి

## 8

బ్రహ్మలోనీవు నీలోన బ్రహ్మయుండ
నీకు బ్రహ్మకు భేదమ్ము లేకయుండె
'నేనె బ్రహ్మ' మనుచు నిపుడైన తెలియ
రోయి ! శ్రీసాయి ప్రేమను గ్రోలి మీరు !

– శ్రీ సత్యసాయి

అర్జునుడు మళ్ళీ అడిగాడు – పురుషోత్తమా ! నీవు నాకు చాలా ఉత్తమ సంగతులు చెప్తున్నావు. జ్ఞానం నేర్పుతున్నావు. కానీ ఈ మంద బుద్ధి వెంటనే అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఈ విషయాలు మరొకసారి చెప్పండి !

1. బ్రహ్మం అంటే ఏమిటి ? ఆధ్యాత్మం అంటే ఏమిటి ?
2. ఈ దేహంలో నివసించేది యెవరు ?
3. ఈ దేహిని నడిపేది ఎవరు ?
4. మానవులకు ఫలం ఇచ్చేది ఎవరు ?
5. ఆ మహామహుడు ఈ చిన్న శరీరంలో ఎలా ఉండగల్గుతున్నాడు ?
6. బ్రహ్మం, కర్మం, అధిభూతం అధిదైవం అంటే ఏమిటి ?
   అక్షరం అంటే ఏమిటి ? సంతోషం, ఆనందం ఒకటేనా ?
7. అంత్యకాలంలో పరమాత్మను ఎలా గుర్తించాలి ?
8. అత్యున్నత దైవ సాన్నిధ్యం పొందటం ఎలా ?

ఈ మాదిరి సందేహాలు నన్ను వేధిస్తున్నాయి. స్వామీ ! వేదవేద్యా ! దయయుంచి వివరించు.

ఆ మాటలు ఆలించి ఆపద్బాంధవుడైన ఆనందమూర్తి మందహాసం చేసి ఇలా చెప్పసాగాడు– అర్జునా ! ఇట్టి జిజ్ఞాస కలగటం శుభసూచకం. ఆత్మజ్ఞానం

గూర్చి అతి శ్రద్ధగా ఆలకించాలి. ఇది అంత తొందరగా అర్థం కాదు. విన్నప్పుడు తెలిసినట్లే ఉంటుంది. కానీ పునరాలోచనకు ఆచరణకు అంతు పట్టదు. త్రికరణ శుద్ధిగా శ్రద్ధా భక్తులు కలిగివిను.

నీకు మొదటి సందేహం బ్రహ్మం అంటే ఎవరు అని కదా ! బ్రహ్మం అంటే బృహత్తరమూ మహత్తరము సర్వ వ్యాపకమూ సర్వసమర్థమూ అయినది. అది అఖిల ప్రపంచ ఆధారమైనది. బ్రహ్మం ఆత్మ పరమాత్మ బ్రహ్మకు పర్యాయ వాచకాలు. అధ్యాత్మం జీవన స్వభావం తత్త్వ విచారణం. ఈ శరీరంలో వసించేది నేనే. నేనుంటేనే అది శివం. లేక పోతే అది శవం. ఈ శరీరాన్ని నియమ ప్రకారం నడిపేది నేనే. నడిపే కర్మ జరిగేప్పుడు ఆ కర్మను యజ్ఞం అంటారు. సత్కర్మ అని నిర్వచనం. దానికి అధిష్ఠానం నేను. యజ్ఞ ప్రవర్తకుడను నేనే. యజ్ఞ ఫలదాతనూ నేనే. నేనే యోగీశ్వరేశ్వరుడను. సర్వ ప్రపంచ సంచాలకుడనూ నేనే. సర్వం నేనే. బ్రహ్మం అంటే చెప్పాను. కర్మలు విశేష కర్మలు నిషిద్ధ కర్మలు అని మూడు విధాలు. స్వార్థ త్యాగ కర్తవ్యమే కర్మ. నశించేది అధిభూతం. నశించనిది అధిదైవం. అక్షరం నారూపం. సంతోషం అంటే తృప్తి. ఆనందం నన్ను పొందుటే. జ్ఞానమూర్తి అయిన దైవానికి అందరూ సమానమే అనేది సత్యం. అయితే జీవులు వేరువేరుగా కష్టసుఖాలు ఎందుకు పొందుతున్నారు ! అనుకొంటారు. దీనికి దైవం కారణం కాదు. జీవులే సుమా ! అగ్ని వేడీ, కాంతీ కలిగింది. అగ్నికి మమకారం కానీ వ్యత్యాసం కానీ లేదు కదా. అగ్నికి దగ్గరగా జేరిన వారికి వేడి తగిలి చలీ చీకటి పోతుంది. దూరంగా ఉంటే వేడీ తగలదు. చలీ పోదు. చీకటీ పోదు. దూరంగా ఉన్నవారికి దైవ కారుణ్యం కూడా అంతే. కనుక మానవులు చేసుకొన్నవే వారి వారి కర్మలు అనుసరించి ఫలాలు వస్తుంటాయి. నేను కొన్ని నియమాలు ఏర్పరచాను. అవి జరపాలికదా ! అంత్యకాలంలో నన్నెట్లు స్మరించాలి, గుర్తించాలి, పిలవాలి అనా సందేహాలు ? విను.

అంత్యకాలంలో నీ ఇంద్రియాలు నీ స్వాధీనంలో ఉండవు. ఆభ్యాసం ఇంద్రియాలకు చాలా ముఖ్యం. అభ్యాసం వలన జీవుని ప్రయత్నంలేకుండానే ఇంద్రియాలు వాటిపని అవి చేసుకుపోతాయి. కనుక నా నామస్మరణ మనోనేత్రంతో నన్ను దర్శించటం, ఏ నామంతో నయినా నన్ను పిలవటం బాగా అభ్యాసం నిత్యం చేసుకొంటూండాలి. నేను ఎప్పుడూ జీవుల దగ్గరే చెవులు పెద్దవి చేసి తిరుగుతుంటాను. ఎవరు ఎప్పుడు పిలుస్తారో అని కాచుకొని ఉంటాను. నాకు దగ్గర అనీ, దూరం అనీ లేదు. భక్తుడు ఎలా భావిస్తే అలా వచ్చి వాలతాను. అంత్యకాలంలో ప్రాణులు ఏదేవుణ్ణి ఏ జీవిని ఎలా భావన చేస్తారో వారు ఆ దేవుణ్ణి ఆ జీవిని పొందుతారు. నన్నే స్మరిస్తే నన్నే పొందుతారు. ఏ భూతాన్నో స్మరిస్తే ఆ

భూతమే అవుతారు. మరు జన్మ అంతే. చిత్త శుద్ధితో నిష్కామంగా దైవం యొక్క యజ్ఞంగా నీ కర్తవ్యమైన యుద్ధం చేయి. ఫలం ఆశించకు ఫలం దేవాధీనం. నేను దైవాన్ని. నన్ను ఆ విధంగా పొందు. నేను కేవలం నీ భావనే కాదు అనేది గుర్తు పెట్టుకో. నేను సర్వేశ్వరుడను. సకల విద్యా నిర్మాతను. సత్యనిత్య సనాతనుడను. ఆకాశంకంటె విశాలం నా రూపం. అణువు కంటె సూక్ష్మం. నేను స్వయం ప్రకాశ పరంజ్యోతిని. మలినమైన మనోబుద్ధులకు అగోచరుడను. వారికి అందను. నేను భావనా ప్రియుడను. భావ స్వరూపుడను. యద్భావం తద్భవతి.

అర్జునా ! నీలో దివ్యమైన ఆత్మ తత్త్వం ఉంది. దానిని విస్మరించి భ్రాంతి వ్యామోహ మమకారాలలో పడబోకు. అక్షర స్వరూపాన్ని అనుసరించు. ఓం కారాన్ని స్మరించు. రూపనామ భావాలతో గూడిన దివ్యత్వంపై జీవితాన్ని లగ్నం చేయి. నీవు నిమిత్త మాత్రుడవు. పాత్ర ఉంటే జలం ఉంటుంది. లేకుంటే జలం లేదు. దేహమనే పాత్రలో గీతాసారాన్ని నింపుకో. ఘటం విడచిన ఆకాశం మహాకాశంలో లీనమైనట్లుగా, బుద్ధి మనస్సును వదిలి దివ్యత్వంలో కలిసిపోతుంది. పార్థా ! ఈ అక్షర స్వరూపం గుర్తించి దివ్యత్వం తెలుసుకో. నేను ప్రేమ మూర్తిని. ప్రేమయే నా జీవనం. ప్రేమే నేను. ప్రేమ పిల్లలపై ప్రసరించినపుడు వాత్సల్యం అనీ, బంధు జనంపై చూపిన మోహమనీ, దీనులపై చూపిన కరుణఅనీ, సమ వయస్కులపై చూపిన మైత్రి అని, వస్తువులపై వాంఛయనీ, పెద్దలపై గౌరవం అనీ, భగవంతునిపై చూపిన భక్తి అనీ అంటారు.

ఉన్నది ఒక్కటే విశ్వప్రేమ, విశాలప్రేమ, 'ఏకంసత్ బహుధా వదంతి.' భక్తి అనేది భగవంతుడికి రెండు పాదాలు. సగుణ భక్తి ఎడమకాలు. నిర్గుణభక్తి కుడికాలు. ఈ కాళ్ళ గమ్యం ఒక్కటే కదా ! సగుణం సాధన. నిర్గుణం సాధ్యం. సగుణం దారం, నిర్గుణం వస్త్రం. సగుణం విశ్వం, నిర్గుణం విశ్వేశ్వరం. నేను అక్షర కవిని. అంటే శాశ్వతుడను. 'కవిః సర్వజ్ఞః క్రాంత దర్శి' అని శ్రుతి. వేదవేత్తలు నన్ను అక్షర రూపంగా ఉపాసిస్తారు. యతీశ్వరులు ప్రాప్తిస్థానంగా భావిస్తారు. భక్తులు నన్ను వారికి తోచినట్లు భజిస్తారు. ఎవరైనా నన్ను చేరదలచిన వారు ఇంద్రియాలు జయించాలి. మనస్సు మాధవునిపై నిలపాలి. యోగి కాదలచినచో చిత్తాన్ని శివునిపై కేంద్రీకృతం చేసి ప్రాణవాయువును కనుబొమల మధ్య నిలబెట్టి ఓంకారంలో తానూ తనలో ఓంకారం తల్లీనం చేసుకోవాలి. ఇలా అభ్యాసం అనవరతం చేసినవాడు ఉత్తమయోగి అవుతాడు. నన్ను జేరుకొంటాడు. అవిరామంగా నన్ను ధ్యానిస్తూ నా కార్యక్రమంలోనే నిమగ్నం అయ్యేవాడు అతిసులభంగా నాలోకి వస్తాడు. నా భక్తుల మనస్సులను బట్టి మార్గాలు అనేకం సూచించాను. భక్తి గాఢంగా గలవాడు నన్ను ఏ మార్గం నుంచియైన వచ్చి నా

ప్రీతి పొందుతాడు. నా భక్తుడు ఎవరూ ఎన్నడూ అధోగతికి పోడు. దీపశిఖ ఎప్పుడూ పైకే చూస్తుంది. దిక్సూచి ఎప్పుడూ ఉత్తరదిశనే చూపుతుంది. భక్తుడు నన్నే చూస్తూ నన్నే జేరుకొంటాడు. భూలోకాల నుంచి అన్ని లోకాలు పునరావృతం అయ్యేవే. అన్నీ పునర్జన్మనిచ్చేవే. నాదొక్కటే అక్షయం అక్షరలోకం. నాలోకం అవ్యక్తం. అవ్యయం. ఇది బ్రహ్మాది దేవజీవ స్థితుల కంటె అన్యమైనది. అమృతమైనది. ఇది నాలోక స్వభావం. నా ఆత్మ స్వరూపం. అదే అక్షర బ్రహ్మ స్వరూపం. ఇంద్రియాతీతం. వేదాతీతం. సర్వయోగసారం ఇది. నన్ను ఏకత్వంగా భావించటం జ్ఞానుల లక్షణం. అది శివంకర దృష్టి. నన్ను అనేకత్వంగా భావించటం అజ్ఞానులదృష్టి. నీవు శివదృష్టి అలవరుచుకో.

దేహత్యాగానికి మంచిది ఎప్పుడు అని అడిగావు కదా ! చెప్పుతున్నాను గుర్తు పెట్టుకో ! సూర్యకాంతిలో అగ్నికాంతిలో శుక్ల పక్షం రోజుల్లో ఉత్తరాయణ కాలంలో దేహం త్యజిస్తే మంచిది. ధూమం లోనూ, రాత్రి కాలమందూ, కృష్ణపక్షం రోజుల్లో దక్షిణాయనకాలం లోనూ చనిపోయిన వారు సంసార చక్రంలో పడి నలుగుతూ ఉంటారు. మరల మరల జన్మలెత్తు తుంటారు. వేదాధ్యయనం, యజ్ఞ కర్మాచరణం దానశీలత్వం, తపోనియమం, నిష్కామ కార్యాచరణం గలవారు- ఎపుడు అనుకొంటే అపుడు శరీరం విడిచి పుణ్యగతులు పొందుతారు. నిరంతరం నాయందు నిశ్చయ బుద్ధి ముఖ్యం. అట్టి బుద్ధిమంతులు నా అక్షర బ్రహ్మ స్వరూపం పొంది నాకు కూడా నిత్యానందం కలుగ చేస్తారు.

నీటి యందె పుట్టి నీటిపై తేలును
నీటి యందణంగు నీటి బుడగ
నరుడు నీటి బుడగ నారాయణుడు నీరు
సత్యమైన బాట సాయి మాట

– శ్రీ సత్యసాయి

## 9

ఎద్ది కలదను చుంటిమో ! అద్ది లేదు
ఎద్ది లేదను చుంటిమో ! అద్ది కలదు
ఉన్న దొక్కటే దైవంబు యెన్నటికిని
లేని దయ్యెను విశ్వంబు కానరయ్య !

– శ్రీ సత్యసాయి

శ్రీ కృష్ణభగవానుడు అర్జునుడికి పరమగోప్యమైన ఒక విషయం వివరించ తలపెట్టాడు. అందుకు అతణ్ణి సిద్ధంచేసి బాగా అర్థమయ్యే పద్ధతిలో ఈ విధంగా బోధిస్తున్నాడు. పార్థా ! నేను పలికిందే పలుకుతున్నాను అనుకోవద్దు. ఈ విద్య విద్యలన్నింటిలోకి రాజువంటిది. కనుక దీనిని 'రాజవిద్య' అన్నారు. బ్రహ్మవిద్య అన్నా ఇదే.

లోకంలో సహజంగా ఒక విషయాన్ని గూర్చి మాట్లాడుతూ అదేమి! తెలియకపోవటానికి బ్రహ్మ విద్యా ! ఏమిటి అంటారు. అంటే బ్రహ్మవిద్య అతిగహనమైనది, గుహ్యామైనది, అతి రహస్యమైనదని తాత్పర్యం. ఈ విద్య మనస్సు బుద్ధి విచక్షణా జ్ఞానం ఏకాగ్రత లేనివారికి అగమ్యమే. అయితే ఇంత శ్రేయోదాయకమైనదీ, ఇంత ధర్మసంగతమైనది, ఇంత సాధ్యమైనదీ అక్షర ప్రదమైనదీ, అద్భుతమైనదీ మరొకటి లేదు. శ్రద్ధా హీనులు ఈ బ్రహ్మ విద్య యందు మనస్సు నిలపలేక వైముఖ్యంచూపి సంసారంలో పడి చస్తుంటారు.

'సత్యంవద - ధర్మంచర' అన్నది వేదం. సత్యం పలుకు ధర్మం ఆచరించు. మానవుడికి బలం దేహబలం కాదు. సత్యం పలకటమే బలం ధర్మంగా నడుచు కోవటమేబలం. కానీ నేడు ధర్మంగా ఆచరించటం మానివేసి ధర్మోపన్యాసాలు దంచేస్తున్నారు. సత్యం అని అసత్యాన్ని పలికేస్తున్నారు. ఆచరణ అనేది అసలే పోయింది. కాలంతో పరుగిడకుండ కర్తవ్యం క్రమంగా పాటించుతుండాలి. పని చక్కగా చేయి. పశుబలం ప్రదర్శించబోకు. ఆత్మబలం పెంచుకో ! ఆత్మ విశ్వాసం ముఖ్యం. అభ్యాసంతో ఆత్మ జ్ఞానం సాధించు. జ్ఞానం కలిగి ధ్యానం చేయి. ధ్యానం వలన కర్మ ఫలం త్యాగం చేయి. ఫలాపేక్ష అశాంతిని కలిగిస్తుంది. రజోగుణం వృద్ధి చేస్తుంది. ఫలంలేదని పని చేయక కూర్చోవడం తమోగుణం. దైవంపై భారంవేసి ఫలం అపేక్షించక పనిచేయటం సత్త్వగుణం. సమబుద్ధి. అది జ్ఞాన లక్షణం. సంఘ బుద్ధి రజోగుణ లక్షణం గలది. సంఘ బుద్ధికి అతీతంగా సమబుద్ధి కలిగి ఉండటం మంచిది. అది యోగి లక్షణం.

ఫలాపేక్ష సంసార హేతువు. ఫల ఉపేక్ష మోక్ష హేతువు. కర్మ ఫలత్యాగం లక్ష్యంలో పెట్టుకో ! అల్పవస్తువులు కోరేవాడు కృపణుడు. ఆత్మ వస్తువు కోరేవాడు ఉదారుడు. సూక్ష్మబుద్ధి సుఖహేతువు. కేవలం తన జీవితానందం మాత్రం కోరడం క్షుద్రం. మోక్షానందం పొందకోరటం భద్రం. త్రికాలానందం నా రూపం. ఇది తెలుసుకోవడమే జ్ఞానం. కనుక అర్జునా ! ఆలోచించు ! నా మహత్తత్త్వం వివరిస్తాను. విను-

అది అతి సూక్ష్మం. సూక్ష్మ బుద్ధికే అది అర్థమవుతుంది. నేను ఈ శరీరం మాత్రమే కాదు. ఈ శరీరం కొంతకాలం వరకే. నేను సర్వకాల స్థితుడను. శాశ్వతుడను. సర్వ ప్రపంచ వ్యాపిని. విశ్వం నా దేహం. చరాచర భూతాలు నాలోని జీవాణువులు. సర్వమయుణ్ణినేను. సర్వభూతాలలో నేను, నాలో సర్వభూతాలు ఉన్నాయి. అయితే నేను వస్తుతః అసంగుణ్ణి. నాలో అన్నీ ఉన్నా అన్నింటిలో నేనున్నా మమకారం లేదు.జీవులవలె నేను బంధాలలో చిక్కుకోను. అన్నీ నా అధీనంలో ఉంటాయి. నేను దేనికీ అధీనం కాను. మాయ నా పరిచారిక. మాయతో అన్నీ చేయిస్తుంటాను. మాయ వలన చరాచరాలన్నీ ప్రళయం వేళ నాలో లీనమవుతాయి.

ప్రతి కల్పారంభంలో నా నుంచే చరాచరాలన్నీ సృష్టించ బడతాయి. మాయతో అన్నింటినీ క్షణంలో మాయం చేస్తుంటాను. మరల తయారు చేస్తుంటాను. ఇది కూడా క్రమంలో జరుగుతుంటుంది. అయితే నాకిదే పనికాదు. చేస్తుంటాను, విడిచిపెడుతుంటాను.

దేనిమీదను నాకు ఆసక్తి లేదు. తటస్థుడను, సాక్షీభూతుడను. నన్ను కర్మజాలం బంధించలేదు. నేను సర్వాధిపతిని. నేను నిత్యసత్య శుద్ధ బుద్ధుడను. కాలాతీతుడను. కర్మా తీతుడను. అయినా అపుడపుడు మనుష్యదేహం, ధరించి పుడుతుంటాను. ధర్మ సంస్థాపనార్థాయ సంభవామియుగేయుగే అనేది ఉన్నది కదా !

ఈ నాతత్త్వం తెలియని మూర్ఖులు నన్ను నిందిస్తుంటారు. హింసా ప్రవృత్తి గలవారు నాపైకే కత్తులు దూస్తుంటారు. దూషిస్తుంటారు. పోనీ ! ఇతరుల దూషణ భూషణ తిరస్కారాలు నాకు పట్టవు. లోక కళ్యాణం కొరకు నేను చేసేది చేసుకుపోతుంటాను. భక్తులు పత్రమో ! పుష్పమో ! ఫలమో ! భక్తితో యిచ్చి నా ప్రీతికి పాత్రులు అవుతుంటారు. అసలు నాకు కావలసింది హృదయ ప్రేమ, ప్రేమఫలం. నాకు జీవులందరూ ప్రియులే. అప్రియులు అసలు లేరు. నేను భక్తులయందును భక్తులు నాయందు నివాసం చేస్తుంటాము. దుష్టుడైనను క్రమక్రమంగా నన్ను తలంచి మనస్సు మార్చుకొని నాదారిలోకి వస్తాడు. శాంతి పొందుతాడు. నా మీద శ్రద్ధ ఉంచి భజించేవాడు ఎన్నడూ నష్టపోడు. ఇదినీవు దృఢంగా నమ్ము. ఇది రాజ విద్యలోగల రహస్యం.

ధర్మము -సత్యము-కీర్తియు
నిర్మలదయ-విష్ణుభక్తి-నిరుపమ ఘనసత్
కర్మ-మహింసా వ్రతమును
నర్మిలిగలవారె పుణ్యు లవనీనాథా !

– భాగవతం

## 10

కంటి గ్రుడ్డును కాటుక అంటనటుల
జిడ్డు నంటక యుండెడి జిహ్వ యటుల
తామరాకును నీరము తాక నటుల
దేనినంటక యుండునదియహో ! ఆత్మ !

– శ్రీ సత్యసాయి

అర్జునా ! నా మాటలు నీ మేలుకు మేలిమి బాటలు సుమా ! నా తత్త్వం ఇంద్రాదులు, మహర్షులు మహా పండితులు కూడా సరిగా ఎరుగరు. నా అనుగ్రహం లేక ఎవరూ నన్ను గుర్తించలేరు. అణువంతకూడా అర్థం చేసుకోలేరు. నన్ను జనన మరణాలు లేని అవ్యయబ్రహ్మగా తెలుసుకో. నన్ను తెలుసుకొని భజించేవాడు పాపశూన్యుడై అతి సులభంగా పరమపదం పొందుతాడు. నా కృప వల్లనే మనుష్యులకు మంచి బుద్ధులు కలుగుతుంటాయి. అంటూ పరమాత్ముడు ఇంకా ఇలా బోధించసాగాడు–

పార్థా ! నీకు చెప్పే ఈ బోధలు నీ వంటి అనేక కోట్ల మందికి ఉపయోగకరాలు. నీవు విని బాగుపడతావు. నిన్ను చూచి నీవు పొందిన జ్ఞానం తెలుసుకొని మానవ జాతి కొన్ని యుగాలు బాగుపడుతూ ఉంటుంది. కొన్ని సనాతన ధర్మాలు చెప్తాను. ఆచరించి ఆదర్శ పురుషుడివి కమ్ము.

ఏ యోగాలు పట్టకపోయినా, మనః ప్రాణేంద్రియాలు నాకే అర్పించి నన్ను శరణాగతి పొంది నా కథా విశేషాలు వింటూ కాలం గడుపుతారో వారు

పరమానందంగా జీవనం పావనం చేసుకొంటారు. వారికి సర్వ సౌఖ్యాలు నేనే కల్పిస్తాను. వారికి ఏ ఒడుదుడుకులు ఆందోళనలు రావు. అన్నీ నేను చూసుకొంటాను. వారు నాకు పరమ ఆప్తులు.

అట్టి శరణాగతులలో విజ్ఞాన జ్యోతి వెల్గుతుంది. మోహం నశిస్తుంది. మోక్షం కరతలామలకం అవుతుంది. అర్జునుడు ఆత్మ బంధు మాటలు ఆలించిన వాడై భగవానుణ్ణి మరేదో అడుగదలంచి ఇలా ప్రార్థించాడు-

'పరమపురుషా ! పురుషోత్తమా ! నీవు సత్య సనాతనుడవనీ పదునాల్గు లోకాలు పాలించే ప్రాణపతివనీ ఆది దేవుడవనీ నీ మాటల వల్ల ఇపుడు బాగా అర్థమయ్యింది. లోగడ నారద వ్యాస వాల్మీకి వంటి మహా మహులు పురాణాలలో చెప్పగా విన్నాను. ఇపుడు కళ్ళారా చూచి విస్తు పోతున్నాను. ఒక్కసారి నీ మహత్తర విభూతి సంపదలు వైభవాలు దర్శించాలని మనస్సు మరీ మరీ మారాము చేస్తోంది. దయ యుంచి నీ వైభవం చూపు నా కోర్కె తీర్చు. నీకు శతకోటి ప్రణామాలు. దీనవత్సలా !ఆ విన్నపం ఆలించి ఆది మధ్యాంత రహితుడు ఆమోదం ప్రకటించి ఇలా అన్నాడు.

పార్థా ! పరమ భక్తాగ్రేసరా ! నీవు నా విభూతులు చూస్తావా ! సరే! ముందు విను వివేకవంతుడా ! విశ్వంలోని ప్రాణుల ప్రాణశక్తిని నేను. జనుల జనన వృద్ధి క్షయాలకుగల కారణం నేను. వెలుగులు చూపే సూర్య నారాయణుణ్ణి నేనే. మరుత్తులలో మరీచిని - నక్షత్రాలలో చంద్రుణ్ణి, వేదాలలో సామవేదం, దేవతలలో ఇంద్రుణ్ణి నేనే. నేను మనస్సును, నేనే జ్ఞానం, శబ్ద బ్రహ్మం, ప్రణవం నేనే, రాముణ్ణి, కృష్ణుణ్ణి, గోపాలుణ్ణి నేనే. సర్వశ్రేష్ఠ వస్తువులు శ్రేష్ఠ జీవులు నేనే. అంటే ఇతర వస్తువులు ఇతరులు నేను కాదనికాదు. అన్నీ నేనేఅయినా ఆదర్శంగా కొన్నింటిలో నా శక్తి ద్విగుణీకృతంగా ప్రకాశిస్తుంది. అవతారాలన్నీనావే. మహాత్ముల ఆత్మలన్నీ నావే. బుద్ధులన్నీ నావే.

ఈ విశ్వం నా సంకల్ప జనితమే. అన్నింటిలోని చలన శక్తిని నేనే. నా వల్లనే సర్వజీవులు జనిస్తున్నాయి. జీవిస్తున్నాయి. వృద్ధి పొందుతున్నాయి అద్భుతాలు చేస్తున్నాయి. ఆనందిస్తున్నాయి. ఈ మహా పర్వతాలను, సముద్రాలను వృద్ధి చేస్తుంటాను. హరిస్తుంటాను. మహాప్రళయాలు ప్రభంజనాలు నా సంకల్పం వల్లనే జరుగుతుంటాయి. అణువుల్లో మహాశక్తిని నిక్షిప్తం చేస్తాను. అణువంత దానితో కొండంత దానిని హతం చేస్తాను. నేను చేసే కృత్యాలు ఎందుకో ఎవరికీ అంతుపట్టవు. నాకది వినోదం, ఏవో కట్టిస్తుంటాను, పడేస్తుంటాను. పుట్టిస్తుంటాను. మరుక్షణంలో గిట్టిస్తుంటాను. విశ్వం నా క్రీడారంగం. నాటకాలిడిస్తుంటాను.

ఇలా నా విభూతులు అనేకం ఎన్నని చెప్పేది ! వాణి చెప్పలేక అలసి పోయింది. వేలనోళ్ళతో కీర్తించలేక వాసుకి సొమ్మసిల్లి పోయాడు. పండితులు తెల్లమొగం వేశారు. శాస్త్రజ్ఞులు విజ్ఞులు అజ్ఞులైనారు.

ఏవో కొన్ని ఉదాహరణగా చెప్పాను. అంతటా నేనే అన్ని రూపాలు నావే. అన్నీ నా అంశాలే. నాది ఏ వస్తువూ లేదు. నేను సర్వత్ర వ్యాపించి యున్నాను. అంతా నా విభూతి సంపదయే. అంతా నా వైభవాలే. ఇది గుర్తించిన వాడు మహా విజ్ఞాని. ఇది తెలియని వాడు ఎంత చదువుకొన్నా అజ్ఞానియేసుమా !

భక్తి రసానంద పారవశ్యము కల్గ
భవ బంధ భూతముల్ పారిపోవు
భవబంధభూతముల్ పారిపోయిన తోడ
మోక్షాభిమానంబు మొలక లెత్తు
మోక్షాభిమానంబు మొలకలెత్తిన యంత
జ్ఞానోదయప్రాప్తి సంభవించు
జ్ఞానోదయ ప్రాప్తి సంభవించిన వేగ
తన్నుతానెరిగెడి తత్త్వ మబ్బు

జగము మాయమైపోయిన నిగమవినుతు
నిత్యసౌభాగ్య రూపంబు నిలుచు మదిని
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార !

– శ్రీ సత్యసాయి.

## 11

హరి మయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు - సంశయము పని లేదా
హరి మయము కాని ద్రవ్యము
పరమాణువులేదు - వంశపావన వింటే !

-భాగవతం

స్వామీ ! సర్వాంతర్యామీ ! నన్ను అనుగ్రహించారు. గుహ్యతమ మైన రాజయోగం చెప్పి అజ్ఞానం తొలిగించారు. అక్షర మహిమ విభూతులు వివరించి మాయతెరలు పటాపంచలు చేశారు. సందేహాలు తీరిపోయాయి. ఒక్కసారి నీ విశ్వరూపం చూడాలని ఉంది. ఆ యోగ్యత నాకున్నదా ! నీదయ ..... అని అర్జునుడు అచ్యుత స్వామి అడుగులపై ప్రణమిల్లాడు. అంతట అఖిలాండ పిండ బ్రహ్మాండ పతి అనుగ్రహించాడు. కృపాదృష్టితో చూచి మందహాసం చేసి అట్టైన నీవు నా అవ్యయమైన విశ్వ విరాడ్రూపం చూడాలని కోరుతున్నావు అన్నమాట సరే ! ఈ ప్రాకృత నేత్రాలు నా రూప దృశ్యాలు పూర్తిగా చూడలేవు. నీకు దివ్య నేత్రాలు ప్రసాదిస్తున్నాను. ఆ మహా వైభవాలు సామాన్యులు చూచి తట్టుకోలేరు. అని స్వామి క్రీడి కన్నులను చేతితో తుడిచాడు. విశ్వ విరాడ్రూపం చూపి వివరిస్తున్నాడు.

అదిగో చూడు అర్జునా ! ఆ కనిపించే వారు ద్వాదశ ఆదిత్యులు. వారి తేజస్సు చూడు. ఎలా పరిభ్రమిస్తున్నారో గమనించు. అరుగో ! వారు ఏకాదశరుద్రులు. ఆకారాలు హావభావాలు దర్శించు. వారంతా నా శరీరంలోని

పనివారు. ఆ ప్రక్క కనిపించేవారు అష్టవసువులు. ప్రజాపతులు మారుత్తులు అశ్వినీ కుమారులు. ఈ మహా మహులతో నా శరీరం దేదీప్య మానంగా సదా ప్రకాశిస్తూ ఉంటుంది. నా శరీరానికి హద్దులు లేవు. నాది విరాట్రూపం. ఈ విశాలరూపం ఇంతవరకూ ఎవరూ చూచి ఎరుగరు ! నా శరీరంలో అనంతకోట్ల అద్భుత లోకాలున్నాయి. జీవకోట్లు అనేక రకాలు. భూత భవిష్యద్వర్తమానాలు నా శరీరంలోనే తిరుగుతుంటాయి. లోకాలు చూడు. అవి అధోలోకాలు. అవి ఊర్ధ్వలోకాలు. వారు దేవజాతులు. గంధర్వులు దైత్యులు గరుడులు. పన్నగులు అలా వివిధ వృత్తుల వారు ప్రవృత్తుల వారు నివృత్తి తత్పరులున్నారు.

అని శ్రీకృష్ణదేవుడు తన విశ్వ విరాట్రూపం గూర్చి మన పార్థుడికి చూపిస్తున్నాడయ్యా ! ధృత రాష్ట్ర మహారాజా ! అంటూ సంజయ మంత్రి తన దివ్యనేత్రాలతో చూస్తూ విస్తుపోతూ వివరిస్తూన్నాడు. ధృతరాష్ట్ర మహారాజు అలానే అంటూ ఆలకిస్తున్నవాడల్లా చేతులెత్తి జోడించ సాగాడు.

సంజయుడు చెప్పుకు పోతున్నాడు. మహారాజా ! మన కృష్ణుడు కృష్ణుడు కాదయ్యా ! మహావిష్ణుదేవుడైనాడు. అర్జునుని ముందున్న వాడల్లా పెరిగి పోతున్నాడు. దివ్య తేజోమయ విగ్రహుడైనాడు. వామనుడు త్రివిక్రముడయింది. ఈ విధంగానే నేమో !

ఆ కృష్ణ విగ్రహం విశ్వ మోహనంగా ఉంది. సర్వమంగళకరంగా ఉంది. మహా మహిమాద్భుతంగా ఉంది. ఆ కృష్ణస్వామి ఆజానుబాహుడు. అరవింద దళాయత నేత్రుడు. మందహాసం చిందిస్తున్నాడు. కృష్ణుడంటే సార్థకనామమదేసుమా !

ఆ స్వామి ఒకడు కాదు. అంతలో అనేక ఆకారాలు. ఆవిలాసాలు హావభావాలు అనంత ఆకృతులు చూపిస్తున్నాడు. అందాలు చిందిస్తున్నాడు. ఆనందాలు కలిగిస్తున్నాడు. ఆమోదాలు చూపిస్తున్నాడు. అద్భుతాలు, ఆహ్లాదాలు అవి మరీ అత్యద్భుతాలు.

ఆ స్వామి కంఠ ప్రదేశంలో పూలమాలలు, వనమాలలు, తులసీ మాలలు మల్లెలు మందారాలు పద్మాలు పారిజాతాలు వివిధ వినూత్న పరిమళాలను వెదజల్లుతున్నాయి. ఎన్నో సౌగంధికాలు దేవప్రసూనాలు ప్రకాశిస్తున్నాయి. అన్నిటికంటె కౌస్తుభహారం దేదీప్యమానంగా ఉంది. భుజాలపై కేయూరాలు, భుజకీర్తులు, మహేంద్ర వైభవాన్ని తలపిస్తున్నాయి.

అదిగో ! శిరస్సుపై వజ్రవైడూర్య రత్నకిరీటం త్రిభువన ప్రాభవాన్ని తెలియజేస్తుంది. కమలాయత నేత్రాలు మనోహర మందహాస రుచులను విందు చేస్తున్నాయి. విశాల ఫాల తలంపై ఊర్ధ్వపుండ్రాంకిత ధవళ అరుణజ్యోతులు

మనోల్లాసకరంగా ఉన్నాయి. ఆ మందహాస విలాసం మహాదేవ మహర్షుల మనస్సునే పులకింపజేస్తున్నది. ఆ విలాసంలో ఎన్ని దేవలోక వికాసాలు ! వినూతన సనాతన శుభసంకేతాలు ప్రతిబింబిస్తున్నాయో ! ఆశరీర సురుచిర నీలిమచ్ఛాయ స్వచ్ఛమై తత్త్వ పరిపాక సౌరభాన్ని గుబాళిస్తోంది. ఆ నీలిమ నానావర్ణ సమ్మేళన సారం. విశిష్ట విస్ఫురద్రూప సుందర ప్రసారం. ఆ స్వామి చేతులలో అనేక ఆయుధాలు, అరవిందాలు, అభయ ముద్రలు అందం చిందించి ఆనందం ఒలికిస్తున్నాయి.

ఆ సుందర విగ్రహం చూచి అర్జునుడు అనుపమానందం ఆశ్చర్యం పొందాడు. ఆ రూపామృతాన్ని ఆస్వాదిస్తున్నాడు. విశ్వ సుందర విరాడ్రూపం ఇలా ఉంటుంది అనుకోలేదు. తన్మయస్థితిలో ఉండి పోయాడు. భక్తి రసంలో మునిగి పోయాడు. క్రీడి ఆ స్వామి దేహంలో క్రమక్రమంగా దేవగణాలు పితృగణాలు, మిత్రగణాలు, శత్రుగణాలను చూస్తున్నాడు. వారిలో మానవులు, దానవులు తమ స్వభావాలను ప్రకటిస్తున్నారు. మునీశ్వరులు, యతీశ్వరులు, మహీశ్వరులు కనిపిస్తున్నారు. కొందరు కొందరిని ఆనందపరుస్తున్నారు. కొందరు ఆశ్చర్య పరుస్తున్నారు. కొందరు భయంకరంగా ఉన్నారు. ఇలా అనేక మూర్తులు !! అనేక దృశ్యాలు!!. మహారాజా ! పార్థుడు పరవశంతో పరమేశ్వరుడైన కృష్ణ పరమాత్మను పరిపరి విధాల చూచి తలవంచి నమస్కరించి ఇలా ప్రార్థించ సాగాడు.

“ఆదినారాయణా ! ఆది మధ్యాంతర రహితా ! అనఘా ! భక్తజన పారిజాతా ! భవ భయ పరిహారా ! నీ సుందర సురుచిర సువిశాల రూపం నేటికి చూడ గలిగాను. నీ బృహద్రూప సౌందర్యం చూచి ఒక్కసారిగా పరవశం చెందాను. ఆస్వాదించాను. అమోఘమైన రూప, సౌరభ మహా మహిమాద్భుతమైన నీ మంగళరూపం చూచి తరించాను. వివిధ విధాలుగా విలసిల్లుతున్న నీ ఆకృతులు చూచి పులకించి పోయాను. సకల చరాచరాల లోనూ చిత్ర విచిత్ర ప్రాణులలోనూ నీవే ప్రతిఫలిస్తున్నావు. విశ్వంలో అంతటా అణువణువునా నీవే

“అర్జునా ! కళ్ళు తుడుచుకొని మరొక్కసారి చూడు అన్నాడు

్మ్ర. అట్లే అని కళ్ళుతుడుచుకుని మళ్ళీ చూడసాగాడు కౌంతేయుడు-

అంతే మాధవుడు మహాకాల రుద్రుడైనాడు. మురళీనాదాలు పోయి డమరుకనాదాలు, ప్రణవనాదాలు, భేరీ భాంకారాలు ప్రతిధ్వనించాయి. భూమి అంతాస్వామే. ఆకాశంమతా స్వామే. పర్వతాలు మహాంబుదాలు, అబ్ధులు, అగ్ని ప్రభంజనాలు అన్నింటిలో స్వామి ఆకారాలే. యుద్ధాలు, మారణహోమాలు సింహనాదాలు, ఆర్తనాదాలు, హాహాకారాలు, దానవులు, మానవులూ యుద్ధాలు

అంతటా మహాదేవ తాండవాలు, దహించుకుపోయే వనాలు, పడిపోయే భవనాలు, వికటాట్టహాసాలు, విలయదృశ్యాలు ఎన్నో !! ఎన్నో !! చూస్తున్నాడు విస్తుపోతున్నాడు. ఇకచూడలేక అర్జునుడు ప్రార్థించసాగాడు.

స్వామీ ! సర్వేశ్వరా ! సాయీశ్వరా ! సాష్టాంగ ప్రణామాలు ! నిన్ను మహావిష్ణువుగా చూచాను. పరబ్రహ్మమూర్తిగా చూచాను. మహా దేవుడుగా చూస్తున్నా. నీవు ఏక రూపుడవు. అనేక రూపుడవు. సత్యనిత్య సనాతన ధర్మ సంరక్షకుడవు. రాక్షస గణ వినాశకుడవు. వీర మూర్తివి. నీవు వీర భద్రుడవు. మహారుద్రుడవు. దయా సముద్రుడవు.

విశ్వరూపా ! సూర్య చంద్రులు నీ నేత్రాలు. నీ ముఖం తేజో మండలం. నీవు విశ్వస్వరూపుడవు. ఈ రూపాలు అన్నీ నీవే. ఎన్ని మూర్తులు ! ఎన్ని ఆకారాలు !! కోట్లానుకోట్లు. నీ నోరే మహా అగ్ని గుండంగా కొన్ని క్రోసుల వరకుంది. మధుసూదనా ! కౌరవులు సేనా సమేతంగా ఆప్తవర్గంతో వచ్చి నీ మహాక్రోధాగ్ని గుండంలో పడి మాడి పోతున్నారు. భీష్మ ద్రోణ కర్ణాదులు యుద్ధాగ్నిలోకి మిడతలదండువలె వచ్చి మ్రగ్గి పోతున్నారు. రక్తనదులు పొంగి పోతున్నాయి. వరదలు సముద్రంలో జేరుతున్నట్లు అక్షౌహిణీ సైన్య సమూహాలు ఉవ్వెత్తుగా వచ్చి పడుతున్నాయి. నీవే నోరు తెరచి మ్రింగుతున్నట్లున్నావు.

కాల స్వరూపా ! నీ రూపం మహోగ్రంగా ఉంది. మహాభయంకరంగా ఉంది. ప్రాణికోటి గజగజ వణికిపోతుంది. బ్రహ్మాదులు బ్రహ్మావాదులు మహర్షులు మహాత్ములు స్తోత్రాలు శాంతి మంత్రాలు వల్లిస్తున్నారు. స్వామీ ! ఈ భయంకర దృశ్యాలు నేను చూడలేను. నా తప్పులు క్షమించు. నేను కోరరాని కోరిక కోరాను. కృప వహించు. పాపము శమించు గాక ! నీ విశ్వ విలయరూపం ఉపశమించు. నీ ఈకాల కఠోర దృశ్యాలు ఉపసంహరించు ప్రభో ! నీ ప్రళయరూపం నేను చూడలేను. నీవు ప్రసన్నంగా ప్రత్యక్షంగా పరమేశ్వరా !..... అని వణికి పోతున్న కౌంతేయుణ్ణి చూచి కృష్ణదేవుడిలా ఊరడించాడు.

పార్థా ! నేనెవరినో నీకు తెలియపరిచాను. నేను సర్వాధిపతిని. సర్వేశ్వరుడను. లోకాల సృష్టి స్థితి లయాలు క్రీడగా చేస్తుంటాను. నీకు సంహార కార్యం చూపాను. నీవు యుద్ధం చేయక పోయినా ఈ జన సందోహం చనిపోయేదే. నీవు చంపక పోయినా నేను ఒక్కణ్ణే హతం చేయగలను. ఇచట పుట్టినవారు చనిపోవలసిందే. ఈ దేహాలు ఎల్లకాలం ఇలానే ఉండవు. ఇది తెలియటం కోసం నీకు చూపాను. నీవు నామాట విని మహా యుద్ధం చేసి విజయం పొందు. మహాకీర్తి నందు. రాజ్యం అనుభవించు.

నా సంకల్పంతో వీరు చంపబడినారు. నీవు కేవలం నిమిత్త మాత్రుడవు.

భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనాదుల ఆయువు సమాప్తి అయ్యింది. వారందరికీ మరణం నీచేతిలో వ్రాసి పెట్టిఉంది. నే సంకల్పించిన వారినే నీవు చంపేది. గెలుపునీది, సంకల్పం నాది. బాణం సంధించు.

అని కృష్ణభగవానుడు పార్థుడికి చెప్పుకు పోతున్నాడయ్యా ధృతరాష్ట్ర మహారాజా ! అపుడు అర్జునుడు ఇలా అన్నాడు అని సంజయుడు వివరిస్తున్నాడు. హృషీకేశా ! చతుర్థశ భువనేశా ! నీ మహిమాతిశయానికి దేవాధీశులెల్లరు ఆనందిస్తున్నారు. నీ ప్రభావం అత్యద్భుతం. నీ సంప్రీతికై మునిగణం ప్రతీక్షిస్తుంటుంది. రాక్షసులలోనూ విచక్షణాపరులు సంతోషిస్తారు. భక్త చింతామణీ ! నీవు ఆదికర్తవు. వ్యక్తా వ్యక్త శక్తులకు అధిపతివి. నీవు అక్షర స్వరూపుడవు, విశ్వవిరాడ్మూర్తివి. అందరినీ సృష్టించే బ్రహ్మను పుట్టించిన వాడవు. నీవు సకల జాతుల వారికి దేవదానవ ముని జనాలకు వందనీయుడవు.

నమో నమస్తేస్తు సహస్ర కృత్వః
పునశ్చ భూయోపి నమో నమస్తే ॥

స్వామీ ! నీబల పరాక్రమాలకు అంతులేదు. నీవు సర్వజ్ఞుడవు. సర్వస్వరూపుడవు, సర్వసమర్థుడవు. సర్వదేవతాతీతుడవు. సర్వేశ్వరుడవు. మహేశా ! నీ మహిమ తెలియక బావవనీ, బాంధవుడవనీ, స్నేహితుడవనీ, నావంటి వాడవే అనీ, తేలికగా తలంచాను. చులకనగా మాట్లాడాను. చనువు తీసుకొని అవినయంగా ప్రవర్తించాను. ఆటల్లో పాటల్లో అమర్యాదగా చూచాను. పదిమందిలో పరిహాసం చేశాను. బుద్ధిలేక నీ యెడల అనేక తడవల పెద్దపెద్ద తప్పులు చేస్తూ వచ్చాను. నన్ను క్షమించు స్వామీ !

నీవు మహా మహేశ్వరుడవు. మహా విష్ణుమూర్తివి. పరబ్రహ్మ మూర్తివి. అందరికి తండ్రివి. తండ్రి కొడుకుల తప్పులు క్షమించి దారి చూపుతాడు కదా ! ప్రియుడు ప్రేయసి నేరాలు లెక్కపెట్టడు కదా ! అలానే సరిదిద్ది యేలుకో తండ్రీ ! నీవు ఎప్పుడూ ప్రియమైన బావలాగానే ఉండాలి. ఎన్నడూ ఎవ్వడూ చూడని నీ అద్భుత విశ్వరూపం నాకుచూపి నా కన్నులు తెరిపించావు. నీ మహారూపం చూచి నీ మహిమ ఇట్టిదని తెలుసుకోగలిగాను. ఒకవైపు భయం ఒకవైపు ఆశ్చర్యం కొంచెం సేపు ఆనందం కొంచెంసేపు ఆందోళన కలుగుతున్నాయి.

ఓ దేవాధిదేవా ! నీవు పూర్వం వలె నా బావగా, నా బంధువుగా, నా చెలికాడులాగా చిరునవ్వులు చిందిస్తూ సరసాలాడుతూ నా వద్దనే ఉండు. నాకు ఆనందం కలిగించు స్వామీ ! నీ విరాడ్రూపం రౌద్రాకారం చూడలేను. ఆ భయంకర రూపం ఉపసంహరించు. నిన్ను మనసారా భజిస్తాను. మనశ్శాంతి

ప్రసాదించు. ఆనందం కల్గించు.

అపుడు అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు ప్రసన్నంగా కనిపించాడు. కల్యాణ కరంగా మందహాసం చేసి ఇలా సెలవిచ్చాడు –

“నిర్మల మానసా ! భక్తవరేణ్యా ! నీకు నాయందుగల ప్రేమచేతనే నా యోగశక్తితో ఈ మహారూపవైభవం చూపాను. నీవుకాక ఎవరూ ఇట్టి రూపం చూచి ఉండరు. కొందరు చూస్తారు కానీ వారి భావాలు ఫలితాలు వేరు. ధృతరాష్ట్రుడు, దుర్యోధనాదులు చూచి ఇదేదో ఇంద్రజాలం అనుకొంటారే కాని వారికి భక్తి కలుగదు. ‘ యద్భావం తద్భవతి’. సకల వేదాలు తెలిసిన వారూ, యజ్ఞయాగసత్కార్యాలు చేసినవారూ, దాన ధర్మాలు చేసిన వారూ, మహా విజ్ఞాన ప్రజ్ఞాన పండిత ప్రకాండులూ, ఎవరూ ఈ దర్శన భాగ్యం పొందలేరు. నీవొక్కడివే ఈ అద్భుత రూపం చూచి ధన్యుడవైనావు.

పార్థా ! నీకిక భయం లేదు. సందేహం చెందనక్కరలేదు. నా మహిమలు మననం చేసుకో. కర్తవ్యం పాలించు” అని వాసుదేవుడు భయపడిన కౌంతేయుణ్ణి సంతోషపరిచాడు.

ఆనందదాయకా ! అనురాగమూర్తీ ! ప్రేమ స్వరూపా ! నీకు శతకోటి నమస్కారాలు. నాకు ఇపుడు మహానందంగా ఉంది. నాకు ఇప్పటికి స్వస్థత చేకూరింది. గురి కుదిరింది.

అపుడు కృష్ణపరమాత్మ ఇలా ఊరడించి పల్కాడు– “నీవు చూచిన అద్భుతరూపం చూడాలని ఎందరో ప్రతీక్షిస్తున్నారు. అది అతి దుర్లభం. నీ భక్తి నిర్మల హృదయం ఈ అర్హత కలిగించాయి.

అర్జునా ! నా కొరకై కర్మలు క్రతువులు చేయువారూ, నన్నే శరణుజొచ్చినవారూ, ఏ ఒక్కరితోనూ వైరం లేనివారూ, సర్వప్రాణులపై జాలీ దయ గలవారూ నాకు అత్యంత ప్రియభక్తులు. నీవు అట్టి వారిలో శ్రేష్ఠుడవు.

“ లౌకిక మొల్లక నన్నా
లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా
లోకనముల పోషింతును
నా కాశ్రిత రక్షణములు నైసర్గికముల్ ”

– భాగవతం

## 12

చిక్కడు వ్రతముల క్రతువుల
చిక్కడు దానముల శౌచ శీల తపములన్
చిక్కడు యుక్తిని భక్తిని
చిక్కినక్రియ అచ్యుతుండు సిద్ధము సుమ్మీ !

– భాగవతం

అర్జునుడు కృష్ణస్వామికి భక్తితో నమస్కరించి ఈ విధంగా సంప్రశ్న చేశాడు.

స్వామీ ! సర్వాంతర్యామీ ! ఒక చిన్న సందేహం. భక్తులలో అనేక రకాలున్నారు కదా ! వారిలో సాకార ఉపాసకులు శ్రేష్ఠులా ! నిరాకార ఉపాసనాపరులా ! వివరించు స్వామీ !

అపుడు కృష్ణ పరమాత్మ చిరునవ్వు నవ్వుతూ అదా ! నీ సందేహం! అనిఇలా బోధించాడు– విజయా ! సగుణోపాసకులు కానీ నిర్గుణో పాసకులు కానీ అనన్య భక్తి కలిగియున్న వారు నాకు అత్యంత ప్రియ భక్తులు. ఎవరైనా సరే ఏకాగ్రబుద్ధితో నన్ను ఆరాధించాలి.

ప్రథమంలో సగుణ భక్తి అభ్యాసానికి మిక్కిలి అనుకూలంగా ఉంటుంది. ఇష్టదేవతామూర్తిని పూజించటం ధ్యానించటం ద్వారా భక్తి కుదురుతుంది. లక్ష్యం కుదరటానికి విగ్రహారాధనమో ! చిత్రపట ధ్యానమో చేయాలి. 'స్వామియే అలా వచ్చి కూర్చున్నా' రని ఉపచారాలు సపర్యలు చేస్తూ స్వామితో మాట్లాడుతూ తియ్యని అనుబంధం ఏర్పరచుకోవాలి. ఆ అనుభూతి క్రమక్రమంగా సమయం పెంచుకొని తాదాత్మ్యస్థితి చేరుకోవాలి. ఇందుకు సాకార పూజా పద్ధతులు అనుకూలపడతాయి.

ఆ తర్వాత విగ్రహం చిత్రం లేక పోయినా భక్తుని హృదయ కమలమే స్వామికి మందిరమవుతుంది. ఆ తర్వాత విశ్వమే విష్ణుమయంగా భావించి ప్రతివ్యక్తినీ పరమేశ్వరుడుగా దర్శించాలి. సర్వంలోను సర్వేశ్వరుని చూడగలగాలి. అపుడు సాకారం నిరాకారంగా, అవధులు లేని స్వామి, మారి మహామానవాకారంలో మాధవుడు అనుభవంలోకి వచ్చి పరమానందం కలిగిస్తుంటాడు. ఇది సాకార నిరాకార పరమార్థం.

ప్రథమంలోనే నిరాకార ధ్యానం ప్రారంభిస్తే మానవుని మనస్సు నిలిచి మాధవుని దర్శించటం చాలా కష్టం. భక్తునికి కష్టాలు క్లేశాలు అవరోధాలు ఆటంకాలు అనేకం వచ్చి చిత్తం ఏకాగ్రత కలగటం సాధ్యం కానట్లు తోస్తుంది. అయితే కొందరు మహాత్ములుంటే ఉండవచ్చు.

భక్తులు సుగుణాలు సద్ధర్మాలు సదాచారాలు ఆచరణలో పెట్టాలి. ధ్యానం కుదరనప్పుడు దైవకార్యాలలో మనస్సును శరీరాన్ని మగ్నం చేయాలి. ఫలం ఆశించకుండా నిస్వార్థంగా నిశ్చల భక్తితో ఎవరితోనూ వాదులాటకు దిగకుండా స్వామి సేవలో ఉండి పోవాలి. స్వామి త్రివిధాల విరాజిల్లు తుంటాడు. 1. సాకారంగాను 2. నిరాకారంగానూ, 3. సాకార నిరాకార మిశ్రమంగానూ భక్తునికి అనుకొన్నది సిద్ధించినా సిద్ధించక పోయినా భగవదారాధన మానసికంగా చేస్తుండాలి. సమత్వబుద్ధిని అలవర్చు కోవాలి. శమదమాది సుగుణాలు అభ్యాసం చేసుకోవాలి. కోపతాపాలకు అవకాశం ఈయరాదు. క్షమాగుణం చాలా అవసరం. లోక కల్యాణం ఏకైకలక్ష్యంగా హృదయం స్థిర పరచుకోవాలి. ఇంద్రియ నిగ్రహం భక్తుడికి పెద్దకవచం. ఇంద్రియ నిగ్రహం గలవాడే ఉత్తమ భక్తుడు.

స్వామి ఆర్తత్రాణ పరాయణుడు. దీన బాంధవుడు, లోకైక రక్షకుడు. ఆప్త బంధువు. త్రిభువన ప్రభువు. మరియు స్వామి అప్రమేయుడు అద్వితీయుడు సాకారుడు నిరాకారుడు అనుకొన్న చోటికి రాగలవాడు. ఎట్టి దుర్ఘట కార్యమైన చేయగలవాడు. ఏ ప్రమాణాలకు అందనివాడు ఊహాతీతుడు. అనీ దృఢంగా మనో వాక్కాయ కర్మల ద్వారా నమ్మిన వాడై భక్తుడుండాలి.

అర్జునా ! భక్తులు తాము చేసే కర్మలు కర్మ ఫలాలు నాకే అర్పణ చేసినపుడు వారి మనస్సు తేలికగా సంతోషంగా ఉంటుంది. కర్తృత్వం భోక్తృత్వ మమత్వ బాధ్యతలు తనపై పెట్టుకున్నప్పుడే మనస్సు ఉక్కిరి బిక్కిరి అవుతుంది. ముందు మనస్సును ప్రశాంతంగా ఉంచు. అన్నింటికంటె అనుభవజ్ఞానం చాలా గొప్పది. అనుభవంతో జీవనం పావనం చేసుకో. ఆర్భాట వేదాంతికాదు. కావలసింది అనుష్ఠాన వేదాంతి. ఆచరణయే స్వామి చరణాలకడకు జేరుస్తుంది.

జ్ఞానంతో కూడిన ధ్యానం శ్రేష్ఠం. ధ్యానం కంటె నిష్కామ కర్మాచరణం శ్రేష్ఠం. దీని వలన మనశ్శాంతి కల్గుతుంది. కనుక కౌంతేయ ! నీవు నిస్వార్థంగా నిష్కామ కర్మలు నిశ్చల బుద్ధితో చేయి. ఈశ్వరుడు సంతోషిస్తాడు. నీకు సుఖం లభిస్తుంది. కొన్ని భక్తి లక్షణాలు చెప్తాను. గుర్తు పెట్టుకో, ఆచరణలో పెట్టు.

సర్వులలో సర్వేశ్వరుణ్ణి చూడటం, సర్వులను ప్రేమతో ఆదరించటం, ఏ ప్రాణినీ ద్వేషించకుండా ఉండటం, అందరితో మైత్రి కలిగి ఉండటం, సత్యం పలకటం ఈ మొదలైనవి మంచివి. ఇక 'సత్యం' పలకాలి అన్నాను కదా యని పరులకు అహితం కలిగేలా పలకరాదోయి ! హితం కలిగేదే పలకాలి. లేదా మౌనం మహాభూషణం సుమా ! ఈలాంటి రహస్యాలు ఎరిగి వర్తించాలి. ఎవరి ధర్మం వారు పాటించటం, తల్లినీ, తండ్రినీ, గురువునీ గౌరవించటం, పాపభీతి, సంఘనీతి, దైవప్రీతి, కలిగి ఉండటం, దానం ధర్మం చేయటం, ఆర్తులను ఆదుకోవటం, ఉపకారం చేయటం, అపకారం ఎవరికీ తలపెట్టకుండటం, ఇది చాలా అవసరం. స్నేహం విచక్షణా జ్ఞానంతో చేయాలి. భార్యా పుత్ర మిత్రాదులను ప్రేమించాలి. అది పరిమితంగానే. మంచిని గ్రహించి పరులకు పంచుతుండాలి. కష్టనష్టాలలో సుఖసంతోషాలలో సమచిత్తంతో వర్తించాలి. ఇంద్రియ నిగ్రహం క్షమ అలవరచుకోవాలి. సర్వవేళలా సంతృప్తి అత్యవసరం లౌకిక వాంఛలు తగ్గించు కోవాలి.

అత్యాశలు ఎప్పుడూ పనికిరానివే ! భయం, ఉద్రేకం, కపటం హానికరాలు. శరీరం పరిశుభ్రంగా మనస్సు నిష్కల్మషంగా ఉంచాలి. సర్వమతాలు దైవ సమ్మతాలే.సర్వం సర్వేశ్వరుని కర్పించి నిస్వార్థంగా జీవనం పావనం చేసుకోవాలి.ఉపకారాలు కానీ, దైవస్మరణం కానీ ఎన్ని సార్లు చేశాను అని లెక్కపెట్టుకోరాదు. ఇంకా చేయలేక పోయానే అనుకోవాలి. నీ జీవనం గూర్చి నీవు కాదు చెప్పవలసింది. భగవంతుడు మెచ్చాలి.

శ్రేయములు మరియు భక్తిని
సేయక కేవలము బోధ సిద్ధికి తపమున్
చేయుట విఫలము పొల్లున
ఆయము సేకురెనె తలప అధికం బైనన్

— భాగవతం

# 13

విశ్వమందు విభుడు వెలుగుచునుండును
విభునియందు వెలుగు విశ్వమెపుడు
విభుడు వెలుగకున్న విశ్వంబు వెలుగదు
విశ్వవిభులమైత్రి శాశ్వతంబు

– శ్రీ సత్యసాయి

శ్రీ కృష్ణ పరమాత్మా ! చాలా భక్తి జ్ఞాన విషయాలు చెప్పారు. హృదయం వికసింప చేశారు. ప్రకృతి - పురుషుడు, జ్ఞానం - జ్ఞేయం, క్షేత్రం- క్షేత్రజ్ఞుడు వీటిని గూర్చి నాకు ఇంకా బాగా వివరించండి. అనేక అభివాదాలు. అని అర్జునుడు వివేకంతో వినయంగా అర్థించాడు. అపుడు భగవంతుడైన శ్రీకృష్ణస్వామి ఈ విధంగా బోధించసాగాడు –

పాండవా ! మంచి ప్రశ్నవేశావు. ఇది తత్త్వం. విద్య అంటే అసలు ఆత్మజ్ఞానమే విద్య. మిగిలినవన్నీ అవిద్యలే. విద్య ఈ శరీర సంబంధమైంది కాదు. వేరుగా వెలుగుతుంటుంది. అవిద్యలు ఈ స్థూల సూక్ష్మ శరీరాల లోనే ఉంటాయి. అవి శరీర సంబంధాలు అనాత్మలు.

ప్రకృతి – పురుషుడు :

ప్రకృతి అంటే ఈ జగత్తు. ఇందులోని రూపవికారాలు జీవరాశులు చరాచరాలు సుఖదుఃఖాలు గుణాలు పరిణామాలు ఈ మొదలైనవన్నీ ప్రకృతి జనితాలు. ప్రకృతి స్త్రీ స్వభావం. ప్రకృతి ఒక మాయ. మారిపోవుట దాని నైజం. దృశ్యం చూపుట క్షణాలలోనే విభ్రమం కల్గించుట వినోదాలు విలాసాలు విలాపాలు ప్రలాపాలు విలయాలు చూపుట ప్రకృతి స్వభావం.

పురుషుడంటే ఒక్క పురుషోత్తముడే. ప్రకృతికి అధిపతి. మాయాపతి. ప్రకృతి గుణాలకు సాక్షీభూతుడు. దేవుడు అంటే అన్నింటికీ మూల కారణమైన మహనీయుడు.

ఈ ప్రకృతి పురుషుల సమ్మేళనమే ఈ జగత్తు. వీరిద్వారానే జగన్నిర్మాణం జరుగుతూఉంది. ఈ జగత్తులో కొందరు జీవులు సహజంగా సామాన్యంగా జనించి దైవానుగ్రహం వలన ధ్యాన జప తపాదులు చేసి ఈశ్వర సాన్నిధ్యం పొందుతారు. భక్తి యోగం అనుసరించి నిష్కాములై పరమపదం పొంది పరమేశ్వరునిలో జేరిపోతారు.

ప్రకృతి పురుషులు జగత్తుకు తల్లిదండ్రులు. పార్వతీ పరమేశ్వరులు. శబ్దం అర్థం వలె వీరు విడదీయరాని అనుబంధం కలిగినవారు.

జ్ఞానం - జ్ఞేయం :

జ్ఞానం అంటే బుద్ధిని ఉపయోగించి విచక్షణతో మంచిని నిగ్గు దేల్చే పరిశ్రమ ఫలం. ఈ రంగంలో పెద్దలు గురువులు మిత్రులు మిక్కిలి ఉపయోగకారులు. సాహిత్యాలు శాస్త్రాగమాలు పురాణాలు యోగాలు ధ్యానాలు అనేకం జ్ఞానానికి సహాయం చేస్తాయి. అయితే చివరకు జ్ఞానం అంటే ఆధ్యాత్మిక జ్ఞానమే జ్ఞానం అన్నారు వేదాంతులు. వేదాంతం గురించి వేదాలు అనేక విషయాలు వివరించాయి. వేదాల చివరి భాగాన ఆత్మజ్ఞానం అప్రమేయుడైన ఆది దైవాన్ని గూర్చి వివరించాయి. ఆ యీశ్వర తత్త్వమే వేదాంతం. అట్టి వేదాంతం జీర్ణించుకొన్నవారే వేదాంతులు. అట్టి వేదాంతుల లక్ష్య సిద్ధినే జ్ఞేయం అంటారు.

ఎన్ని తెలుసుకొన్నా మానవుడు నిజంగా తెలుసుకో తగింది ఈశ్వర తత్త్వం. దీనినే జ్ఞేయం అన్నారు. ఈ తత్త్వం వల్ల తెలిసేది పరమేశ్వరుడు. అది ఆది మధ్యాంత రహితం. అది సద్ విచారం. అసద్విచారణకు అందనిది. జ్ఞేయమైన ఈశ్వర తత్త్వమే అన్నిటికీ ఆదికారణం. అది అద్వైతం. అది విషయ బుద్ధులకు అతిదూరం. శుద్ధులైన మహనీయులకు అతి సన్నిహితం. అది అజ్ఞానం అంటని ఆత్మజ్యోతి. ప్రకాశం. బుద్ధికి అందేది జ్ఞానం. అందనిది చరమ లక్ష్యమైనది జ్ఞేయం.

క్షేత్రం - క్షేత్రజ్ఞుడు:

క్షేత్రం అంటే దేహం. క్షేత్రజ్ఞుడు అంటే దేహం విషయాలు అన్ని తెలిసి దేహంలో నివాసం ఉండే వాడు. జీవుడైన దేవుడు. సర్వం తెలిసినవాడు నిత్యుడు.

అతడు దేహి కొంతకాలం వరకు మాత్రం, తదుపరి విదేహి. ఇతడు క్షేత్రజ్ఞుడు. క్షేత్రం ఈ జగత్తు అనే సారభూతమైన పొలం. అన్నింటికీ ఆధారకారణం అహం. అంటే నేను. ఇది జ్ఞానానికి కేంద్ర బిందువు. ఈ నేను మనస్సూ, బుద్ధీ, చిత్తం, చైతన్యం, నేత్ర శ్రోత్రాది జ్ఞానేంద్రియాలు అయిదూ కరచరణాది కర్మేంద్రియాలు అయిదూ. భూమి, జలం, అగ్ని, వాయువూ, ఆకాశం ఈ మొదలైనవన్నీ కలిసింది క్షేత్రం.

క్షేత్రజ్ఞుడు క్షేత్రం బాగుచేసుకొంటూ జ్ఞానఫలం పండించు కొంటుండేవాడు. అతనికి అనేకమైన విశిష్టమైన లక్షణాలున్నాయి. అందులో ముఖ్యమైనవి కొన్ని- అభిమానం గర్వం ప్రదర్శింపకుండటం, పరోపకారం చేయటం, పరులను హింసింప కుండటం, ఓర్పుగా ఉండటం, సరళ స్వభావం కలిగియుండటం, గురువులను సేవించటం, తల్లి దండ్రులను పూజించటం, పెద్దలను గౌరవించడం, నిష్కపటమైన మనస్సు కల్గియుండటం, పరిశుభ్రత గల శరీరంతో యుండటం, ఇంద్రియ నిగ్రహం కల్గి యుండటం, భోగ విరక్తి, దైవకార్య అనురక్తి, భార్యా పుత్రాదులపై మమతారాహిత్యం, శుభాశుభాలకు చలించని స్థైర్యం, భయక్రోధ కామాదుల నెదుర్కొనే ధైర్యం, ఈశ్వర ఏకాంత సేవనం, సర్వజన శ్రేయః కాంక్ష ఈ మొదలైనవి.

కర్మ-కర్త, జ్ఞానం-జ్ఞేయం, మాయ-బ్రహ్మం, క్షేత్రం-క్షేత్రజ్ఞుడు, దేహం-దేహి, విశ్వం-ఈశ్వరుడు, కార్యం-కారణం, ఆత్మ-అనాత్మ, సృష్టి- దైవం, ధ్యానం-ధ్యేయం, కార్యం-కర్త, మిథ్య-సత్యం, అహంకారం- నిరహంకారం, అవిద్య-విద్య. ఈ విధంగా మానవ మాధవ సంబంధాలున్నాయి. ఈ జ్ఞానం తెలిసిన ఆత్మజ్ఞానం పొంది ఈశ్వరునిలో తాదాత్మ్యం చెందుతాడు.

## 14

తామసంబు విడక తత్త్వంబు కనరాదు
రాజసంబు విడక రాదు ముక్తి
సాత్త్వికంబె భక్తి సాధనంబగునయా !
ఉన్నమాట తెలుపుచున్న మాట

– శ్రీ సత్యసాయిబాబా

అర్జునుడు గుణత్రయం గూర్చి కృష్ణదేవుణ్ణి సంప్రశ్న చేశాడు. శ్రీకృష్ణ భగవానుడు మూడు గుణాలను గూర్చి ఈ విధంగా వివరించి చెప్పసాగాడు- అర్జునా ! నీకు నీవడిగిన గుణస్వభావాలు ప్రభావాలు గూర్చి చెప్తాను, శ్రద్ధగా విని విన్నదానిని మననం చేసుకొని ఆచరణలో బెట్టి ఆనందం అనుభవించు. శ్రద్ధ లేక వినటం వలన ప్రయోజనం లేదు. విన్న దానిని బాగా అర్థం చేసుకొని ఆచరణలో పెట్టకపోయినా ఫలితం శూన్యం. కనుక త్రికరణ శుద్ధిగా తత్త్వం తెలుసుకో.

ఈ గుణత్రయ తత్త్వం తెలిసినవాడు మానవులలో యోగులలో భక్తులలో ఉత్తమోత్తముడై ప్రకాశిస్తాడు. ఈశ్వర ప్రీతికి పాత్రుడవుతాడు. ఈ ప్రకృతి త్రిగుణాత్మకం. అంటే ఈ జగత్తులో సత్త్వ రజస్తమోగుణాలు వ్యాపించి యున్నాయి. అన్ని జీవులలో ఈగుణాలు ఎక్కువ తక్కువ ప్రమాణాలలో ఉన్నాయి. అన్ని జీవులలో జ్ఞానంగలవాడు మానవుడు కనుక ఈ గుణ పరిణామాలు గుణ ఫలితాలు గూర్చి ఆలోచనచేసి మంచి గుణాలను అభ్యాసం చేసుకొంటాడు. బాగుపడతాడు.

ఈ ప్రకృతితో కూడిన జగత్తు నాకు పత్నివంటిది. నేను త్రండిని. ఇందులో సృష్టికి కావలసిన అన్ని రకాల బీజాలను ఉంచుతాను. సర్వ ప్రపంచాలు ఈ ప్రకృతి నుండి ఆవిర్భవిస్తుంటాయి.

సర్వదేవమానవ పశుపక్ష్యాదులకు ప్రకృతి జనని. ఈశ్వరుడనైన నేను జనకుడను. ఈ ప్రకృతికి సత్త్వరజస్తమో గుణాలు మూడున్నాయి. ఇవి ఆత్మగుణాలు కావు. ఆత్మను కప్పి ఉంచుతాయి.

సత్త్వగుణం - ఇది శాంత స్వభావం గలది. నిర్మలమైనది. ప్రకాశవంతమైనది. జ్ఞానంతో సంచరిస్తుంది. ఆత్మకు మిక్కిలి దగ్గరగా ఉంటుంది. ఉపేక్ష వహించి భగదన్వేషణ సాగిస్తుంది. సుఖంకూరుస్తుంది.

రజోగుణం - ఇది అపేక్ష గలది. ఆకాంక్షలధికం. ఉత్సాహం ఉద్రేకం ప్రయత్నం దీని స్వభావాలు. పనిచేస్తుంది. ఫలాఫలాలు పొందిసుఖాలు దుఃఖాలు అనుభవిస్తూంటుంది. కర్మలు చేయిస్తుంది.ప్రేరణ కల్గిస్తుంది.

తమోగుణం - ఇది మోహం కలిగి ఉంటుంది. దీనికి మదం అధికం. అజ్ఞానంతో విర్రవీగుతుంటుంది. విచక్షణ అసలు ఉండనే ఉండదు. స్వార్థం, భోగం దీని లక్షణం.ఇది జ్ఞానాన్ని మరిపిస్తుంది.

అర్జునా ! శ్రవణ పఠన మననాదుల ద్వారా జ్ఞానానుభవం పొంది మనశ్శాంతినంది ఆనందంగా జీవించటం సత్త్వగుణ వంతుని లక్షణాలు. భోగసామగ్రిని ఆర్జించటం ధనం లోభంతో కూడబెట్టడం ప్రవృత్తి లక్షణం. ఒక పని కాగానే మరోపని చేయ తలంచటం కీర్తి గడించాలను కోవటం అశాంతికి సోపానాలు. ఈ రకమైన లోభం ప్రవృత్తి అశాంతి మొదలైనవి రజో గుణవంతుని లక్షణాలు.

కామం, ధనదాహం, కలహం, అహంకారం ఈర్ష్య అసూయ ద్వేషం, క్రోధం, అవివేకం ఈ మొదలైనవి తమోగుణం గల వాని లక్షణాలు.

సత్త్వగుణవంతుడు తనువు చాలించి బ్రహ్మలోకం పొందుతాడు. రజోగుణవంతుడు మరో జన్మలో మానవలోకంలో స్థానం పొందుతాడు. తమోగుణవంతుడు పశు పక్ష్యాదులలో జన్మిస్తాడు.

సాత్త్వికం వలన జ్ఞానం, రాజసం వలన దంభం, తమోగుణం వలన మూఢత్వం ప్రాప్తిస్తాయి. కాబట్టి మానవుడు వివేకం కలిగి గుణాలకు కారణం కర్మలని, కర్మలకు కారణం ఆత్మజ్ఞాన లోపం అని గుర్తించి సత్ప్రవర్తనతో వర్తించిన వాడు అద్వైత ఆనందం పొంది దైవసాన్నిధ్యం జేరి సుఖిస్తాడు.

అర్జునా ! గుణాతీత పురుషుడి లక్షణాలిలా ఉంటాయి. సాత్త్వికం వలన జ్ఞాన ప్రకాశం రాజసం వలన కార్యతత్పరత, తామసం వలన మద మాత్సర్యం, స్వాభావికంగానే జనిస్తాయి. అయినప్పటికి గుణాతీత పురుషుడు అభ్యాసం వలన ఈ గుణాలను జయించి ఉదారంగా హుందాగా ఉన్నతాదర్శంతో ప్రవర్తిస్తాడు. ఈ గుణాలకు కార్యాలకు దుఃఖం ప్రాప్తిస్తుందనీ, సుఖం ప్రాప్తిస్తుందనీ ద్వేషింపదు,

సంతోషింపడు. వీటిని పట్టించుకోడు. ఉదాసీనంగా ప్రవర్తిస్తాడు. ఆ మహా పురుషుడు జగల్లీల అని ఔదాసీన్యంబూని సాక్షీ భూతుడుగా చూస్తుంటాడు. అతనికి సుఖదుఃఖాలు పట్టవు. దేనికీ అతడి మనస్సు చలింపదు. సర్వం సర్వేశ్వర ప్రీత్యర్థం చేస్తుంటాడు. ఇట్టి గుణాతీత పురుషుడికి రాళ్ళైనా, రత్నాలైనా, బంగారమైనా, మట్టియైనా, సుఖమైనా, దుఃఖమైనా సమానంగా భావించి హర్షశోకం వహించడు. సర్వం ఈశ్వర ప్రసాదంగా స్వీకరిస్తాడు. సదా ఆనందంలో ఉంటాడు. దేనిపైనా ప్రేమలేదు, ద్వేషంలేదు. అతడికి అన్నీ సమానమే. అన్నిటికీ ఆనందమే. అన్నిటికీ మంచిది-మంచిది అని పలకటమే స్థిత ప్రజ్ఞావంతుడైన గుణాతీత పురుషలక్షణం.

అర్జునా ! నేను అవ్యయాన్ని సచ్చిదానందాన్ని, సనాతనాన్ని, సర్వేశ్వరుణ్ణి- సర్వగుణాతీతుణ్ణి అని నన్ను తలంచి జీవనం పావనం చేసుకొనే వాడు త్రిగుణాతీతుడై రాణిస్తాడు. ఇవి త్రిగుణాతీత లక్షణాలు.

అనుపమ పాపకర్మ పరిహారముకై
భజనీయుడైన శో
భన చరితుండితండనుచు
భావమునన్ దలపోసి భక్తిచే
అనితర యోగ్యతన్ భగవదర్పణ
బుద్ధినొనర్చి కర్మముల్
జనహితకారియై నెగడ
సాత్త్విక యోగమనంగ జొప్పడున్

- భాగవతం

# 15

నేనుంటిన్ రథమున్ గదల్చుటకు - సంధింతున్ సమస్తమ్మునే
నే - నీవుండు నిమిత్తమాత్రముగ-సందేహమ్ము పో నాడి నా
పైనర్పింపుము భారమంతయును - గెల్వంబోదధర్మంబు - మం
దేనోయీ ! విజయమ్ము-ముద్దుల మరందీ ! నమ్ము మమ్మాటికిన్ !!

-కరుణశ్రీ

శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుడి ప్రశ్నలకు ఈ విధంగా సంసార తత్త్వం వివరిస్తున్నాడు.

ధనంజయా ! ఈ సంసారం ఒక వృక్షం అనుకో. వృక్షాలలో ఇది అశ్వత్థ వృక్షంతో చక్కగా పోల్చబడినది. దీనికి చలదళవృక్షం అని పేరు కూడా ఉంది. ఇతర చెట్ల ఆకుల కంటె ఈ చెట్టు ఆకులు ఎల్లవేళలలోనూ చలిస్తుంటాయి. అంటే ఈ సంసారం చలనమైనది. అనిత్యమైనది. దీని పూవులు ఫలాలు పనికిరానివి. ఇది నిష్ఫలవృక్షం అని కూడా పేరు గలది. ఇది విచిత్రమైనది సుమా ! ఒక విశిష్టమైన ప్రబోధం కూడా చేస్తుంది. తపస్సిద్ధి కల్గిస్తుంది.

ఈ సంసార వృక్షానికి పాదు ఆకాశంలో ఉంది. ఈ వృక్షం అన్నిచెట్లవలె పైకి పెరగదు. ఇది క్రిందికి పాకుతూ వ్యాపించింది. ఇది మనుష్యలోకంలో మానుకట్టింది. ఇది మిన్నులో పుట్టి మన్నులో విస్తరిస్తోంది. మిన్నులో దీనిమూలం ఉంది. మిన్ను బ్రహ్మపదం. బ్రహ్మ జ్ఞానానికిది ప్రతీక. మన్ను మానవతకు మచ్చుతునక. ఈవృక్షశాఖలు హిరణ్య గర్భాదిదేవులు. ఈ తరువు పత్రాలు

వేదాలు. ఇతిహాసాలు పురాణాలు. ఈ వృక్షం ఎప్పుడు జనించిందో ఎవరూ చెప్పలేరు. దీనిని 'అనాది వృక్షం' 'సనాతన వృక్షం', 'పురాతన వృక్షం' అని వేదవేత్తలు పేర్కొన్నారు. బ్రహ్మజ్ఞాన నిధులే ఈ వృక్షం గూర్చి చెప్పలేక పోయారు. అందులో కొందరు మాత్రం ఇలా ఊహించారు.

ఇది బాహ్యంగా జీవన ప్రపంచ బంధాన్నీ, ఆంతరంగికంగా ఈశ్వర ప్రపంచ మోక్షాదుల్నీ తెలియచేస్తుంది. హిరణ్య గర్భుడైన బ్రహ్మ నుండి వచ్చిన జీవులే దీని శాఖోపశాఖల అంకురాలు. ఇవి త్రిగుణాల బలంతో నాల్గు వైపులకు వ్యాపించాయి. ఈ కొమ్మల చివళ్ళ అవే విషయ వాసనలు. ఇది చాలా మొండి చెట్టు అని ప్రసిద్ధి. దీని వేళ్ళు ఆకాశం అంటే దేవాలయం గోపురాల గోడలలో దూరి గోపురాలను బలహీన పరుస్తుంటాయి. దీనిని వ్రేళ్ళతో సహా కొట్టేయాలని నరులు విఫలమయ్యారు. దీనిని నరికి వేయాలంటే వైరాగ్యం అనే గట్టి పదునైన గొడ్డలి కావాలి. ఆ గొడ్డలిని బలంగా ఉపయోగించే ధీబలం భక్తి బలం కావాలి. అట్టి సుధీ ప్రజ్ఞావంతులకే ఇది లొంగుతుంది.

అట్టి ఈ సంసార కీకారణ్యంలో పడి తప్పి పోకుండా దారి బాగుచేసుకొంటూ పరమపదం చేరుకోగల్గుతారు. అటువంటి బాటసారులకు నేనే శరణ్యం. నన్ను వేడుకొన్న వారికి మార్గం సుగమం అవుతుంది. పురుషోత్తమ ప్రాప్తి లభిస్తుంది. ఇటువంటి ప్రయాణీకులకు కొన్ని సూచనలు చేశాను. విను-

ఈ ప్రయాణంలో లౌకికమైన కోరికలు అనే బరువు మూటలు తీసుకొని రాకూడదు. తక్కువ లగేజీ ఎక్కువ సౌఖ్యంగా ఉంటుంది. కనుక చిన్న సంచీతో ప్రయాణం ఆనందంగా సునాయాసంగా చేయాలి.

శాస్త్రజ్ఞానం అనుభవం గలవారే సహయాత్రీకులుగా ఉండాలి. పురుషోత్తముడే వారికి మార్గదర్శి. ఆయనే వారికి గురువు. నరులలో ఉత్తమ గుణ స్వభావం గలవారే గురువుకు తగిన శిష్యులు. ఈ ప్రయాణీకుల లోపల జేబులలో ఎవరికీ తెలియకుండా అహంకారం అసూయ మర్మం అనే రూపాయలు ఉంటాయి. అవి దాచుకొన్నంత వరకు వారి ప్రయాణం సుఖంగా సాగదు. సాధనలో నిష్కల్మషం, వైరాగ్యం అనే మణులున్నవారు ప్రకాశిస్తూ ముందుకు సాగుతారు.

ఈ ప్రయాణంలో సుఖదుఃఖాలు కష్ట నష్టాలు శీతోష్ణాలు అనేక ద్వంద్వ పవనాలు ఎక్కువగా వీస్తుంటాయి. వాటికి చలించరాదు. మనస్సు నిబ్బరంగా బుద్ధి తీక్షణంగా ఆత్మ పరిశుద్ధంగా కాంక్ష దృఢమైన ఇంద్రియా తీతమై ఉండాలి. ఈశ్వర ప్రాప్తి లక్ష్యం నిశ్చయంగా ఉండాలి.

ఈ సంసార లంపటంలో పడిన వారు మాయాజాలంలో చుట్టుకొని పోతారు. విజ్ఞులెందరో ఈ ప్రయాణంలో వట్టి అజ్ఞులై ఆచరణలో

మూర్ఖులౌతుంటారు. వీరినే పండిత మూర్ఖులంటారు. 'ఘన కార్యాలు నేను చేస్తున్నాను. ఎందరికో మేలు చేశాను' అనే గర్వం వారి మనస్సులో వారికి తెలియకుండానే జేరి వారిని డొల్ల జేస్తుంది. అట్టివారే మరల మరల సంసారంలో జనిస్తుంటారు. నీవు ఒక సంగతి చూడు-

భూమి పంచభూతాలలో ఎక్కువ బరువుగలది. ఈ భూమి కంటె జలం తేలిక. జలంకంటె అగ్ని తేలిక. అగ్నికంటె వాయువు మరీ తేలిక. వాయువు కంటె మిక్కిలి తేలిక ఆకాశం. అంటే పంచ భూతాలలో ఒకదానికంటె మరొకటి తేలిక. సూక్ష్మమైన కొలదీ సువిశాలం విలక్షణం వ్యక్తమవుతుంది.

ఆ విధంగా చూచినపుడు ఆకాశం అతిసూక్ష్మం అతి వ్యాపకం గలదిగా తోస్తుంది. ఇట్టి ఆకాశం వంటిది ఆత్మ. ఆకాశంలో అనేక కోట్ల నక్షత్రాలు జీవులు, పక్షులు యంత్రాలు విమానాలు తిరుగుతున్నాయి. కానీ వాటి జాడలు మరకలు వగైరాలు ఆకాశానికి అంటవు, కనిపించవు.

అట్లే ఆత్మలో ఇంద్రియాలు త్రిగుణాలు తిరుగుతుంటాయి. కానీ వాటి ప్రభావాలు ఆత్మకు అంటవు. కనుక ఆత్మ ఆకాశంవలె నిష్కళంకం నిర్గుణం నిరంజనం. అట్టి ఆత్మను నేను. పరమాత్మ తత్త్వం నాది.

నేను సచ్చిదానందమూర్తిని, సత్ శాశ్వతమైనది. చిత్ మహాశక్తి ప్రదమైనది. ఆనందం నిత్యనిర్మల స్థితి. దీనినే భాతి శక్తిదం ప్రియం సుఖాపేక్ష ఇది ప్రియం. అని వేదాంత పరిభాష. ఇది నా శుద్ధ స్వరూపం. దీని దర్శనం పొందినవాడు జన్మరహితుడై పరమపదం పొంది ఆనందంలో సుస్థిరంగా ప్రకాశిస్తుంటాడు. జ్ఞాని నన్ను చూచి ఇలా అర్థం చేసుకొని పరమసుఖం పొందుతాడు. అజ్ఞాని చూచికూడ కళ్ళు మూసుకుపోయి నన్ను సామాన్యుడుగా భావిస్తుంటాడు.

నేను జనులను బాగుచేయాలనే ఎన్నో వసతులు సూచనలు సుఖసంతోషాలు, సుబోధలు కల్పిస్తుంటాను. కానీ చెప్పుకోను. తెలియటం కోసం నీబోటి వారితో అన్నాను. ఇపుడు అంటున్నాను. ఇతరులు వినికూడా గ్రహించే స్థితిలో లేరు. నేను సూర్య చంద్ర అగ్నులలో జేరి లోకాలకు కాంతులు ప్రసారం చేస్తున్నాను.

భూమి పొరలలో జేరి ద్రవాలు ఖనిజాలు వజ్రాలు వైడూర్యాలు మణులూ బంగారం పంటలూ ఫలాలు ఓషధులూ ఉత్పత్తి చేస్తున్నాను. జీవులలో జేరి అన్న ఆహారాన్ని జీర్ణం చేసి బలం బుద్ధి అందిస్తున్నాను. శరీరాలు నడిపేది నేనే. ప్రజలు నా బిడ్డలు. ప్రజా హృదయాలే నాకు నివాసస్థానాలు. వారికి ప్రాణశక్తీ స్మృతి మతి గతి విచక్షణా బుద్ధిసూక్ష్మత ఇచ్చేది నేనే.దుఃఖాలు

మరపించి సుఖాలు కలిగించేది నేనే. నేనుంటే వాడు శివం. నేను తప్పుకుంటే వాడు శవం.

క్షరుడు జీవుడు. అక్షరుడు దేవుడు. జీవుడు వినాశశీలుడు. దేవుడు అవినాశ శీలుడు. ఈ ఇరువురికంటె అతీతుడు పురుషోత్తముడు. దేవాదులు అందరునూ పురుషులు. నేను పురుషోత్తముడను. ఇది గుర్తు పెట్టుకొని వర్తించు. నా తత్త్వ ప్రకటనమే పురుషోత్తమ యోగం. ఈ యోగం ఎరిగిన వాడు పురుషోత్తమ ప్రాప్తి పొందుతాడు.

చావు పుట్టుకలేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంత రహితుడనాదివాడు
అంతటను సర్వ సాక్షియై అలరు ఆత్మ
ఆత్మయే బ్రహ్మ - బ్రహ్మయే ఆత్మయగును

- శ్రీ సత్యసాయి

## 16

" మనసు - మాట - నడక మనిషికి ఒకటైన
మనిషి కాదు వాడు మహితు డవని
మనిషి - మాట - నడక మరివేరు వేరైన
మనిషికాడు వాడు మద మృంగబె"

- శ్రీ సత్యసాయి

అర్జునుడు ఇలా వినయంగా అర్థించాడు. అచ్యుతా ! అనంతా ! అప్రమేయా ! అఖండ జ్ఞాన ఖనీ ! నమస్కారం. నాకు దైవీ సంపదలు, ఆసురీ సంపదలు విడదీసి కొంచెం విశదపరచకోరుతున్నాను.

అర్జునుడి అతి సౌమ్యతను ఆసక్తినీ పరికించి సంతోషించి శ్రీ కృష్ణ భగవానుడు ఇలా వివరించసాగాడు-

పార్థా ! ఈ లోకంలో సంపదలు అనేక విధాలున్నాయి. ఈ సంపదలు రెండు విభాగాలు చేయవచ్చు. ఒకటి దైవీ సంపదలు. రెండు ఆసురీ సంపదలు. మొదటి రకం మనిషికి మేలు చేస్తాయి. రెండవ రకం కీడు చేస్తాయి.

దైవీ సంపదలు సుగుణాల వలన వృద్ధి పొందుతాయి. కనుక జనులు సుజనులై సుగుణాలు అలవరచుకోవాలి. దాని వలన జన్మచరితార్థత చెందుతుంది. సుగుణాలు అనేకం ఉన్నాయి. కొన్ని ముఖ్యమైనవి ఆలించటం చాలదు. ఆచరణలో పెట్టి అనుభవం ద్వారా ఆనందం పొందు.

వినయం - వివేకం - నిర్భయం - నిశ్చయ జ్ఞాన సముపార్జనం, అజ్ఞాన అరిషడ్వర్గ విసర్జనం, దానం - ధర్మం - శమం - దమం - జపం - తపం సద్భావం - సత్ప్రవర్తనం - సత్యపాలనం - విచక్షణ త్యాగం - అహింసా పాలనం - అద్వైతభావం - దైవభక్తి - సత్కార్యానురక్తి ఈ మొదలైన గుణాలు కలిగి ఉండాలి.

మరి కొన్ని కోపం చెందరాదు. పరుల దోషాలు లెక్కించరాదు. పరదూషణ వినరాదు, చేయరాదు. విషయ భోగాలు పనికిరావు. పరిమిత అవసరాలు అనుభవించవచ్చు తప్పులేదు.

సత్యం పలకవలెనని పరులకు హాని కలిగే విధంగా పలుకరాదు. అట్టి పరిస్థితి వచ్చినపుడు విచక్షణతో ప్రవర్తించటం మంచిది. మౌనం వహించటం మరీ మంచిది. పరిమితంగా మృదు మధుర భాషణ చేయాలి. పరహితం కలిగే స్థితిలో జాగ్రత్తగా ఆలోచించి అబద్ధమైనా పలుకవచ్చు. సరునిలో పరమేశ్వరుణ్ణి చూడాలి. ప్రశంసలకు పొంగరాదు. నిందలకు క్రుంగరాదు. జీవకారుణ్యం కలిగి ఉండాలి. కుశాగ్రబుద్ధి, మనశ్శుద్ధి, సత్సంగం సదాలోచన చాలా అవసరం. దైవప్రీతి పాపభీతి సంఘనీతి మనిషికి అత్యవసరం. ఈ మొదలైన సుగుణాలు దైవీ సంపదను అభివృద్ధి చేసి మానవుడికి మంచి గతులు కలిగిస్తాయి.

ఆసురీ గుణాలు తనకూ పరులకూ హాని చేస్తాయి. స్వార్ధం దురాశ లోభం కపటం అసత్యం, దంభం, గర్వం, మదం, హింస, దూషణ అవినయం, ఆత్మప్రశంస, అధర్మం, దుర్జన స్నేహం, కామం, భోగలాలస చౌర్యం, జూదం, క్రూరత్వం, అహంకారం, అపకారం, అక్రమం, అన్యాయం, క్షుద్రదేవతారాధన, మూఢత్వం. ఈ మొదలైనవి రాక్షస గుణాలు.

ఈ గుణాలు గలవారు పరుల మేలు చూచి అసూయ పడతారు. నిష్కారణంగా కలహమాడతారు. దేవకార్యాలు పరోపకారాలు చేయరు. కపటంగా ప్రవర్తించి లాభం పొందాలని చూస్తారు. పరులను హింసించి ఆనందిస్తారు. పరుల బాధలు కష్టాలు నష్టాలు వారికి సంతోషం కలిగిస్తుంటాయి. సంఘనీతిని ధ్వంసం చేస్తారు. అక్రమ అన్యాయ సంపాదనలకు దిగి తృప్తి పడుతుంటారు. కామం అన్ని పాపాలకు మూలం.

ఈ గుణాలు అసురసంపదను వృద్ధి చేస్తాయి. వాడి పతనానికి వాడే కారణమవుతాడు. వాడు తీసుకొన్న గోతిలో వాడేపడి దుఃఖపడతాడు.

ఈ ఆసురీగుణాలు పోగొట్టుకోవాలంటే కోరికలు తగ్గించుకోవాలి. క్షమ కలిగి ఉండాలి. సజ్జన స్నేహం చేయాలి. దేహాత్మ బుద్ధికాక బ్రహ్మాత్మ బుద్ధిని అలవరచుకోవాలి. వారికి విశ్వం విష్ణుమయంగా భాసిస్తుంది. అపుడు అతడు సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థం చేస్తుంటాడు.

కౌంతేయ ! అప్రాప్తమైనది ప్రాప్తించటం యోగం. ఆ ప్రాప్తించిన దానిని శీల సంపదతో కాపాడుకొనే సాధనా ఫలం క్షేమం. ఇవే యోగక్షేమాలు. ఈ రెండిటినీ నేనే ప్రసాదిస్తుంటాను. మానవ కల్యాణ కరాలైన దైవీ సంపదలు పొందినవాడు మనశ్శాంతి మహానందం పొందుతాడు.

ఆసురీగుణాలు పెంచుకొన్నవాడు నవ్వుతూ అకృత్యాలు చేసి అంత్యకాలంలో ఏడుస్తూ అనుభవిస్తాడు. పార్థా ! ధర్మ నిర్ణయ సమయంలో స్వతంత్ర నిర్ణయాల కంటె వేదజ్ఞులు ధర్మజ్ఞులు సహృదయ గురుమిత్ర వర్యుల నిర్ణయాలు మంచి పని చేస్తాయి. కర్తవ్య ధర్మం ఆచరించు. విచక్షణతో సత్యం పలుకు. పెద్దలను అనుసరించు. కర్తవ్యం పాలించు. ఇపుడు నేను చెప్పినవి మహర్షులు మహా విజ్ఞానులు సంఘ శ్రేయస్సుకై పూర్వం నుంచి చెప్పుతూ వస్తున్నవే. ఇవి కల్పితాలు అనుకోరాదు. విధి నిషేధాలు గ్రహించి నీ కర్తవ్య ధర్మం చిత్తశుద్ధితో నిష్కామంగా చేయి. నీకు జయం కలుగుతుంది.

కర్తన్ నేను సమస్త భూతములకున్ కౌంతేయ ! సర్వమ్ములో
వర్తింతున్ అవతార ధర్మమును నిర్వర్తింతు – భూభారమున్
దీర్తున్ నీవు నిమిత్త మాత్రమగు మంతే – క్లైబ్యమింకేల ! నీ
కర్తవ్యంబును గుర్తెరింగి విజయా ! గైకొమ్ము గాండీవమున్ !!

– కరుణశ్రీ

17

సత్త్వ గుణము గొప్ప స్వర్గంబు సృష్టించు
సత్త్వ మందు నణగు సర్వసృష్టి
సత్త్వ మహిమలేని స్థలమన్నదే లేదు
శుద్ధ సత్త్వ మహిమ చూడవలయు

– శ్రీ సత్యసాయి

వేదవేద్యా ! విశ్వపాలకా ! మన ప్రాచీన ఆచారాలను పాటిస్తూ దేవతలను పూజించే వారి మనఃప్రవృత్తి సాత్త్వికమా! రాజసమా ! తామసమా ! స్పష్టంగా చెప్పండి. సందేహాలతో మనస్సు వ్యథ చెందుతోంది. అని అర్జునుడు కృష్ణ పరమాత్మను ప్రాధేయ పూర్వకంగా ప్రార్థించాడు.

పార్థుడి మనోవ్యథ గ్రహించి భక్త వత్సలుడు 'అయితే చెప్తా విను' అని ఈ విధంగా వివరించసాగాడు–

అర్జునా ! అన్నిటికీ శ్రద్ధ ఉండాలోయ్. నీకు నీపై ఉండే శ్రద్ధను ఆత్మ విశ్వాసం అంటారు. పరమాత్మపై విశ్వాసాన్ని భక్తి అంటారు. ఈ శ్రద్ధ అన్ని సుగుణమణులను భద్రపరచే ఇనుప పెట్టె అనుకో.

శ్రద్ధ అంటే ప్రగాఢమైన భక్తీ విశ్వాసం. అదే నమ్మకం లేక పట్టుదలతో కూడిన మనోనిశ్చయం. వ్యక్తి చేసే పనిలో అతని శ్రద్ధ వ్యక్తమవుతూంటుంది. ఈ శ్రద్ధ కూడా వ్యక్తుల మనోభావాల ననుసరించి సాత్విక, రాజస తామస అనే నామాలతో మూడు రకాలుగా ఉంటుంది. ఈశ్వర విషయంలో వేద శాస్త్రవేత్తలకు ఏక విధమైన శ్రద్ధ కలుగుతూంటుంది. ఇది లోకాచారం ప్రకారం దేవధ్యాన పూజాది కాలాలలో ప్రకటితమవుతుంటుంది. దీనిని 'సాత్త్వికశ్రద్ధ' అంటారు. కొందరు రాజులు యక్షులు దానవులు చేసే దేవపూజ యజ్ఞ

యాగాదులలో కోరికలు ఆడంబరాలు ఆచారాలు ఆర్భాటాలు గోచరిస్తుంటాయి. ఈ రకమైన దానిని 'రాజస శ్రద్ధ ' అంటారు.

మరికొందరు మూఢమైన అజ్ఞానంతో కేవలం పనికి మాలిన కోరికలు సిద్ధించటం కోసం భూత ప్రేత పిశాచాలను క్షుద్ర దేవతలను కొలుస్తూ బలులు పూజలు వామాచారంగా చేస్తుంటారు. ఈ రకమైన దానిని ' తామస శ్రద్ధ ' అంటారు. ఈ మూడు రకాల శ్రద్ధలు వారి వారి పూర్వ జన్మయొక్క సంస్కారాన్ని బట్టి కలుగుతుంటాయి.

సాత్త్విక శ్రద్ధ గలవారు అద్వైత దేవదేవుణ్ణి ఆరాధించి ఆత్మజ్ఞానం పొంది ఆనందిస్తారు. రాజస శ్రద్ధగలవారు వివిధ దేవతా మూర్తులను కొలిచి అభీష్ట సిద్ధి పొందుతుంటారు. తామస శ్రద్ధ గలవారు క్షుద్రదేవతలనువామాచారం ప్రకారం కొలిచి కామం మోహం స్వార్థం కలిగి పరులను హింసిస్తూ వారు సంతసిస్తుంటారు.

అసుర స్వభావం గలవారు దంభం అహంకారం గర్వం మోహం కలిగి తమ దేహంలోని పంచ భూతాలనూ నన్నూ కూడా బాధపెడుతుంటారు. వీరు తమ మేలు గురించి కానీ పరుల మేలు గురించి కానీ ఆలోచించరు. అపకారం చేసి పరులు ఏడుస్తుంటే సంతోషించటమే వారికి అలవాటు.

ఆహారం విషయంలో కూడా ఈ స్వభావాల మనుష్యులు వేరు వేరు అలవాట్లు కలిగి ఉంటారు.

సాత్త్విక శ్రద్ధ గలవారు –

1. పాత్ర శుద్ధి చేస్తారు. ఆహారం తయారు చేసే పాత్రలు శుద్ధమైన లోహాలతో తయారై వంటకు తగిన ప్రమాణం కలిగి చిలుమూ మురికి లేకుండా పరిశుభ్రంగా వంట పదార్థాలకు తగినట్లుండాలి. ఇలా పాత్రల విషయంలో శ్రద్ధ వహించాలి.

2. వస్తుశుద్ధి చూడాలి. ఈ వంటకు లభించే బియ్యం, పప్పులు కూరలు ఇతర పదార్థాలు న్యాయార్జితమైనవా ? అన్యాయంగా అక్రమంగా లభించినవా ? ఇవి ఇచ్చేవారు వ్యాపారదృష్టితో కలుషిత భావంతో ఇచ్చినవా లేక తన దగ్గరుంటే మోసం అని ఇటు పంపినవా ? దానం చేసిన వైనచో సహృదయంతో చేసినవా ? ఏడుస్తూ చేసినవా ? ఇలా ఆలోచన చేసి అట్టి పవిత్రవస్తువులు గ్రహించాలి.

3. చిత్తశుద్ధి కలిగియుండాలి :ఆహారం పెట్టేవారు కానీ వడ్డించే వారు కానీ దానం చేసేవారు కానీ పరిశుద్ధమైన ప్రేమభావంతో చిరునవ్వుతో సంతోషంగా పెట్టాలి. వీరు పరులు కాదు పరమేశ్వర ప్రతినిధులకు పెట్టి అర్పించి

జన్మధన్యం చేసుకొంటున్నాము అనే పవిత్రమైన భావంతో చిత్తశుద్ధి కలిగి వీరు ప్రవర్తించాలి.

ఈ మొదలైన దోషాలు లేని శుద్ధమైన ఆహారం స్వీకరించటం చాలా మంచిది. ఈ దోషాలు కొంతవరకు పరిశీలించ కల్గినా అన్నీ పరిశీలించటం అసాధ్యం కనుక ఒక మంత్రం చెప్తాను. దానితో శుద్ధి చేసుకోండి-

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

అని స్మరించి ఆహారం తీసుకొంటే మనకు తెలియని దోషాలు పోయి ఆహారం పవిత్రమవుతుంది. ఇలా పరిశుద్ధం చేసిన ఆహారంలో రసవంతములూ రుచికరములూ యుంటాయి. వీని వలన ఆయుస్సు ఆరోగ్యమూ బుద్ధిబలమూ సంతోషమూ సదాలోచనలూ లభిస్తాయి.

రాజసశ్రద్ధ గలవారు పైన చెప్పిన ఆహార నియమాలు కొన్ని పాటిస్తారు. వీరు ఉద్రేకం కలిగించే చేదు కారం ఉప్పు కలిగిన పదార్థాలు ఎక్కువగా తింటారు. అందువల్ల వారు రజోగుణంతో ప్రవర్తిస్తారు. భోగాలు అనుకొని తిని రోగాలపాలవుతారు.

తామసశ్రద్ధ గలవారు పైన చెప్పిన విషయాలు పాటించరు. వీరు నిల్వఉన్నవి, పాసిపోయినవీ మత్తు పదార్థాలు నిషిద్ధ ఆహారాలు ఇష్టంగా అమితంగా తిని ఆవేశం అతినిద్ర చెంది అనర్థాలు కొని తెచ్చుకొంటారు.

ఆహారాన్ని బట్టి గుణాలు స్వభావాలు మారుతుంటాయి. సత్త్వ గుణం గలవారు లోకక్షేమంకోరి తమ గొప్పకోసం ఘనమైన కార్యకలాపాలు చేస్తుంటారు. తమోగుణం గలవారు స్వార్థం కోసం పరులను సాధించటం బాధించటం పనిగా చేస్తుంటారు.

అర్జునా ! తపస్సు మూడు విధాలు. ఒకటి శారీరికం, రెండవది వాచికం. మూడవది మానసికం. అసలు నిశ్చలమైన తపస్సు అంటే త్రిగుణాలను జయించే సాధనయే తపస్సు. దేవతలను సత్పురుషులను అనాథలను దీన నారాయణులను సేవించి వారిని తృప్తిగా సత్కరించటం, ఆనందం కలిగించటం శారీరిక తపస్సు. ఇతరులతో బాధితులతో మృదు మధురంగా హితంగా తగిన సలహాలు సూచనలు చేసి మేలు చేసే భాషణం వాచిక తపస్సు. శాంత

సౌమనస్యం సంయమనం చిత్తశుద్ధి సదాలోచన నామస్మరణం భగవదాలోచన మానసిక తపస్సు. ఆత్మతృప్తికై శారీరిక, వాచిక, మానసిక, తపస్సులు చేయటం సాత్త్విక శ్రద్ధ అంటారు. ప్రశంసలకు కీర్తికి ఫల ప్రాప్తికై ఈ త్రివిధ తపస్సులు చేయటం రాజస శ్రద్ధ. దురాలోచనతో ఇతరుల హాని కలిగించే ఈ మూడు విధాల పనులలో పాల్గొనుట తామస శ్రద్ధ సుమా !

దానాలు కూడా మూడు విధాలు :

ప్రత్యుపకార ఆశ పెట్టుకోక ఈశ్వర ప్రీతిగా చేసే దానం సాత్త్విక దానం. ప్రత్యుపకార ఆశతో చేసేది రాజస దానం. ఇతరులను సాధించటం అపకారం తలంచి చేసేదానం తామసిక దానం.

ఓం-తత్-సత్- అనేవి బ్రహ్మకు మూడు పేరులు. బ్రహ్మజ్ఞానం గల యతీశ్వరులు, మహర్షులు, మహాత్ములు శుభ ఆశీస్సులకై ఈనామాలు ఉచ్చరిస్తారు. యజ్ఞ క్రతువులలో దాన ధర్మాది కార్యాలలో తపోవిధానాలలో ఓంతత్సత్ అని మహత్త్వభావాన్ని భావిస్తారు. ఈ త్రిపుటి మిక్కిలి విలువ గలది. దీనితో అన్నీ సత్కార్యాలవుతాయి.

అర్జునా! అశ్రద్ధతో చేసేవి అసత్కార్యాలే. ఇవి ఇహానికీ పరానికి పనికిరావు. కనుక నీవు శ్రద్ధతో నిష్కామంగా నీ కర్తవ్యం నిర్వహించు. సదాచారం పాటించు - శుభం.

సత్యధర్మ మహింసయు శాంతి ప్రేమ
మానవుని పంచ ప్రాణాలు మహిని వెలయు
పంచ ప్రాణాలలో ప్రేమ యెంచ హెచ్చు
గాన హృదయాన ప్రేమను గట్టి పరచు"

- శ్రీ సత్యసాయి

# 18

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మ మగుచు
మేటి వస్తువు నందున మేటి యగుచు
అంతటను సర్వసాక్షియై ఆత్మయుండు
ఆత్మయె అణువు - అణువె బ్రహ్మంబు నగును

– శ్రీ సత్యసాయి

అర్జునుడు ఆఖరిసారిగా అచ్యుతుణ్ణి ఇలా అర్థించాడు– స్వామీ ! సత్యనారాయణా ! సకల ధర్మ రహస్యాలు సానుకూలంగా బోధించావు. కృతజ్ఞుడను. కర్తవ్యంపై గట్టి శ్రద్ధ కలిగించావు. అస్త్రం సన్యసించినవాణ్ణి అయుధం స్వీకరిస్తున్నాను. అసలు 'సన్యాసం' అంటే ఏమిటి? 'త్యాగం' అంటే ఏమిటి ? రెండూ ఒకటేనా ! వివరంగా విడమర్చి చెప్పుస్వామీ !

అఖండ సచ్చిదానంద ప్రభువు శ్రీకృష్ణ భగవానుడు ఇలా వివరించాడు. వీరకుమారా ! సందేహాలుండరాదు. సందేహాలు సమసిపోయినప్పుడు నిష్కళంక జ్ఞానజ్యోతి హృదయ మధ్యంలో ప్రకాశిస్తుంది. అట్టి నిష్కళంక జ్ఞాన జ్యోతి గలవాడే 'జ్ఞాని' సార్థకమైన నామధేయం పొందుతాడు. వాడు చేసే పని పవిత్రం. విశ్వకల్యాణ కారకం. అది అందరికీ ఆదర్శం.

సమ్యక్ న్యాసం 'సంన్యాసం' అన్నా లేక 'త్యాగం' అన్నా సామాన్యంగా ఒకే అర్థం. విడిచిపెట్టుట. సత్+న్యాసం. అనగా సత్ అనే మహార్థంపై మనస్సుంచి వర్తించుము అని మహార్థమైన పరమ ఉత్కృష్ట ఉన్నత విశాల భావంపై మనస్సు బుద్ధిచిత్త అహం నిలిపి మిగిలిన లౌకికాలపై మనస్సు పోనీయకు అని వ్యాఖ్యాతలు చెప్తారు. సన్యాసానికి అనేక రహస్యమైన అర్థాలున్నాయి అన్నారు మహాత్ములు.

'త్యాగ' శబ్దానికి కర్మఫలంపై ఆశను త్యజించి నిష్కామంగా కర్మలు చేయటం అని పండితులు వ్యాఖ్యానిస్తారు. కర్మలు అన్నీ విచక్షణా రహితంగా విడిచి సోమరిగా తిరగమని త్యాగం చెప్పదు. కర్మ కర్తవ్యంగా భావించి చేయి. ఫలితాలు భగవంతుడు తన ఇష్ట ప్రకారం ఇస్తాడు. ఫలితాలు ముందుగానే ఆశించి అగచాట్లు పడవద్దు అని తాత్పర్యం. యజ్ఞాలు, యాగాలు, వ్రతాలు, పూజాదులు సంతర్పణలు, దానాలు, ధర్మాలు మొదలైన సత్కార్యాలు ఎప్పుడూ ఎవరూ త్యజించరాదు నిషేధించరాదు. యజ్ఞం అంటే ఉపకార కార్యాలు, దానం అంటే తనది పరులకు సంతోషంగా అర్పణం చేయుట. తపస్సు అంటే మానసిక దృఢ దీక్ష. అర్జునా ! అసలు సంగతి చెప్తాను చూడు. బ్రహ్మజ్ఞానం కలవాడే బ్రాహ్మణుడు. అసత్య పక్షాన్ని ధిక్కరించేవాడే క్షత్రియుడు. సద్విచారణ చేయ జాలిన వాడే వైశ్యుడు. కర్మను నిష్ఠగా చేయువాడే శూద్రుడు.

దేహానికి అంగ ప్రత్యంగాలున్నట్లు దేశానికి వర్ణవ్యవస్థ ఏర్పాటు చేశాను. వాక్కు స్థానంలో ముఖ్యమంత్రిగా బ్రాహ్మణుణ్ణి నిలబెట్టాను. బహుబల స్థానంలో రక్షణమంత్రిగా క్షత్రియుణ్ణి నిలిపాను. ఊరువువలె సంఘ వ్యవస్థ సౌధ సమర్థుడు ఆర్థిక మంత్రిగా వైశ్యుణ్ణి, సర్వకార్యాలు చక్కగా నిర్వహించ గలవి పాదాలు పాదస్థానీయుడు కార్మికమంత్రిగా శూద్రుడు. ఇతడు సర్వ కార్య భార నిర్వహణ సమర్థుడు. సేవా పరాయణుడు. శరీర అంగాల వలె అన్ని వర్ణాలు సముచిత పూజనీయాలు. అన్నీ అవసరమైనవే. అందరూ సమర్థులే. అన్ని వర్ణాల వారికీ త్యాగ గుణం ప్రధానం, ధర్మం మూలం. ప్రేమగుణం ముఖ్యం. సమ్యగ్దృష్టి అవసరం.

పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
ధర్మశాంతులందె త్యాగమబ్బు
ప్రేమలేకయున్న క్షేమంబు లేదయా
త్యాగబుద్ధి తోడ తనర వలయు !

– శ్రీ సత్యసాయిబాబా

త్యాగము మూడు రకాలు. సత్కర్మలు ఫలాపేక్షారహితంగా చేయటం. సాత్త్విక త్యాగం. ఫలాపేక్షతో చేయటం రాజస త్యాగం. కోరికలు తీరినప్పుడు మొక్కులు చెల్లించటం తామసత్యాగం. మరొక ధర్మ రహస్యం ఉంది. నిష్కామ కర్మలు చేయు మహాత్ముడు సత్త్వగుణ సంపన్నుడై ఆత్మజ్ఞానం కలిగి అవిద్యా బంధాల నుండి ముక్తుడై సంచరిస్తుంటాడు. ఇట్టి మహాత్ముడు కామ్య కర్మలు చేసేవారినీ ద్వేషింపడు. నిష్కామ కర్మలు చేసే వారిని ప్రశంసింపడు. ఆయన

నైష్కర్మ్య స్థితి నందిన ఆత్మ విద్యా విశారదుడు. ఆ మహర్షికి ఇవేమీ పట్టవు. ఆ పురుషుడు చేసినా మానినా అతడికేఫలితాలు చెందవు. ఆయన అన్నిటికీ అతీతుడు. లోకంలో దేహధారులకు కర్మలు త్యజించటం సాధ్యం కాదు. కర్మ ఫలత్యాగమే చేయవలసిన పని. నిష్కాములై సుజనులైన వారికి ధర్మ కర్మలు చేసినా ఫలితంగా సాత్త్విక స్వర్గాది భోగాలు ప్రాప్తిగా ప్రాప్తిస్తుంటాయి. అవి బంగారు సంకెళ్ళు. సకాములై ధర్మ కర్మలు చేసిన వారికి రాజస ప్రాప్తిగా లభించే భోగాలు రాగి గొలుసులతోడి సంకెళ్ళు. మూఢులకు తామసగుణ ప్రాప్తిగా లభించే ఇష్టసిద్ధులు ఇనుప సంకెళ్ళు.

మనిషికి అవయవాలు అహంకారాది గుణాలు మనో బుద్ధీంద్రియాలు, మంచీ - చెడూ కార్యాలకు కారణాలు. అహంకారం తోడి కర్తృత్వం తనపై వేసుకోనివాడికి ఎట్టి ఫలితాలు చెందవు. వాడు నిత్య సన్యాసి. సాధన - సాధ్యం - సాధకుడు, జ్ఞానం - జ్ఞేయం - జ్ఞాత ఈ మూడు కార్య స్వభావానికి మూలమైన పాత్రలు. అయితే ఇవి ఆత్మకు సంబంధించినవి కావు. ఆత్మ నిస్సంగి నిష్కామ.

ఏ లోకంలోనైనా ప్రకృతి గుణాల నుండి విడిపోయి ఉండే ప్రాణి లేదు.దేవతలు కూడా గుణ బద్ధులే. ప్రాణులు అందులో మానవులు పరమేశ్వర ప్రసాద లబ్ధమైన జ్ఞానం జీవనం పావనం చేసుకోదగిన వారు. మరొకసారి చెప్పుతున్నాను. గుణాలను బట్టి కులవ్యవస్థ ఏర్పాటు చేశాను. శమం దమం శౌచం క్షమ భక్తి తత్త్వ జిజ్ఞాస మొదలైన గుణాలు గలవారే బ్రాహ్మణులు. శౌర్యం ధైర్యం ఔదార్యం ధర్మపాలనం సుజనులను అనాథలను రక్షించే వారే క్షత్రియులు. వ్యవసాయం, వర్తకం, పరిశ్రమలు న్యాయంగా ధర్మయుతంగా నిర్వహించేవారే వైశ్యులు. వారి వారి వృత్తులను సేవా భావంతో చక్కగా నిర్వహించేవారు ఇతర కులాల వారు. అన్నిటికీ అధిపతి అయిన ఈశ్వరుణ్ణి భజించి తమ తమ కర్తవ్య ధర్మాలు నిర్వహించే సుగుణవంతులే కృతార్థులు. కావున అర్జునా ! నీవు క్షత్రియుడవు. ధర్మ రక్షణ నీ కర్తవ్యం. ధర్మ రక్షణకు యుద్ధం చేయాలి. సమాజానికి శ్రేయస్సు కలిగించి సత్పరిపాలన అందించాలి. స్వధర్మం త్యజించటం మంచిది కాదు. పవిత్రమైన అగ్ని పొగతో చుట్టబడి యున్నట్లు ప్రతికర్మలోనూ ఏదో ఒక దోషం ఉంటుంది. పొగను ఊది అగ్నిని జ్వలనం చేసినట్లుగా దోషాలు తొలగించి స్వధర్మం చేసుకుపోవాలి. దాని వలన చిత్తశుద్ధి, కార్యసిద్ధి లభిస్తుంది.

అన్ని దోషాలు పోవటానికి ఒక ఉపాయం ఉంది. స్వార్థం, అహంకారం, దురాశ లేకుండా స్వధర్మం చేసుకుపోయిన ఏ దోషాలూ అంటవు. ఇది ఉత్తమ పద్ధతి. ఇలా చేసిన వాడు ఉత్తమ యోగియే సుమా ! ఇలాంటి భక్తుడు ఎవ్వడైనా ఈశ్వర ప్రీతికి పాత్రుడవుతాడు. నీవు నన్నే ధ్యానించి సర్వసమర్పణ చేసి స్వధర్మం

నిర్వర్తించి శ్రేయస్సు అందుకో. మోహక్షయమే మోక్షం. మోహం వీడి మోక్షం పొందు. ఈ రహస్యాలు వివరించాను. నీవు స్వయంగా ఆలోచించి మంచిది అనుకొన్నది చేయి. నీవు ప్రియ భక్తుడవని ఇంత వివరంగా చెప్పాను. అపుడు అర్జునుడు పరమానందంతో ఇలా అన్నాడు. స్వామీ ! సర్వాంతర్యామీ ! సకల చరాచర హృదయ చక్రవర్తీ ! నమోనమః నీ జ్ఞానోపదేశం వలన నా మోహం తొలగి పోయింది. త్రికరణ శుద్ధిగా నీవు చెప్పినట్లే యుద్ధం చేస్తాను. రథం నడుపు స్వామీ !

మోహ మడంగెనో ! భువన మోహనరూప ! తొలంగె ధర్మసం
దేహములన్నియున్ దిగులుదీరె – మనమ్ము కలంకదేరె ఉ
త్సాహము మైకొనెన్ విగత ధర్ముడనైన ననున్ స్వధర్మ ని
ర్వాహకుగా నొనర్చిన భవత్కృపకియ్యవె ధన్యవాదముల్ !!

– కరుణశ్రీ

అని కృష్ణ పరమాత్మ పాదాలు అంటి ప్రణామం చేశాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా ! ఈ విషయాలన్నీ వ్యాస మహర్షి నా కొసంగిన జ్ఞాన చక్షువులతో దర్శించి మీకు వివరించగలిగాను. స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ చెప్పుతుంటే వినగలిగే మహాభాగ్యం నాకు లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

యోగీశ్వరుడైన సర్వాధిపతి శ్రీకృష్ణుడు ఎక్కడుంటే అక్కడే విజయం అని నిశ్చయం. న్యాయం ధర్మం అటువైపే ఉంటుంది. ఇది నా నిశ్చిత అభిప్రాయం. 'ధర్మం మమ ' నాధర్మం – కురు – చేయి.

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీః విజయో ర్భూతి ధ్రువానీతిః మతిర్మమ ॥

అని సంజయమంత్రి గీతార్థం చెప్పి సెలవు తీసుకున్నాడు. ఆ మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణభగవానుడు సారథ్యం చేయగా అర్జునుడు విజయుడై ప్రకాశించాడు. శుభం. భవతు !!

వందే సుందర మందహాస వదనం కారుణ్యావారాం నిధిం
'భారద్వాజ' పవిత్ర గోత్రభవ మాపస్తంబ సూత్రం విభుమ్
ఉద్యద్భాను మరీచి మండలరుచిం ప్రేమ స్వరూపం ప్రభుం
'శాంతిశ్రీ' వలయం 'ప్రశాంతి నిలయం' ' సత్యం శివం సుందరమ్' !

– కరుణశ్రీ

# ఉత్తర గీత

పరమ బ్రహ్మ మనంగా
పరతత్త్వమనంగ పరమపదమనగా - ఈ
శ్వరుడన - కృష్ణుడన - జగ
ద్భరితుడు నారాయణుండు దావెలు గొందున్ !!

- భాగవతం

1

# పరమాత్మ

## ప్రథమ అధ్యాయము

భగవాన్ ! శ్రీకృష్ణ పరమాత్మా ! అనేక నమశ్శతాలు. జ్ఞాన స్వరూపా ! జగద్గురూ ! నీవు ఎన్నిసార్లు ఎంతగా బోధించినా ఈ మందమంతి మరచిపోతున్నాడు. అంధకారపటలం అనుక్షణం నన్ను క్రమ్మివేస్తోంది. కొన్ని సందేహాలు అడుగుతాను దయయుంచి మరొకసారి విశదపరచండి.

పరమాత్ముడు అంగీకార సూచనగా చిరునవ్వునవ్వాడు. అర్జునుడు అడుగుతున్నాడు.

ఏది ఏకైకమై సర్వవ్యాపకమై అద్వితీయమై ఆకాశాది తత్త్వాలకు అతీతమై ప్రకాశిస్తుందో ! ఏది నిష్కళమై, నిరాకారమై, నిర్వికారమై, నిరంజనమై, పర బ్రహ్మస్వరూపమై, అప్రతర్క్యమై, అవాఙ్మానసగోచరమై అవిజ్ఞేయమై వినాశ ఉత్పత్తి వర్జితమై ఉంటుందో ! ఏది బంధ మోక్షరహితమై శాంతమై శుద్ధమై అత్యంత నిర్మలమై యోగ నిర్ముక్తమై, వస్తుసంబంధ రహితమై, కైవల్య ప్రదమై, ముక్తిదమై, హేతు సాధన వర్జితమై హృదయ కమలంలో దేదీప్యమానమై జ్ఞాన స్వరూపమై, జ్ఞేయలక్ష్యమై విరాజిల్లు తుంటుందో అట్టి మహాతత్త్వంగూర్చి తెలియచెప్పుదేవా ! ఇదొక్కటే అడగాలని అనిపించింది. అనుగ్రహించు మహాత్మా !

తరచి చదువు చదువ తర్కవాదమెకాని
పూర్ణ జ్ఞాన మెపుడు పొందలేడు
చదువులన్ని చదివి చావంగ నేటికి ?
చావు లేని చదువు చదువ వలయు

– శ్రీ సత్యసాయిబాబా

భగవానుడు ఈ సుదీర్ఘమైన సంప్రశ్నవిని అన్నాడు. బాహ్యాభ్యంతర శత్రువులను జయించిన మహాబాహూ ! పార్థా ! నీవు యోగ్యుడవు. నీ జ్ఞాన తృష్ణకు అభినందనలు. సుబుద్ధీ ! ఆలోచించి మంచి ప్రశ్నలేవేశావు. చెప్తాను సావధానంగా ఆలకించు. భక్తి శ్రద్ధలు ముఖ్యం. జాగ్రత్తగా విను–

ఇది తత్త్వార్థ రహస్యం. ఇది తెలుసుకోవడానికి ఒక ఉపాయం ఉంది విను. అదే ఆత్మమంత్రం. అదే ప్రణవం. ఇదే హంస మంత్రం. యోగులు ఈ మంత్రం చేత సంసార హరణం చేసుకొంటారు. ఆత్మ మంత్రానికి జీవుడైన హంసకు ప్రతిపాద్య ప్రతిపాదక సంబంధం ఉంది. ఈ ఆత్మమంత్రమే సోహం. ఈ విచారణ చేత కామాదులు జయించినవారి ఆత్మయే బ్రహ్మం అవుతుంది. ఆత్మలో పరమాత్మయే ప్రణవం అదేహంస. జీవాత్మ పరమాత్మల సంయోగార్థమే 'తత్త్వమసి' 'అహంబ్రహ్మాస్మి' ఆ పదార్థ ప్రత్యేకతలే హంస + ప్రణవం అంటారు.

జీవుల చరమలక్ష్యం హంసత్వం. అనగా ముక్తి. అనగా బ్రహ్మ సాక్షాత్కారం. జ్ఞాని హంసాక్షరం పొంది నాశనం లేని కూటస్థం పొంది జనన మరణ చక్రం నుండి విడువబడతాడు. హంస అంటే బ్రహ్మం. హంసాక్షరం అంటే ప్రణవం. అదే ఓంకారం. హంసకు జీవుడు అనీ బ్రహ్మ అనీ అర్థం ఉంది. సోహం త్రిప్పిన హంస అవుతుంది. హంసలో అనేక అర్థాలున్నాయి. హంసత్వం వలన అవిద్యానివృత్తి అవుతుంది.

" కాకీ ముఖం కకారాంతం ముకారశ్చేతనా కృతిః
మకారస్యతు లుప్తస్వ కోర్థః సంప్రతి పద్యతే ॥ "

ఈ శ్లోక రాజంలో మహా గూఢార్థాలు అనేకం నిక్షిప్తమై యున్నాయి. కాకీ అంటే జీవుడు సుఖదుఃఖాలు అనుభవించు వాడు. దేవుడు పరమాత్మ, 'కా' లోని అకారం విరాట్పురుష సంకేతం. 'ముఖం' లోని ఉకారం హిరణ్యగర్భం. మకారం అవ్యాకృత సూచకం. అకార ఉకార మకారాలు ప్రణవ సంకేతాలు. ఈ మూడింటి ఐక్యతను పదార్థం అంటారు. అంటే అఖండ ఆనంద అద్వైత సచ్చిదానందం బ్రహ్మం. దీనిని అనుసంధానం చేయుయతి పరబ్రహ్మాన్ని అందుతాడు.

మరొక వ్యాఖ్య – 'కాకీముఖం' అంటే బ్రహ్మాండం. దీనిలోని అకారం పరబ్రహ్మ వాచకం. ఉకారం మూలప్రకృతి. బ్రహ్మసత్యం, ప్రకృతి మిథ్య. ప్రకృతి నశించు స్వభావం గలది. మకారం కారణ తత్త్వం. కనుక ప్రకృతి పోగా మిగిలి ఉండేది నిత్యసత్యమైన బ్రహ్మపదార్థం. ప్రణవోపాసకుడు పరబ్రహ్మాన్ని పొందుతున్నాడు. ఇందులో తాత్పర్యం ఇది.

ఇందులో వివరణ ఇది – అకారం – పంచజ్ఞానేంద్రియాలు పంచకర్మేంద్రియాలు పంచ తన్మాత్రలు, పంచవాయువులు అంతఃకరణ చతుష్టయం కల్గినది స్థూల శరీరం. దీనికి జాగ్రత్త అవస్థ. విశ్వుడు అభిమాని, క్రియశక్తి, రజస్సు గుణం. నేత్రం స్థానం, యుక్తం భోగం. దీనికి తోడి ఆత్మ జీవాత్మ. ఇతడు వ్యావహారిక జీవుడు ఇది అకార తత్త్వం.

ఉకారం – పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు పంచ తన్మాత్రలు మనోబుద్ధులు గలిసి పదిహేడు తత్త్వాలు గలది సూక్ష్మ శరీరం. ఇది హిరణ్య గర్భం. దీనికి స్వప్నం అవస్థ. తైజసుడు అభిమాని. ఇచ్ఛశక్తి. సాత్వికం గుణం. కంఠం సాధనం, స్వేచ్ఛ భోగం, దీనితోడి ఆత్మ అంతరాత్మ ఇతడు ప్రతిభాసిక జీవుడు. ఇది ఉకారతత్త్వం.

మకారం – ఇది స్థూల సూక్ష్మ తత్త్వాలకు కారణం. కనుక ఇది కారణ శరీరం. ఇది అవ్యాకృత మహదహంకారం. ఇదే త్రిగుణ గర్భం. దీనికి సుషుప్తి అవస్థ. ప్రాజ్ఞుడు అభిమాని. ద్రవ్యం శక్తి తామసం గుణం. హృదయం స్థానం, ఆనందం భోగం, దీనితోడి ఆత్మ పరమాత్మ ఇతడు ఆత్మ దేవుడు.

ఈ విధంగా 'కాకీ ముఖం' లోని అకార ఉకార మకారాలకు అనేక అర్థాలు ఉన్నాయి. అన్ని అర్థాలతో కూడినదే ప్రణవం. ఇదే మహా ఆత్మ మంత్రమైన ఓంకార స్వరూపం, ఇదే సోహం.

- ఇట్టి ప్రణవోపాసకుడు హంసను చింతిస్తూ వేయి సంవత్సరాలు సుఖంగా జీవించి బ్రహ్మైక్యం చెందుతాడు. ఆనందం పొందుతాడు. కనుక ఋషులు మానవుణ్ణి 'సహస్రాయుర్భవేత్' అన్నారు.

అర్జునా ! హృదయాకాశంలో పరమాత్మను నిలుపు. ఆకాశం పరమాత్మ కంటె వేరుగా లేదు. పరమాత్మ ఆకాశానికి ఉపాదాన కారణం. జీవాత్మ పరమాత్మల ఐక్యాను సంధానం చింతించు. అన్యం తలంచకు. దహరాకాశం అన్నా హృదయాకాశం అన్నా జీవాత్మ అన్నా ఒక్కటే. మహాకాశం పరమాత్మ. అది బ్రహ్మ స్వరూపం. ధనంజయా ! బ్రహ్మజ్ఞాని యోగాభ్యాసం చేత బుద్ధిని స్థిరం చేసుకొని అజ్ఞానం దూరం చేసుకొంటాడు. క్రమంగా బాహ్య ఆకాశం నుండి శ్వాసను నాసికాగ్ర భాగంలో లయం చేస్తాడు. అపుడు బ్రహ్మ సాక్షాత్కారం అవుతుంది. ఆ బ్రహ్మం నిరాకారం నిర్మలం నిరవయవం. నిష్కళం అది. నిష్కళంకం అనగా బ్రహ్మ నిష్కళం నిరవయవం అని అర్థం.

పార్థా ! నాసికా పుటద్వయం నుండి వచ్చు వాయువు లయమయ్యే చోట మనస్సును నిలిపి ఈశ్వరధ్యానం సలపటమే ప్రాణాయామం. దీనిచే మనోనిశ్చలత పెరుగుతుంది. భక్తుడు ఈశ్వరుణ్ణి ఈ విధంగా భావించాలి.

నా స్వామి నిర్మలుడు అణువంత కూడా దోషము లేనివాడు. నా ప్రభువు జనన మరణ క్షుత్పిపాసా హర్షశోకరహితుడు. నా స్వామి సత్య శివసుందరుడు. సమాధి స్థితి అంటే సమత్వస్థితి. హర్ష శోకాలకు కష్ట సుఖాలకు చలించని మనస్థితి. అది మనోబుద్ధులకు అతీతమైనదశ. అది నిరామయం. రోగ రహితం. ఏ భ్రమలకు భ్రాంతులకు చెదరని దశ. అది సమాధి దశ.

అర్జునా ! యోగి త్రిశూన్య స్థితిని పొందాలి. అంటే ప్రభాశూన్యం మనశ్శూన్యం బుద్ధి శూన్యం కావాలి. దీనికి తోడు జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలు శూన్యం చేసుకొన్నవాడు, సంసార బంధాల నుండి ముక్తి పొందుతాడు. జీవన్ముక్తుడికి దేహాభిమానముండదు. దేహం కర్మచేత వచ్చిందనీ చలించటం దాని స్వభావం అనీ ఇది అనేది ప్రారబ్ధం అనీ దీనికి వశం కాక బ్రహ్మ నిష్ఠలో స్థాణువు వలె ఈశ్వరునిపై నిశ్చలంగా బుద్ధినింపి ఆత్మను తెలుసుకొంటాడు. ఇది సమాధి పొందినవాడి లక్షణం.

పరమేశ్వరుడు శబ్ద శాస్త్రంలో చెప్పబడిన హ్రస్వ దీర్ఘ ప్లుతాది మాత్రలకు అతీతుడు. శబ్ద రహితుడు, స్వరవ్యంజన బిందునాద కళలకు అందనివాడు. అట్టి స్వామి తత్త్వం తెలిసిన వాడే వేదవేత్త. అంతేగాని వేదాలు వల్లించేవాడు, భాష్యాలు చెప్పేవాడుకాదు అని తాత్పర్యం.

బిందువు అనుస్వారం యొక్క స్థానం నాసిక. నాద సాధనం కంఠం. కళలు అంటే శబ్దాదులు. వీటికి అతీతమైన వాడు భగవానుడు.

మహత్ అమహత్ అహంకార బీజ మూల భూత ప్రకృతిని పరాశక్తి అనీ బిందువు అనీ అంటారు. ఈ బిందువు నుండి పరా పశ్యంతి మధ్యమ వైఖరీ అనే నాల్గు విధాలుగా వాక్కులు నాదంగా జనించాయి. క్షేత్రజ్ఞుడు, చైతన్యుడు, జీవుడు అనే నామాలతో కళలు విలసిల్లు తున్నాయి. ఇదంతా ప్రకృతి. ఈ ప్రకృతికి అతీతుడు పరమాత్ముడు అని తెలుసుకో గలిగిన వాడే వేదవేత్త. భక్తుడికి ఉత్తమ జ్ఞానం వలన ఈశ్వర విజ్ఞానం లభిస్తోంది. హృదయంలో ఆరాధించే స్వామిరూపం ప్రత్యక్షమవుతోంది. శాంతి ప్రాప్తిస్తోంది. ఈశ్వర కృపచేత స్వతస్సిద్ధమైన అనుభూతి లభించిన తదుపరి యోగాల ధారణలతో పనియేముంది?

పార్థా ! ప్రణవం అంటే ఓంకారం. ఓంకారం పరబ్రహ్మరూపం. ప్రణవం వేదమాతకు ప్రాణం. ఓంకారం వేదమంత్ర ప్రారంభంలో మధ్యలోనూ చివరనూ ప్రతిష్ఠితమై వేదభాగాలను పవిత్రం చేస్తోంది. ప్రణవ రూపంలో పరమాత్మ లక్ష్య సిద్ధికై బలం చేకూరుస్తున్నాడు. ప్రణవం వేద పురుషుడి ప్రాణం. ఈశ్వరుడు ప్రకృతి తానైకూడా సర్వదా ప్రకృతికి అతీతంగా ఉండి ప్రకృతిని నడుపుతుంటాడు. అసలైన ప్రణవ స్వరూపం తెలిసిన వాడు శంకరుడొక్కడే. ఇట్టి

ప్రణవతత్వం తెలుసుకున్నవాడు పరమాత్మ అయిపోతాడు.

బాటసారి నదిని దాటటం కొరకు నావ కోరుకుంటాడు. నదీ ప్రవాహం దాటిన తరువాత ఆతనికి నావతో పనేముంది ? అట్లే ఆత్మయొక్క ప్రత్యక్ష జ్ఞానం కలిగిన తదుపరి పండితుడికి శాస్త్రసాధనలు మరేల ?

ధాన్యం కోరుకొనే రైతు కళ్ళంలో ధాన్యం పట్టించి గడ్డిని వదలి వేసినట్లు సుబుద్ధి గురువుల వలన శాస్త్ర గ్రంథాలు చదివి జ్ఞానం అనుభవం లోకి తెచ్చుకొని గ్రంథాలు వదలివైచి ఈశ్వర రతిలో లీనమైపోతాడు. సిద్ధి పొందిన ఉపాసకుడు తర్క వాదాలలో దిగడు.

అంధకారంలో వస్తు దర్శనం కోసం దీపం కావాలి.వస్తు దర్శనం అయిన తర్వాత దీపంతో పనేముంది? అట్లే జ్ఞేయ దర్శనమైన తర్వాత జ్ఞానంతో పనిలేదు. జ్ఞానానికి ఫలం ఈశ్వర సాక్షాత్కారం. అది సిద్ధించిన తదుపరి జ్ఞానం కూడా త్యజింపదగిందే సుమా ! పవిత్ర హృదయా ! పొట్ట నిండా అమృత పానం చేసి సర్వాభీష్టాలు నెరవేర్చుకొన్న వానికి ఉదకం ఎందుకు? అలానే పరమాత్మ సాక్షాత్కార మహాభాగ్యం పొందిన ఉత్తమ యోగికి వేదశాస్త్రాలతో ప్రయోజనం లేదు.

తృప్తిగా జ్ఞానామృతం త్రాగి కృతకృత్యుడైన యోగికి వేరే లౌకిక వాంఛలు ఏమి ఉంటాయి ? లౌకికంపై మనసున్నయోగి ఉత్తమ యోగి కానేకాడు. స్వార్థ కర్మాసక్తిగలవాడు తత్త్వవేత్త కాడు సుమా !

ఓంకారం ఎడతెగని తైలధారవలె విరామం లేని ఘంటానాదం వలె అనిర్వచనీయ ప్రభావంతో సర్వత్ర సర్వదా ప్రతిధ్వనిస్తూంటుంది. అట్టి బ్రహ్మస్వరూపమైన ప్రణవమహత్వం గుర్తించినవారే నిజమైన వేదవిదులు.

అర్జునా ! బ్రహ్మ సాక్షాత్కారం కావాలి అంటే ఆత్మను క్రింద అరణిగా ప్రణవాన్ని పైఅరణిగా కూర్చి ధ్యానం అనే మధనం ద్వారా అభ్యాసం చేయాలి.

పార్థా ! పరమాత్మ దేదీప్యమానమైన మహాగ్నిజ్వాల వలె ప్రకాశి స్తుంటాడు.ఆ స్వచ్ఛ తేజోమూర్తి ప్రత్యక్షం అయ్యేవరకు అన్యచింతలు మాని ఆ పరమాత్మ స్వరూపాన్ని ధ్యానిస్తుండాలి. జీవాత్మ అజ్ఞానం వలన పరమాత్మ దూరంగా ఉన్నట్లు భావిస్తాడు. వస్తుతః పరమాత్మ దూరంగా లేదు. జీవుని హృదయంలోనే పరమాత్మ ఉంటున్నాడు. పరమాత్మ దగ్గర ఉండటం వలన అన్ని విధాలా జీవాత్మ నిర్మలుడు. పరిపూర్ణుడు. సర్వవ్యాపి. స్వయం ప్రకాశమూర్తి. ఇది తెలుసుకొని జీవాత్మ తనలోగల మహా మహిమాన్విత శక్తిని జ్ఞాపకం చేసుకొంటూ పరమాత్మను ధ్యానిస్తూ ఉండాలి. ఇది జీవాత్మ కర్తవ్యం. ఆత్మ దేహంలో నివసిస్తున్నా కూడా ఆత్మకు దేహంతో సంబంధం లేదు. ఆత్మ దేహం నుండి

జన్మించింది కాదు. ఆత్మ శరీరధారి అయిననూ భోగాలు, రోగాలు, అనుభవించేవాడు కాదు. దేహంతో కొంత సంబంధం కలిగియున్నా ఆత్మ దేహంలో బంధింపబడి ఖైదీగా ఉండదు.

దేహి సుఖదుఃఖ హేతు భూతుడయిననూ దేహంలో ఉన్ననూ దేహి సుఖదుఃఖ బంధ రహితుడు. దేహానికి మరణావస్థ ఉంది. కానీ దేహికి మరణ దుః ఖాలు లేవు. కనుక దేహి షడూర్ములు షడ్భావ వికారాలు గలవాడు కాదు. దేహి ఆత్మకు మిక్కిలి దగ్గర వాడు. ఆత్మ ఎలా ఉంటుంది అంటే నువ్వులలో నూనె ఉన్నట్లు, పాలలో నేయి ఉన్నట్లు, పువ్వులలో సువాసన ఉన్నట్లు, ఫలాలలో రసం ఉన్నట్లు, కొయ్యలో అగ్ని ఉన్నట్లు, ఆకాశంలో వాయువున్నట్లు ఆత్మదేహి అంతః కరణంలో నిలిచి పనిచేస్తుంటుంది.

తిలమధ్యే యథాతైలం క్షీరమధ్యే యథాఘృతమ్ ।
పుష్పమధ్యే యథా గంధః ఫలమధ్యే యథా రసః ।
కాష్ఠాగ్నివత్ ప్రకాశేత ఆకాశేవాయువచ్చరేత్” అన్నారు మహాత్ములు

యథా సర్వగతో దేహీ దేహమధ్యే వ్యవస్థితః ।
మనః స్థో దేహినాందేవో మనోమధ్యే వ్యవస్థితః ॥

దేహి అంటే ఆత్మ. ఆత్మ తిలలో తైలాదులవలె దేహం మధ్య అన్ని జీవులలో ప్రకాశిస్తుంటాడు. ఆత్మయే పరమాత్మ. అతడు సకల జీవుల అంతః కరణంలో సాక్షీభూతుడై భాసిస్తుంటాడు. పరమాత్మ జీవుల దేహాలలో జీవాత్మయై మనో మయాది కోశాలలో దేవాత్మయై మనోమధ్య పీఠంపై విరాజిల్లుతుంటాడు. ఆ పరమాత్మయే జీవాత్మ, దేవాత్మ, మహాత్మయై విశ్వాత్ముడై స్థానాన్ని అనుసరించి ప్రకాశిస్తుంటాడు.

ఫల్గుణా ! యోగీశ్వరులు తమ మనస్సులో ప్రకాశిస్తూ సాక్షీ భూతుడై మనస్సు మధ్యలో విరాజిల్లుతూ అందరి మనస్సుకు మధ్యస్థుడై సర్వ సాక్షియై మనస్సు యొక్క సంకల్ప వికల్పాదులు విసర్జించి వెలుగొందే మనస్సు అనే రూపం దాల్చిన పరమాత్మను తమ మనో నేత్రం ద్వారా దర్శించి స్వయం సిద్ధిని పొందుతారు.

యోగీంద్రులు తమ హృదయాన్ని స్వచ్ఛమైన ఆకాశం వంటి దానినిగా చేసుకుని ఆ మనోభూమిని నిశ్చలమూ నిర్మలమూగా నిరాధారంగా నిరాస్పదంగా తయారు చేసుకొని నిశ్చల స్థాణువు రూప సదృశుడైన పరమాత్మను ధ్యానించి ధ్యానించి తామే ఆ రూపం పొందుతారు. ఇది సమాధి స్థితి చెందిన వారి లక్షణం.

అర్జునా ! యమనియమ అష్టాంగ యోగ అభ్యాసం ద్వారా ఈ యోగామృతం సేవించినవాడు ప్రాణాయామం చేత కుంభించిన వాయువునే ఆహారంగా స్వీకరించటం చేత మిక్కిలి సుఖంగా ఉంటాడు. ఇతడు ఈశ్వర కృపచే జనన మరణ చక్రం నుండి విడిపోతాడు.

పార్థా ! నిర్వికల్ప సమాధిలో ఉండే యోగి ఊర్ధ్వ భాగాన్నీ, అధోభాగాన్ని, మధ్య భాగాన్ని, పార్శ్వాది భాగాలనూ సర్వం శూన్యంగా భావించి దేశకాల వస్తు పరిచ్ఛేద శూన్యుడై ఉన్నదంతా ఒక్క ఆత్మ మాత్రమేననీ ఒక్క ఆత్మయే దర్శనీయమైనదనీ, నిశ్చయించి ధ్యానించి అట్టి సర్వస్వమైన ఆత్మతానేయని గ్రహించి తృప్తి చెందుతాడు. అట్టి సర్వశూన్య భావనగల జ్ఞానికి పుణ్య పాపాలు లేవు. అతడు ద్వంద్వరహితుడైన జీవన్ముక్తుడు.

శ్రీ కృష్ణ పరమాత్మ బోధ విన్న తర్వాత అర్జునుడికి ఒక శంక కలిగి ఇలా ప్రశ్నించాడు -

భగవాన్ ! మనిషికి కనిపించని పదార్థంపై మనసు నిలవదు కదా! ధ్యానం ఎలా సాగుతుంది ? కనిపించే దృశ్యద్రవ్య ప్రపంచం నశించేది కదా ! పరబ్రహ్మమూర్తి వర్ణరూప రహితుడాయె అవాఙ్మానస గోచరుడు కదా ! యోగులు మాత్రం పరబ్రహ్మను ఏ విధంగా ధ్యానిస్తారు? తలంచిన విషయం అనుభూతం కానిది యోగం ఎలా అవుతుంది? ఈ సందేహం తొలిగించు. అపుడు శ్రీకృష్ణ పరమాత్మ మందహాసం చేసి అతడి సంప్రశ్నకు ఇలా చక్కని సమాధానం వివరించాడు.

అర్జునా ! నీకు లోగడ చెప్పింది మూర్త్యాత్మక జ్ఞానం. అది అవయవ రూపంలో విలసిల్లేది. అది సావయవ జ్ఞానం. నీవు క్రమక్రమంగా యీ స్థాయిని అందుకోగలవు అని ఇపుడు నిరవయవమూ అమూర్త్యాత్మకమూ అయిన నిర్విశేష. ఈ వేదాంత తత్త్వాన్ని చెప్పుతున్నాను. ఇది ఆత్మ విద్య. ఇది ఆత్మ మంత్రం. ఇది ఆత్మ తత్త్వం. ఇది అతి రహస్యమూ, నిగూఢమూ నిర్మలమూ అయినది. నిశ్చల శ్రద్ధా భక్తి ప్రపత్తులతో దీనిని శ్రవణం చేయవలసియున్నది.

యజ్ఞాదుల వంటి సత్కార్యాచరణం వలన నిష్కామ బుద్ధి జనిస్తుంది. నిష్కామ బుద్ధి వలన అంతఃకరణం పరిశుద్ధ మవుతుంది. పరిశుద్ధ అంతః కరణం వలన నిర్మల వేదాంత మార్గం గోచరిస్తుంది. వేదాంత మార్గ ప్రయాణ ఫలంగా బ్రహ్మసాక్షాత్కారం లభిస్తుంది.

బ్రహ్మం అంటే చతుర్దశ భువనాలెల్ల నిండి యున్న బృహత్తరమైన ఈశ్వర రూపం. పరమేశ్వరుడు లేని పరమాణువు. కూడా లేదు. ఈశావాస్యం

జగత్సర్వం. శూన్యం అంటే ఉత్త ఖాళీ ప్రదేశం అని కాదు. ఈశ్వరుడు కాక అన్యమైనది లేదు అని తాత్పర్యం. పరబ్రహ్మం సర్వత్ర నిండియున్నాడు. బ్రహ్మంలేని శూన్యం అనేది ఎక్కడా లేదు. స్వామి ఊర్ధ్వం అంటే పై సప్తలోకాలు అధో లోకాలు మధ్యలోని మనుష్యాది లోకాలు అన్నీ ఆక్రమించి పరిపూర్ణుడై యున్నాడు. దేనిని ఆత్మ అంటున్నామో అదే పరమాత్మ. అదే బ్రహ్మస్వరూపం. బ్రహ్మాత్మ భావన వలన జీవాత్మ పరమాత్మ అవుతాడు. యోగి అలాగే ధ్యానించి ఆత్మ రూపుణ్ణి అని నిశ్చయంగా చెప్తాడు. ఇది సమాధిస్థుని లక్షణం. అర్జునుడు మరొక శంక లేవదీశాడు. స్వామీ ! మనస్సులో సందేహం ఉంచుకోరాదు కదా! చనువుతో అడుగుతున్నాను ఏమీ అనుకోవద్దు. తప్పులుంటే క్షమించి మమ్ము సరిదిద్దుడు తండ్రీ!

మూర్తి ధ్యానంతోడి సాలంబయోగం అనిత్యాన్ని సూచిస్తోంది. మూర్తి ధ్యానం కాని నిరాలంబయోగం శూన్యాన్ని చూపిస్తోంది. ఈ రెండు విధానాలలోనూ దోషం ఉన్నట్లుంది. యోగీశ్వరులు దేనినైనా ఎట్లు ధ్యానం చేయకల్గుతారు? ఈ మందమతికి వివరించు స్వామి !

అపుడు అచ్యుత స్వామి ఇలా వివరించాడు – పార్థా ! జ్ఞానోపదేశం వ్యక్తుల స్థాయిని బట్టి విషయ వివరణాన్ని అనుసరించి సమయ సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. 'మూర్తి ఆరాధన' 'అమూర్తి ఆరాధన' రెండూ మంచివే. ప్రాథమిక భక్తులకు మూర్తి ఆరాధన గూర్చియే చెప్పారు. అమూర్తి ఆరాధన అనుభవం గలవారికి చెప్పాలి. ఉదాహరణకు దేశం గూర్చి చెప్పుతూ మ్యాపును చూచి నదులు పర్వతాలు భవనాలు పట్టణాలు మార్గాలు పరిచయం చేయబడుతుంది. నిజానికి అది ఒక కాగితం మాత్రమే. అక్కడ నదీలేదు, జలం లేదు, పర్వతం లేదు భవనం లేదు. అది ఒక చిత్రం అని తెలుసు. దానిని ఆధారం చేసుకొని వాస్తవాన్ని తెలుసుకోవటం కోసం ప్రయత్నం చేయాలి కదా! అట్లే మూర్తి ఆరాధన ద్వారా మనస్సును అమూర్తి అయిన పరమాత్మను గూర్చి తెలుసుకోవటం కోసం కృషి చేయాలి. మహర్షులు బోధించింది ఇదే విధానం. పరోపకార సత్కర్మాచరణం వలన సాధకునకు అంతః కరణ శుద్ధి జరుగుతుంది. అంతఃకరణ శుద్ధితో వేదాంత జ్ఞానం కలుగుతుంది. వేదాంత జ్ఞాన పరిశీలనా అభ్యాసం వలన బ్రహ్మ సాక్షాత్కారం లభిస్తుంది. మూర్తిగా భావించిన బ్రహ్మం క్రమక్రమంగా మహదాకారం గల నిరవయవ అమూర్తిగా బ్రహ్మాండం వ్యాపించిన వెలుగువలె సాక్షాత్కరిస్తాడు. నిరయవం, నిరాధారం అంటే ఉత్త శూన్యం అనుకోరాదు. శూన్యం అంటే నిరాకారమైన బ్రహాండం నిండిన కాంతిరూపం. చిత్తవృత్తులు వికారాలకు చోటు ఈయకుండా చూచుకోవాలి. హృదయం నిర్మలంగా స్వచ్ఛంగా

చేసుకొని నిరాకార వస్తువును ధ్యానం చేస్తూ పరమానందాత్ముడవై- నా ఆత్మయే విశ్వవ్యాప్తమై నిండి ఉన్నదనీ ఆ ఆత్మయే వివిధ భంగిమలలో వివిధ దృశ్యాలను చూపుతోందని అంతేకానీ నన్నూ నా ఆత్మ పరిధీ దాటి మరొకటి లేదని బ్రహ్మ సాక్షాత్కారానుభవం పొందాలి. ఇది ఆత్మానుభవం కావాలి.

కృష్ణ పరమాత్మ బోధ ఆలకించి ఆనందం పొంది ఒక మంచి జ్ఞానాసక్తి గలవాడై అర్జునుడిలా అన్నాడు- స్వామీ ! నీవు చెప్పిన వివరణ హృదయానికి చక్కగా హత్తుకొన్నది. సమాధానం కుదిరి సందేహాంబుదాలు పటాపంచలై పోయాయి.

అర్ధ స్వరూప ప్రపంచం శబ్దంచే నిరూపింపబడింది. ఆ శబ్దం వర్ణాత్మకం. వర్ణం ప్రణవస్వరూపం. ప్రణవం బిందు విలసితం. బిందువు నాదయుక్తం. నాదం బ్రహ్మస్థానం. అది కళల పుట్టిల్లు. ఇలా సమన్వయించబడిన బ్రహ్మం చివరకు బిందు నాద కళాతీతం. ఆ పరబ్రహ్మం గూర్చి మరింత వివరంగా బోధించు స్వామీ!

హ్రస్వ దీర్ఘ ప్లుతాలన్నీ బిందువును ఆశ్రయించాయి. ఆ బిందువు నాదం చేత భేదింపబడుతోంది. కళా సమన్వితమైన ఆనాదం దేనిచేత భేదింపబడుతోంది ? విశదం చేయి తండ్రీ !

శ్రీకృష్ణ పరమాత్మ ఈ సంప్రశ్నకు మిక్కిలి సంతోషించి చాలా లోతైన వేదాంత ప్రశ్నలేశావు విను అని ఇలా వివరించాడు. మూలాధార చక్రక్రమంలో అనాహతం ఒకటుంది. అది పరావస్థ. ఆ పరావస్థను పొందిన శబ్ద ప్రణవం మధ్య ధ్వని ఉంది. ఆ మహా మహిమాన్విత ధ్వనిలో జ్యోతి ఉంది. ఆ జ్యోతి మధ్య మనస్సు ఉంది. ఆ మనస్సు లయమయ్యే స్థానాన్ని శ్రీ మహావిష్ణు పరమ పదం అంటారు. అది మహా ప్రకాశంతో విరాజిల్లుతుంటుంది. ఆ ప్రకాశమే నాద భేదానికి స్థానం. నాదం విష్ణు పదంలో లీనమై పోతుంది.

ఓంకారంలో ప్రతిధ్వనించేదే నాదం. ఆ నాదంలో రేచక పూరక కుంభక క్రమంలో వాయువు లయమవుతుంది. ఈ వాయులయం జరిగేంత వరకు నిరాలంబ నిర్విశేష పరబ్రహ్మాన్ని ధ్యానం చేస్తుండాలి. అపుడు క్రమంగా నాదం బ్రహ్మంలో కలిసి పోతుంది. ఆ నాదం కలిసి పోయే సాధనమే పరబ్రహ్మ స్థానం.

పార్థుడు "స్వామీ ! బిందునాద కళాతీత బ్రహ్మాన్ని గూర్చి చాలా విశద పరచి నా సందేహం నివారణచేశావు. మరొక చిన్న సందేహం-

పంచ భూతాత్మక స్థూల శరీరం భిన్నం కాగానే శరీరంలోని పంచ వాయువులు పంచ భూతాలలో కలిసి పోతాయికదా ! ఆ జీవుడు చేసిన పుణ్య పాపాలు ఎక్కడికి పోతాయి ? ధర్మాధర్మాలు ఏమవుతాయి ?

శ్రీకృష్ణదేవుడు "అర్జునా ! జీవుడు చేసుకొన్న పుణ్యపాపాలు ధర్మాధర్మాలు అతడు జన్మజన్మలలో దాల్చే దేహాలతో అతణ్ణి వెన్నాడు తుంటాయి. ఈ జీవుని స్థూల సూక్ష్మ కారణ శరీరాలతో ప్రయాణం చేస్తూనే ఉంటాయి. జీవుడి దశేంద్రియాలకు అంతఃకరణ చతుష్టయానికి అధిదేవతలు సూర్య చంద్రులు దిశలు వాయువులు మొదలైనవి ఉన్నాయి. అధిదేవతలు విషయానుభవంగలవై జీవుడి వెంటనే ఉంటాయి. ఈ దేవతలు జీవుడికి ప్రత్యక్ష బ్రహ్మానుభవం కల్గే వరకు విడవవు".

" అర్జునుడు స్థావర జంగమాత్మక జీవులు శరీరాభిమాన తేజస్సు నుండి జనిస్తున్నారు. వారు స్థూల దేహాలను విడుస్తున్నారు. సూక్ష్మ దేహం ధరిస్తున్నారు. ఆ తర్వాత సూక్ష్మదేహం ఏ విధంగా విడుస్తున్నారు స్వామీ? "

శ్రీకృష్ణుడు "తురీయుడి వలన ప్రాజ్ఞుడు ప్రాజ్ఞుడి వలన తేజసుడు క్రమంలో వారి వారి సంస్కార ఫలంగా కాలాన్ని అనుసరించి జనిస్తుంటారు. నోటికి ముక్కుకు మధ్యగల రంధ్రాల ద్వారా ప్రాణవాయువు దినానికి 21600 పర్యాయములు ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో బ్రహ్మధ్యానం చేస్తాడు. తత్ఫలితంగా బ్రహ్మ సాక్షాత్కార భాగ్యం కలుగుతుంది. అనంతరం అదృష్టమైన నివృత్తి లభిస్తుంది.

ఆ స్థితిలో ఆకాశం యోగి ప్రాణవాయువును గ్రహించి తన మహాకాశంలో లీనం చేసుకొంటుంది. అపుడు స్థూల సూక్ష్మ కారణ దేహాలు దాటి పోతాడు. అపుడు జీవుడు జీవ పరిధులు దాటి యోగికి గల ఆవరణలు దాటి దేవరూపం జెంది తురీయ పరమాత్మలో ఐక్యం పొందుతాడు. ఇది జీవ బ్రహ్మైక్య సంధాన క్రమం".

అర్జునుడు "ఈ విషయం అవగతమయింది. మరొకటి ఆకాశం బ్రహ్మాండ వ్యాప్తమై ఉంది. బ్రహ్మాండ వ్యాప్తమైంది అంటే జగమంతా వ్యాపించి ఉంది. లోపల బయటా అంతటా అపరిచ్ఛిన్న అవకాశమే ఆకాశం. ఇట్టి స్థితిలో ఈశ్వరుణ్ణి నిరంజనుడని చెప్పుట ఎంతవరకు సబబు ? నిరంజనుడనగా నిర్గత అంజనం గలవాడు. ఆవరణ లేనివాడు. అన్య ప్రకాశ నిరపేక్షకుడు కదా !"

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా ! ఆకాశం రెండు విధాలు. ఒకటి మహాకాశం. రెండవది పరిచ్ఛిన్న ఆకాశం. మహాకాశం అపరిచ్ఛిన్నమై సర్వత్ర ఉంటుంది. పరిచ్ఛిన్న జీవుల ఉపాధులలో ఉంటుంది పరిచ్ఛిన్న ఆకాశం.

కానీ ఈ రెంటిలోనూ ఆకాశ తన్మాత్ర భూతమైన శబ్దం సదా నివసించి ఉంటుంది. అంటే ఆకాశం యొక్క గుణం శబ్దం. బ్రహ్మం నిశ్శబ్దం.

అవకాశమంటే పరిచ్ఛిన్న పరిమిత అవకాశం. ఆకాశం బ్రహ్మ శరీరం. కానీ ఆకాశం బ్రహ్మ కాదు , బ్రహ్మం నిష్ప్రపంచం. అది అక్షరం. అంటే నాశనం

లేనివాడు. బ్రహ్మ సత్యం. ప్రపంచం అసత్యం. అంటే మిథ్య. సత్యంతో అసత్యానికి సంబంధం లేదు. కనుక బ్రహ్మం నిరంజనం నిర్మలం. బ్రహ్మం శబ్దాతీతుడు. శబ్దమయమైన ఆకాశంతో బ్రహ్మకు సంబంధం లేదు, అని గుర్తు పెట్టుకో.

అర్జునుడు " స్వామీ ! అకారాది దంత్య ఓష్ఠ్య తాలవ్య జిహ్వ ఊష్మాదులు నాశన స్వభావం కలవేకదా ! అక్షరాలు అంటారేమిటి ? అక్షరం అంటే నాశనం లేనిది కదా ! నశించే దానికి అక్షరత్వం ఆపాదించటం ఎలా సంభవం? వర్ణమాలలోని అక్షరాలు భాషా శాస్త్రంలో మూలకాలు. ఒక వాఙ్మయ అక్షరాలు అస్థిరాలే కానీ సుస్థిరాలు కావు. వర్ణమాలలోనివి అస్థిర వర్ణానికి అక్షరత్వం ఎలా కుదురుతుంది ? అనేదే నా సందేహం".

శ్రీకృష్ణభగవానుడు "నీవు వెలిబుచ్చిన భావం సమంజసమే. పూర్తిగా అర్థం చేసికో క్షరం అంటే నశించేది. అక్షరం అంటే నాశనం లేనిది. నాశనం లేనిది ఒక్క బ్రహ్మ పదార్థమే. పరబ్రహ్మం అవినాశి. అక్షరమూర్తి. అవ్యయ అనంత అప్రమేయుడు. అట్టి పరబ్రహ్మం వర్ణమాలలోని ఘోషాది వర్ణాలకు అతీతుడు. కరాదివ్యంజనాలకు చాలదూరం. అకారాది స్వరాలకు అంతు చిక్కడు. ఈ వర్ణాలు పుట్టిన తాలు కంఠ ఓష్ఠ్యాదుల యొక్క స్థానాలలో పుట్టలేదు స్వామి. స్వామి ఆ అన్నింటికీ అతీతం. ఆయన అక్షర ఫరబ్రహ్మం. అయితే కొందరు వాగ్దేవీ ఉపాసకులు భాషా శాస్త్రంలో వర్ణానికి అక్షరం అని నామకరణం చేశారు. వాక్కు దైవీ వరప్రసాదం కనుక భాషా మూలకాలకు అక్షరత్వం అర్హమని విశ్వసించారు. శాశ్వతత్వం ఆపాదించారు. వాక్కు అనంతం అవ్యయం కనుక అక్షరం అంటారు".

అర్జునుడు "చక్కని సమన్వయం కుదిరింది. మరొక ప్రశ్న. అడుగు తున్నాను. క్షమించుస్వామీ ! బ్రహ్మం సర్వత్ర అణువణువున నిండి ఉంది. సర్వ భూతాలలో నివసిస్తున్నది. అని యోగీంద్రులు గుర్తించి వక్కాణిస్తున్నారు. జ్ఞానానుభవ సిద్ధికి ఇంద్రియ నిరోధం ఎలా తోడుపడుతుంది? వివరించ ప్రార్థన?

శ్రీకృష్ణస్వామి "ఇంద్రియ నిరోధం వలన తన దేహదేవాలయం లోగల బ్రహ్మాన్ని సాక్షాత్కరించుకోగల్గు తున్నాడు. దేహం నష్టమైతే ఇంద్రియాలు బుద్ధి వగైరాలు కూడా నిలిచి యుండవు కదా!

ఇది భక్తుడు అభ్యాసం చేయటానికి దేహం చాలా అవసరం. బ్రహ్మం సర్వత్ర యున్ననూ వ్యక్తికి వ్యక్తం కావటానికి దేహంలోని ఈశ్వరుణ్ణి దర్శించాలి. అందుకు ఇంద్రియ నిరోధ అభ్యాసం చేయవలసి యున్నది.

ప్రత్యక్ష జ్ఞానం కలిగేంత వరకు సాధన చేస్తుండాలి. పరబ్రహ్మం క్షం అయిన తర్వాత ఇంద్రియ నిరోధ సాధన అవసరం లేదు. ప్రత్యక్షం

అయినపుడు ఆనందామృత పానం చేయటమే పని. అంతవరకు తత్త్వజ్ఞాన సాధన చేస్తుండ వలసినదే.

మానవ దేహాలు చిల్లుల కుండల వలె జ్ఞానసారాన్ని నిల్వ ఉంచుకోలేక పోతున్నాయి. ఇవి ఇంద్రియ నిగ్రహం లేని అవిటి కుండలే సుమా ! బ్రహ్మం స్వభావసిద్ధంగా పరిశుద్ధం. అయిననూ ఈ శరీర దోషం వలన బ్రహ్మం ఇందుండి కూడా స్వచ్ఛంగా ప్రకాశించటం లేదు. ఇట్టి పరిస్థితిలో మానవుడు ప్రతిబింబ దర్శనం చేసుకోకలిగి కూడ శుద్ధ ఈశ్వర బింబాన్ని తెలుసుకోలేక పోతున్నాడు. అపుడు అర్జునుడు కృష్ణస్వామితో-

స్వామీ !

తరణంబులు భవ జలధికి హరణంబులు దురితలతకు ఆగమములకా
భరణంబులా ర్త జనులకు శరణంబులునీ పదాబ్జ సంస్మరణంబుల్॥

అనగా కృష్ణుడిలా విశదపరచాడు.

పార్థా ! "పాడు దేహం మలిన భూయిష్టం. దేహి అత్యంత నిర్మలుడు. ఈ దేహతత్త్వం దేహితత్త్వం తెలుసుకొని దేనిని శుద్ధి చేయాలో ఆలోచన చేయండి. ఏదీ సాధ్యం కాదు. దేహం నిత్యం మలిన పదార్థాలను పుట్టిస్తూనే ఉంటుంది. ఇది జలాలతో శాశ్వతంగా శుద్ధం చేయలేము. దేహిని శుద్ధం చేయవలసిన అవసరమే లేదు. దేహి నిత్య పరిశుద్ధుడు. ఇక అతనికి శౌచాదు లేల! ఏదీ చేయనవసరం లేదు. ఒక్క ఈశ్వర ధ్యానం చేసి తత్కృప పొంది జ్ఞాన సిద్ధిపొందు.

అర్జునా ! ఒక చిన్న విషయం. పరా-పశ్యంతి-మధ్యమ-వైఖరి వాక్కులో నాల్గు భేదాలు. ఇవి సర్వ ప్రపంచాన్ని పాలిస్తున్నాయి. 'పరావాక్కు' వృక్షాదులలో ఉంది. పశ్యంతివాక్కు భుజాలలో పని చేస్తుంది. 'మధ్యమా వాక్కు' జంతువుల ముఖాలలో ఉంది. 'వైఖరి వాక్కు' మానవ ముఖంలో ప్రకాశిస్తుంది. ఇదీ విషయం.

ఇది మహాభారత అశ్వమేధ పర్వంలో శ్రీ కృష్ణార్జున సంవాద రూపంలో గల బ్రహ్మ విద్య, ఉత్తరగీతలో ప్రథమ అధ్యాయం ఇది.

2

# ఆత్మ

## ద్వితీయ అధ్యాయము

ఆది మధ్యాంత రహిత మనాది యగుచు
చావు పుట్టుక లేకుండ చంపబడక
అంతటను సర్వసాక్షియై ఆత్మయుండు
ఆత్మయే బ్రహ్మ - బ్రహ్మమే ఆత్మ యగును

– శ్రీ సత్యసాయిబాబా

అర్జునుడు కృష్ణ భగవానుడి పాదపద్మాలకు ప్రణామాలు చేసి ఈ విధంగా సంప్రశ్న చేశాడు.

భగవాన్ ! జీవాత్మ పరబ్రహ్మాన్ని సర్వవ్యాపిగా పరంధాముడుగా సర్వగతుడుగా తెలుసుకొని నేనే బ్రహ్మం అని ఎట్లు చెప్పగలడు ? ఆ బ్రహ్మంలో ఎలా ఐక్యం అవుతాడు ? వివరించండి–

పరంధాముడు మధుర మందహాసం చేసి ఇలా వివరించసాగాడు.

" పార్థా ! నీ సందేహం సహజమే విను– అవిద్యా ఆవరణలో గల జీవాత్మకు పరిశుద్ధ పరమాత్మకు భేదం కనిపిస్తుంది. జీవాత్మ యొక్క పుణ్య విశేషం చేత సంస్కార ప్రభావం చేత ఈశ్వర సత్కృపా బలం చేత కొంత కాలానికి అవిద్య నివృత్తి అవుతుంది. అంతట జీవాత్మ పరమాత్మలో జలంలో జలం, క్షీరంలో క్షీరం, ఘృతంలో ఘృతం భేదం లేకుండా కలిసిపోయినట్లు ఐక్యమైపోతాడు. జీవాత్మ పరమాత్మయై భాసిస్తాడు.

ఈ ఐక్య సంధానానికి బ్రహ్మనిష్ఠ గల సద్గురువు చాలా అవసరం. ఆ గురుదేవుడు మహాదేవుడై శిష్యుడికి 'తత్త్వమస్యాది' ప్రమాణ వాక్యాల చేత ఈశ్వర ఐక్య సంధానం గూర్చి చక్కగా వివరిస్తాడు. ఆ గురూపదేశ ప్రభావం చేత ఈశ్వర కృపా కటాక్షం చేత శిష్యుడైన జీవాత్మ ఈశ్వరుణ్ణి సర్వవ్యాపి పరంజ్యోతి అని తెలుసుకొని ధ్యానం చేసి ఏకాగ్రచిత్తుడై కృతార్థుడవుతాడు. తాదాత్మ్యం చెందుతాడు."

అర్జునుడు "మహానుభావా ! సాధకుడైన జ్ఞాని జ్ఞానం వలన లక్ష్య భూతుడైన ఈశ్వర మూర్తిని దర్శించి ముక్తుడైన తదుపరి ఇక యోగధారణ అవసరం లేదుకదా ! "

శ్రీ కృష్ణ పరమాత్మ – "నీవు భావించింది మంచిదే. జ్ఞానంలో అనేక తరగతులున్నాయి.స్వచ్ఛమైన పరిశుద్ధ తత్త్వ జ్ఞానం వలన జీవాత్మలోని నిశ్చయాత్మక బుద్ధి వికసించి విశాలమైన బ్రహ్మంలో కలసిపోతుంది. అపుడు బ్రహ్మజ్ఞానాగ్ని జ్వలిస్తుంది. ఆ జ్ఞానాగ్ని వలన పండితుడి లోని కర్మబంధాలు భస్మమైపోతాయి.

ప్రత్యక్ష అనుభవ జ్ఞానం కలిగే వరకు అంతఃకరణ వృత్తి నాశనం కాదు. అంతః కరణ వృత్తి నాశనం కొరకే యోగం కావాలి. స్వామి ప్రత్యక్షం అయిన తర్వాత యోగధారణ అవసరం లేదు.

బ్రహ్మజ్ఞానం కలిగి బ్రహ్మ సాక్షాత్కారం సిద్ధించిన, నదీజలం సముద్రజలంలో కలిసిపోయినట్లు జీవాత్మ పరమాత్మలో ఐక్యమై పోతాడు కదా! బ్రహ్మజ్ఞానమే తత్త్వ జ్ఞానం. ఈ జ్ఞానం వలన ఈశ్వర తత్త్వం తెలుస్తుంది. ఈశ్వర తత్త్వ స్వరూపమే బ్రహ్మజ్ఞానం. అది పరమ పవిత్రం. నిర్మలం. అది అఖండం అనంతం అద్వైతం. అది పరమేశ్వర నామంతో విరాజిల్లుతోంది. అది పరిశుద్ధమై స్వచ్ఛమై వెలుగు అంబరం వంటిది.

అర్జునా! ఆత్మ ఆకాశం వలె అతి విశాలమైనదే. అతిసూక్ష్మ తత్త్వం గలది. ఆత్మ కంటికి కనిపించే వస్తువు కాదు. ఆ విధంగానే అంతరాత్మ వాయువువలె దృగ్గోచరం కాదు. నిర్మలమైన ఆత్మ బాహ్యాభ్యంతర వ్యాసంగాలు గలవారికి తెలియబడదు. అయిననూ యోగి వేదాంత జన్య ప్రత్యక్ష జ్ఞాన కాంతి చేత అంతరాత్మను దర్శిస్తాడు. సర్వం తెలుసుకోగల్గుతాడు.

జ్ఞాని ఎప్పుడు ఎక్కడ తనువు చాలించినా ఆకాశం అవకాశం వలె సర్వ వస్తువులలో వ్యాపించి యున్నట్లుగా పూర్ణాత్మలో కలిసి పోతాడు. ఘటం పగిలి పోగానే ఘటంలోని ఆకాశం మహాకాశంలో కలిసి పోతుంది కదా ! జ్ఞాని మరో జన్మ యెత్తకుండా పరమాత్మలో ఐక్యమైపోతాడు. ఆకాశం సర్వత్రవ్యాపించి

యున్నట్లుగా జీవాత్మ పరమాత్మలో కలిసి నిర్మలంగా నిశ్చలంగా పరిశుద్ధంగా సర్వత్ర వ్యాప్తి చెందుతాడు. పునరపి జననం అనేదే లేదు.

## యోగ విధి

అర్జునా ! యోగం గూర్చి వివరిస్తాను. శ్రద్ధగా విని అభ్యాసం చేయటానికి సిద్ధపడు. ఇదినీకు ఇష్టమైన విషయం కదా ! విజయా ! నాసిక యొక్క అగ్రభాగాన మనస్సును కేంద్రీకరింపజేసి తత్త్వం గూర్చి లక్ష్య సాధనకై ధ్యానం చేసేవాడు గత నూరు జన్మల పాపపంకిలం కడిగి వేసుకో గలిగిన వాడవుతాడు. ఇది ఖేచరీ విధానం అని అంటారు.

ముక్తి మార్గాలు రెండు. ఒకటి సద్యోముక్తి, రెండోది క్రమముక్తి. సద్యోముక్తి కేవలం పరమేశ్వరానుగ్రహ ఫలం. క్రమముక్తిలో రెండు పద్ధతు లున్నాయి. ఒకటి అర్చిరాది మార్గం. ఇది పునారావృత్తి రహితమైనది. రెండవది ధూమాదిమార్గం. ఇది పునరావృత్తి గలది. అంటే మరల మరల జనన మందటం తప్పదు. దేహంలోని దక్షిణ భాగంలో అగ్ని మండలం గోచరిస్తుంది. ఇది పుణ్య కర్మఫలంతో ప్రకాశిస్తుంటుంది. ఇది పంగళనాడీగమనం. దీనిని దేవయాన మార్గం అంటారు. ఇది పునరావృత్తి రహితం. దేహంలోని ఎడమ భాగంలో ధూమ మండలం వ్యాప్తమై ఉంటుంది. ఇది నాడీ గమన మార్గం. వామ నిశ్వాస యానం. ఇచ్చట చంద్ర మండలం గోచరిస్తుంది. దీనిని ధూమాది మార్గమనీ పితృయాన మనీ అంటారు.ఇది పునర్జన్మను కలుగచేస్తుంది. ఇది మూలాధారం నుండి బ్రహ్మ రంధ్రం వరకు వ్యాపించి ఉంది.

మనిషి వెనుక భాగంలో ఒక ఎముక వీణవలె ఉంటుంది. దీనిని వెన్నెముక అని బ్రహ్మ దండి అనీ అంటారు. ఇది దేహాన్ని సరియైన రీతిలో నిలబెడుతుంది. దీనికి మరోపేరు సుషమ్నానాడి. ఇది జీవ బ్రహ్మైక్య సాధనం. ఈ సుషుమ్న లోపల అతి సూక్ష్మ రంధ్రాలు అనేకం ఉన్నాయి. సుషుమ్న ఇడా పింగళా నాడుల మధ్య భాగంలో కుండలినీ శక్తి ఉంటుంది. దీని అగ్రభాగాన బ్రహ్మజ్యోతి సదా వెలుగుతూంటుంది. ఇది సర్వాత్మకం – సర్వవ్యాపకం. ఇది విశ్వతోముఖం. ఈ సుషుమ్నలో సూర్య చంద్రాగ్నులు దేవతలు చరాచర భూతాలు భువనాలు దిశలు క్షేత్రాలు సప్త సముద్రాలు మహామేరు పర్వతాలు పద్మరాగాది శిలలు ద్వీపాలు పుణ్యనదీ ప్రవాహాలు, చతుర్వేదాలు, షట్ శాస్త్రాలు కళలు అకారాది స్వరాలు కకారాది వ్యంజనాలు మంత్ర రాజాలు పురాణ సాహిత్యాలు త్రిగుణాలు సర్వ వస్తు బీజాలు పంచ వాయువులు మొదలైన వన్నీ ఉన్నాయి. సర్వ జగత్తుల సంకల్ప స్థానం సుషుమ్న.

ఈ సుషుమ్న సర్వనాడులకు మూలస్థానం. ఇది ఊర్ధ్వ మూలం కలిగి వివిధ దేవమనుష్య పశు పక్ష్యాది జన్మలకు శాఖావలయమై శక్తి సమన్వితమై ఉంటుంది. ఇది పంచ వాయువులకు ఉత్పత్తి స్థానమై ఉంటుంది. ఇది జగత్తుకు ఉపాదాన కారణం. బ్రహ్మోపాసనకు అనుకూలమైనది. ఇది అన్ని నాడులకు రాజువంటిది.

ఇందులో వాయుసంచారం కొరకు డెబ్బది రెండు వేల నాడులు పని చేస్తుంటాయి. ఇవి కర్మ మార్గం ద్వారా పునరావృత్తిని కలిగిస్తాయి. ఇవి సుషిరవంతాలు. తిర్యగ్భూతాలు. ఈ నాడులు క్రిందికీ పైకీ వ్యాప్తమై యున్నాయి. సాధకుడు ప్రాణాయామం వలన కొన్ని నాడులు అడ్డగించి ప్రాణశక్తిని అధికం చేసి సుషుమ్న బలంతో ఊర్ధ్వగమనం సాధిస్తాడు. సుషుమ్న సాధన చక్కగా సాగించిన సాధకుడు బ్రహ్మసాక్షాత్కారం బ్రహ్మైక్యం పొందకల్గుతాడు. వాయు ప్రసారం వాయు నిరోధం వాయుక్రమ గమనం నేర్చిన యోగికి సర్వసిద్ధులు లభిస్తాయి.

ఈ సుషుమ్న ఒక అద్భుత ఆత్మ ప్రపంచం. ఈ సుషుమ్నలో తూర్పున ఇంద్రుని 'అమరావతి' మధ్య హృదయ స్థానంలో అగ్ని దేవుని నగరం 'తేజోవతి' దక్షిణ శ్రవణం దగ్గర యముని 'సంయమినీ పురం' వామ శ్రవణం వద్ద 'నైరుతి పట్టణం' పడమటి దిక్కున వరుణదేవుని 'విభావతి' వామ కర్ణభాగంలో వాయుదేవుని 'గంధవతి' ఉత్తరదిశలో కంఠంనుండి ఎడమ చెవి వరకు కుబేరుడి 'పుష్పవతి' ఆ సమీపంలోనే 'చంద్రనగరం' వామనేత్రం దగ్గర శివుడి 'మనోన్మని' శిరస్సు మధ్య సహస్రారం వద్ద 'బ్రహ్మపురం' విరాజిల్లు తున్నాయి. ఈ విధంగా అన్ని దేవతా పట్టణాలు బ్రహ్మాండ ఉపకరణాలు అన్నీ మానవుడి సుషుమ్నలో ప్రకాశిస్తున్నాయి. అన్నీ ఈ దేహంలోనే ఇమిడి ఉన్నాయి. యోగి గుర్తిస్తాడు. తనలో ఉన్నవి సాధారణ మనిషి తెలుసుకో లేడు. సాధకుడైన భక్త సత్తముడు బ్రహ్మాండం తనలో ఉన్నట్లే భావించి తానొక విరాట్పురుషుడైనట్లు ఈశ్వరుణ్ణి అనుగ్రహమూర్తిగా ధ్యానిస్తుండాలి.

అర్జునా ! ఇట్టి ఉత్తమ సాధకుడి పాదాలక్రింద అనంతుడైన శివుడున్నాడు. ఆ శివుడే కాలాగ్నిరుద్రుడు. లోపల బయటా క్రింద పైన నడుమా అనామయ రూపంలో మంగళాత్మక శివరూపం బ్రహ్మమై నిండి ఉన్నది. మానవ శరీరంలోనే సప్తపాతాళలోకాలున్నాయి. అంటే పాదాల క్రింద అతలం, పాదాలలో వితలం, మడమలందు నితలం, జఘనంలో సుతలం, జానువులలో మహాతలం, ఊరువులందు రసాతలం, కటి ప్రదేశంలో తలాతలం. ఈ ఏడు లోకాలు యోగి పాదాలపైన క్రింద ఉన్నాయి. ఇవి అధోలోకాలు.

మనిషి నాభికి అధో భాగంలో 'మహాపాతాళం' ఉంది. అది ఘోర భయంకర ప్రదేశం. ఇక్కడే మహా కాలాగ్ని జ్వలిస్తుంటుంది. శేషుడు ఈ ప్రదేశంలో ఉండి పరిపాలిస్తుంటాడు. ఇది కుండలాకారంలో కన్పిస్తుంది. ఇది శేషవలయం. ఇదే కుండలినీ ప్రదేశం.

నాభి ప్రదేశం భూలోకం, కుక్షి భువర్లోకం, హృదయం స్వర్గం ఇక్కడే సూర్యచంద్ర గ్రహాలుంటాయి. ఈ హృదయ స్థానాల్లో నక్షత్రాలు బుధుడు శుక్రుడు ధ్రువుడు సంచరిస్తుంటారు. యోగి సాధనా బలంతో సమస్త సుఖాలు పొందుతుంటాడు. ఆహృదయంలోనే మహర్లోకం, కంఠంలో జనోలోకం, భ్రూమధ్య తపోలోకం, సహస్రారంలో సత్యలోకం దర్శించి యోగి బ్రహ్మాండ దేహధారియై విశ్వ విరాట్పురుషుడు తానేనని అద్భుత లీలలు చూస్తూ చూపిస్తుంటాడు.

బ్రహ్మాండ చక్రంలో పృథ్వి జలంలోను, జలం అగ్నిలోనూ, అగ్ని వాయువులోనూ, వాయువు ఆకాశంలోనూ, ఆకాశం మనస్సులోనూ, మనస్సు బుద్ధి చిత్త అహంకార క్షేత్రాలలోనూ, ఇవి అన్నీ పరమాత్మలోనూ క్రమంగా ఐక్యమవుతుంటాయి. ఇలా ఒకదానిలో ఒకటి లయమై అన్నీ పరమాత్మ అంశయైన జీవాత్మలో విలీనమై జీవాత్మ పరమాత్మగా మార్పు చెందుతాడు. ఈ విధమైన సాధనాక్రమంలో ఉత్తీర్ణుడైన వాడు నేనే బ్రహ్మను అని నన్ను గురించి తపించి జపించినచో అనేక జన్మలలో చేసిన పాపసముద్రాలు దాటి సత్యలోకాలకు వచ్చి నాలో జేరి పూర్ణత్వం పొందుతాడు. ఘటం విచ్ఛిన్నమై ఘటాకాశం మహాకాశంలో ఐక్యమవు తుంది. ఆ విధంగా దేహోపాధిచేత చిన్న ఆకాశంలోని జీవుడు  సంస్కార సాధనా బలం వలన దైవకృపాకటాక్షం చేత దేహం విడిచి పరమాత్మ అవుతాడు. ఈ యథార్థం తెలిసి యోగి నిరాలంబ జ్ఞానం పొంది సాలోక్యం జేరుకొంటాడు. ఇందులో సందేహం లేదు. అర్జునా ! కొన్నివేల యేండ్ల తపస్సు ధ్యానయోగంలోని పదహారవ అంశకు సమానం కాదు. కనుక నీవు ధ్యానయోగం అవలంబించు. ఈ ధ్యానయోగం అన్ని రకాల పాతకాలాను దూదిని అగ్ని దహించినట్లు నాశనం చేస్తుంది. నాలుగువేదాలు వివిధ శాస్త్రాలు చదువుకొన్న మహా పండిత ప్రకాండుడైనా బ్రహ్మతత్త్వం తెలుసుకోలేనిచో క్షీర పాత్రలోని గరిటవలె బ్రతుకును నిరర్థకం చేసుకొంటాడు. గరిట వంట పాత్రలో ఎంత తిరిగినా పాకరుచి ఎరుగదు కదా! బ్రహ్మను భవం పొందని వాడు ఇనుపగరిటతో సమానం.

మంచి గంధపు చెక్కలు మోయు గాడిద మోత బరువు ఎరుగు గానీ సువాసన ఎరుగదు. అట్లే నానా శాస్త్ర పాండిత్యమెరిగి పరమ వస్తువైన బ్రహ్మం

తెలుసుకోలేని పండితుడు గార్ధభంతో సమానం. కనుక బ్రహ్మ తత్త్వం తెలుసుకొనేంత వరకు ఎన్ని చేసినా విద్యార్థియే సుమా ! అంత వరకు ఎంతటి వాడైనా ధర్మ విధులు చేస్తుండ వలసిందే.

ఆహార నిద్రా భయమైథునాదులు పశువులకు మనుష్యులకు సమానమే. జ్ఞానం గలవాడే మనిషి. జ్ఞానం లేనివాడు పశుతుల్యుడే. ప్రాణి కోటికి ప్రాతః కాలం మలవిసర్జన బాధ, మధ్యాహ్నం క్షుత్పిపాస బాధ, సాయంకాలం కామబాధ, రాత్రి వేళ నిద్రకై బాధ సహజం.

గోవులు రంగురంగుల దేహాలతో వేరు వేరుగా యున్నా వాటిలోని పాలు ఒకటిగా తెల్లగా స్వచ్ఛమైన శ్వేతంగా ఉంటాయి. అట్లే మానవులు వేరు వేరు రంగులలో జాతులలో యున్నా మానవత్వం అనే జ్ఞానం సమానం. అది ఉన్నవాడే మనిషి. 'నేను బ్రహ్మం' అని తెలుసుకొని నియమ బద్ధులైన యోగులు మోక్షం పొందుతున్నారు. ఇది నాది అనుకొనే మనిషి మాయా బంధంలో బంధితుడవుతున్నాడు. ఇది నాది కాదు అనుకొన్న వాడు బంధవిముక్తుడవు తున్నాడు. 'నాది-నాదికాదు' అనే పదాలే బంధ మోక్ష హేతువులు. మనస్సు సంచరిస్తున్నంత వరకు మోక్షం కలుగదు. మనస్సు లయం చెందినపుడే మోక్షం ప్రాప్తిస్తుంది. ఆకలిగొన్నవాడు ఆకాశాన్ని గుద్దితే ప్రయాసమేకాని ప్రయోజనం లేదు. ఆకలితీరదు. ఫలం దక్కదు. ప్రయాసమాత్రమే దక్కుతుంది. అట్లే ఎన్ని చదువులు చదివినా వేద శాస్త్రాలు వల్లించినా 'బ్రహ్మత్త్వం' ఎరుగనిచో అట్టి బుధుడు వ్యర్థుడే సుమా!

ఇది మహాభారత అశ్వమేధ పర్వంలోనిది
దీనికి ఉత్తరగీత – బ్రహ్మ విద్య అనిపేర్లు
ఇది శ్రీకృష్ణార్జున సంవాదం. ద్వితీయ అధ్యాయం.

విశ్వచింత సేయు విజ్ఞాన జీవుడు –
విష్ణుచింతసేయు విబుధవరుడు
ఒకడు విశ్వమొందు ఒకడు విష్ణువు బొందు
సకలశ్రుతుల మాట సాయిమాట.

– శ్రీసత్యసాయిబాబా

3

# ఉపాసన

## తృతీయ అధ్యాయం

చావు పుట్టుక లేనట్టిశాశ్వతుండు
ఆది మధ్యాంత రహితు డనాది వాడు
తాను పుట్టక చావక చంప బడక
ఆత్మరూపుడై తానదె వెలసియుండు

– శ్రీ సత్యసాయిబాబా

శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికీ విధంగా తత్త్వసారం ఉపదేశిస్తున్నాడు–

అర్జునా ! శాస్త్రాదులు అనంతంగా పెరిగి పోతున్నాయి. భాష్య గ్రంథాలు అనేకంవచ్చాయి. ఈ శాస్త్ర పరిశీలనకు మానవ ఆయుష్కాలం చాలదు. వేద శాస్త్రాలు అర్థం చేసుకోవటం చాలా కష్టం. కనుక హంస పాలనీరులలో నీరు వేరుచేసి పాలను మాత్రం స్వీకరించినట్లు ఉత్తమ మానవుడు ఉపాసనకు తగిన పరమ విషయం గ్రహించి మిగిలిన విషయాలు విడిచివేయటం శ్రేయస్కరం సుమా !

వేద పురాణ భారతేతిహాసాది శాస్త్రాలు దారా పుత్రాది సాంసారిక విషయ బంధాలు త్యజించి భక్తుడైన యోగి నిగ్రహం కలిగి ఉపాసిత విషయాన్ని ఉపాసించటం చాలా మంచిది. 'ఇది జ్ఞానం' అనీ ఇది తెలుసుకోదగిన జ్ఞేయ వస్తు వనీ వ్యక్తి సయంగా తెలుసుకోవటం చాలా కష్టంతో కూడిన పని. కనుక జగద్గురువును శరణువేడి స్వామి కృపా కటాక్ష బలంతో తెలియగోరటం చాలా అవసరం. అక్షర తన్మాత్రమైన ఆత్మదీప్తి తెలుసుకొని జీవితం చంచలం

క్షణభంగుర మనీ ఎరిగి శాస్త్ర ఆధారంగా సత్యవస్తువును గుర్తించి ఉపాసించ వలసియున్నది.

జిహ్వ ఉపస్థలను జయించినవానికి లోకంతో పనియేమి ఉంది ? అట్టి జిహ్వ ఉపస్థలు జయించిన వాడు జితేంద్రియుడై పరమాత్మ సేవలో తల్లీనుడై పరమాత్మ అవుతాడు సుమా ! ఆత్మజ్ఞానం గల ఆత్మధ్యాన తత్పరులు తోయ రూపంలోని తీర్థాది క్షేత్రాలను పాషాణ మృణ్మయ విగ్రహ రూపంలోని దేవమూర్తులని సేవింపరు. వారు ఆత్మ విద్యా విదులైన వారు. ఆత్మ స్వరూపుడైన పరమాత్మను ధ్యానిస్తూ తాదాత్మ్య సిద్ధి కోరుకొంటుంటారు. ఆశ్రమ ధర్మాల ననుసరించి బ్రాహ్మణులకు అగ్ని దైవం. మునీంద్రులకు హృదయమే దైవం. అల్పులకు ప్రతిమలు దేవతలు. తత్త్వ విదులకు ప్రతి వస్తువు దైవమే. వారు సర్వత్ర సమదృష్టి కలిగి సర్వం విష్ణుమయంగా భావించి ఉపాసిస్తుంటారు.

అంధులు సూర్యోదయాది పవిత్ర దృశ్యాలు చూడ జాలని యట్లే జ్ఞాన చక్షువులు లేనివారు సర్వత్ర యున్న పరబ్రహ్మను దర్శింపలేరు. జనార్దనుణ్ణి పూజింపలేరు. నిర్వికార శాంతమూర్తిని స్మరింప లేరు.

జ్ఞాన యోగులు మనోలయం జరిగినచోట ఆత్మ ప్రకాశించిన చోటల్లా పరమపదం దర్శిస్తారు. పరమపదంలో సమదర్శి సమవర్తియైన పరమాత్మను పొంది తాదాత్మ్యనం చెందుతారు. 'నేను సమదర్శిని' అని అనుభవంలోకి తెచ్చుకొన్న యోగికి విశ్వంలో ఎన్ని విలాసవినోద విలయ దృశ్యాలున్నా విశ్వం స్వచ్ఛమైన ఆకాశంవలె కనిపిస్తుంది. ఆయోగి పుంగవునకు సర్వత్ర నాశనంలేని సర్వేశ్వర మూర్తి సర్వవ్యాపకుడై దర్శనమిస్తాడు. వివిధ నామ రూపాత్మక విశ్వం ఈశ్వర స్వరూపంగా అతనికి దర్శన మిస్తుంది. ఆ ఉత్తముడు చలించని భక్తితో సదా సద్బ్రహ్మ పదార్థాన్ని భావన చేస్తుంటాడు. అణువణువున అచ్యుత స్వామిని చూడగల్గుతాడు. ఆ భక్తుడికి ప్రతివాడూ భగవంతుడే. ఆరాధనీయుడే. హంసరూపుడైన జీవాత్మ బ్రహ్మధ్యాన తత్పరుడై తేజోరూపమై, కలాతీతమై, స్వర్గమై, సూక్ష్మమై, మోక్షమార్గమై, సుఖాత్మకమై, ఉత్కృష్టమై, నాశరహితమై, హంస రూపమై, పరమమై, అవ్యయమై, సర్వ వ్యాపకతేజమై, పరిపూర్ణ జ్యోతి స్వరూపమై, ఆకాశమై, సర్వ భూతాంతరాత్మయై పరమాత్మయై ప్రకాశిస్తుంటాడు.

'అహం బ్రహ్మోస్మి' అని ధ్యానం చేస్తూ క్రమంగా జీవాత్మ సాధనా బలం వలన ఈశ్వర కృపావిశేషం వలన బ్రహ్మోత్మయై బ్రహ్మలో తాదాత్మ్యం చెందుతాడు. నేను బ్రహ్మం అని తెలుసుకొన్నవాడు ఏదయినా చేయవచ్చును. ఏదయినా తినవచ్చును. ఆ మహా పురుషునకు విధి నిషేధాలు లేవు. ఆ యోగికి ఏ కోరికలు లేవు. దేనిని నిషేధించడు. జితేంద్రియుడు, పూర్ణకాముడు, నిష్కాముడు,

నిష్కల్మషుడు, నిర్మలుడు, ఏ కర్మలు చేసినా కర్మ ఫలాలు అతనికి చెందవు, సర్వం భుజిస్తాడు.

ఆ ఋషికి సకల జగద్వ్యాపారాలు మిథాభూతాలు. అతడు త్రిగుణాతీతుడు.

అర్జునా ! శీతోష్ణాది ద్వంద్వాలు సహించి కేశవస్వామిని నిశ్చల భక్తితో ధ్యానం సలిపిన వానికి ఇతర లౌకిక భోగాలతో వైభవాలతో ప్రయోజనం ఏముంది? ఇట్టి స్వాత్మ అనుభవ సుఖం మోక్షాన్ని అపేక్షిస్తుంది కానీ విషయాంతర సుఖాలు అపేక్షించదు కదా!

మోహంక్షయమై మోక్షం కోరుకొనే యోగి దేహ రక్షణకు భిక్షమాత్రం కోరుకుంటాడు. శీతల బాధ సహించటానికి చినుగు పట్టిన జీర్ణవస్త్రం మాత్రం స్వీకరిస్తాడు. ఆ మహా యోగి సమదర్శియై పాషాణాన్ని బంగారాన్ని సమంగానే భావిస్తాడు. దొరికిన భిక్షను పంచ భక్ష్య భోజనంగా ఆరగించి సంతృప్తి చెందుతాడు. దేనికీ శోకించదు ఉప్పొంగి పోడు. ఆయోగి సమవర్తి. జన్మ రహితుడు.

పరమహంస స్వీకరించు భిక్షాహారం నిరాహారం వంటిది. భిక్ష ప్రతి గ్రహం కాదు. భిక్ష సద్గృహం నుండి గానీ దోషి గృహం నుండి గానీ స్వీకరించిననూ దోషం యతీశ్వరునికి అంటదు. ఈశ్వర నామంతో అది పవిత్రీ భూతమవుతుంది. అది గోక్షీరం యట్లే పవిత్రవస్తువు. ఎచట ఎవరు స్పృశించిననూ దోషం లేదు. పెనుచలి బాధకు ఏ చినుగు దుప్పటి కప్పు కొనిననూ యతికి హోదా తగ్గదు. విష్ణుభక్తి గల యతికి లౌకిక భోగాలతో పనేమి ఉంది ? సమాజంలో గృహస్థులు బ్రహ్మవేత్తను అర్చించి సంతృప్తి కలుగ జేసినచో జగత్తును సంతృప్తి చేసినంత పుణ్యం పొందుతారు. బ్రహ్మ వేత్తకు ఏ కొంచెం దానమిచ్చినా అనంత పుణ్యం లభిస్తుంది. పరమ హంసను యథాశక్తి పూజించి సంతృప్తి పరచినచో దాతకు పదితరాల పూర్వులు భవిష్యత్తులోని పదితరాల వారు పాపాలు పోగొట్టుకొని పవిత్రులవుతారు. పరమహంస విందు స్వీకరించి శ్రీ మహావిష్ణువు విందారగించినట్లే విష్ణుస్వరూపుడైన భక్తుడు తృప్తుడైన మూడు లోకాలు సంతృప్తి చెందుతాయి. ఇది శాస్త్ర ప్రమాణ వచనం. యోగియైన భక్తవర్యుడికి ఏ కించిత్తు దానం చేసినా అది అనంత పుణ్యం ప్రసాదిస్తుంది. ఆ పుణ్యరాశిని మేరువు తోనూ మహాసాగరంతోనూ పోల్చారు.

సూర్యదేవుడు ఎన్ని రసాలను స్వీకరించినా, అగ్ని దేవుడు సర్వ వస్తుజాలాన్ని భక్షించినా సూర్య దేవులకు అజీర్ణవ్యాధులు సోకవు. ఆ విధంగానే భక్తుడైన ఉత్తమయోగి ఎక్కడ తిరిగినా ఏ విషయాలు స్వీకరించినా ఏవి

భుజించినా ఏవి అనుభవించినా శుభ అశుభదోషాలు ఆ మహాత్మునికి చెందవు.

ఉపాసకుడు శబ్దబ్రహ్మాన్ని పరబ్రహ్మాన్ని అవగాహన చేసుకోవలసి యున్నది. ఈ రెండు తత్వాలు అవగాహన చేసుకొన్న సమర్థుడైన ఉపాసక వర్యుడు శబ్ద బ్రహ్మం ద్వారా పరబ్రహ్మాన్ని చేరుకొంటాడు. ధ్యానయోగం అనే హోమగుండంలో ధర్మ గుణాలు అనే సమిధలు వేసి ఉత్కంఠ అనే వాయువుతో యోగాగ్నిని ప్రజ్వలనం చేయాలి. దీని వలన కాలాంతరంలో పేరుకొన్న కర్మ బంధాలు దహింపబడతాయి. కనుక ధ్యాన యోగం ముందు కూర్చో.

జీవ బ్రహ్మలకు భేదం కలదనేయోగి ముక్తి పొందలేడు. సర్వ జీవకోటిలో బ్రహ్మం సమంగా భాసిస్తున్నదని గుర్తించిన వాడికే ముక్తి ధనం లభ్యం. ఇది బ్రహ్మ సూత్రాది ఉపనిషత్సారం.

ఈ జగత్తు సాలెపురుగు పొట్టనుండి వచ్చు దారం వలెనూ, తామర తూడులోని నూలుతోను పోల్చబడింది. పరమేశ్వర సంకల్పంతో ఏర్పడిన వలవంటిదీ ప్రపంచం. అది సూక్ష్మమైన గాలితాకిడికి తెగిపోతుంటుంది. కనుక ఈ ప్రపంచ స్థితి గతులను లీలా మాత్రంగా చూస్తూ దీనికై ఎట్టి చింతలూ పెట్టుకోకూడదు. యోగి సర్వచింతలు విసర్జించి నిర్మలంగా నిశ్చింతగా శాంతంగా ధ్యాన స్థితిలో అచలుడై ఉండాలి. ఆ పురుషుడికి సుఖదుఃఖాలుండవు. సర్వ గుణాతీతుడై ఈశ్వర సన్నిధానం చేరుకొంటాడు.

పరమహంస సాధన దశలో జన సంపర్కాన్ని పాము విషం వలె భావించాలి. స్త్రీ సంసర్గాన్ని తలంచరాదు. లౌకిక సుఖాలు యోగికి దుః ఖదాయకాలు. కనుక జితేంద్రియుడైన యోగి సాధన క్రమంగా సాగించిన ముక్తి రాజ్యంలో రాజవుతాడు. యోగీంద్రుడు నిత్యమూ సత్యమూ శాశ్వతమూ అయి వెలుగు పరబ్రహ్మాన్ని అచల దృష్టితో ధ్యానిస్తుంటాడు. సర్వ ప్రపంచాన్ని సదాశివ యోగి సమాన దృష్టితో ప్రేమిస్తుంటాడు. ఆ యోగి రాజుకు గతించిన కాలంలోని వస్తు ప్రపంచాన్ని గూర్చిన చింత అసలుండదు. భవిష్యత్తులో మరేదో చేయాలనే సంకల్పాలుండవు. సదా సదాశివుణ్ణి చింతిస్తూ సర్వం శివలీలగా తలపోయటమే ఆయన పని. సర్వదా సంతృప్తిగా ఉండటమే ఆయన నేర్చినది. ఆసక్తి లేనివానికి అసలు దు.

ఉత్తమ యోగీంద్రుడు జగత్తులోని జనన మరణాలు జాతి, కుల గోత్రాలు సంఘ నియమ నిబంధనలు తెలిసికొని వీటి నన్నింటికీ అతీతంగా తనను భావిస్తాడు. ఈ జగత్తుకు కారణభూతుడైన పరబ్రహ్మను తనలో వెలుగు బ్రహ్మగాతలంచి మౌనంగా సర్వం సమదృష్టితో తిలకిస్తుంటాడు. సత్య స్వరూపమై,

చైతన్య పూర్ణమై, అఖండమై, అద్వైతమై, దృశ్య ప్రపంచ రహితమై, నిర్వికారమై, నిర్మలమై, పరిశుద్ధమై, అక్షరమై, శివంకరమై, వెలుగు అపర బ్రహ్మం నాఆత్మయేనని తనలోనే అన్ని రూపాలు సోపానాలుగా అనుభవంలోకి తెచ్చుకొని పరమజ్ఞానం కలిగి మౌనం వహించి సర్వం సమ దృష్టితో తిలకిస్తూ స్థాణువుగా ఈశ్వర చింతనలో ఉండి పోతాడు.

సర్వ సంపూర్ణమై, అద్వయమై, అఖండ జ్ఞాన ప్రసారమై జ్యోతి స్వరూపమై, జగత్తుకు వేరుకాని మహా రసైక వస్తువై, ఎప్పుడూ వెలుగొందు జ్యోతి స్వరూపమై పరంజ్యోతియై, ఆజ్యోతి నా అంశయే గదా! లేక అందుండి ఉద్భవించి అంతవాడనైనది నేనే కదా అని మౌనం వహించి సర్వం సమదృష్టితో తిలకిస్తూ ఈశ్వర చింతనలో ఉండి పోతాడు.

శ్రీకృష్ణ భగవానుడు ఈ తత్త్వబోధ సేయగా అర్జునుడు అంతయూ అవగాహన చేసుకొని ఆనంద తన్మయుడై ఇలా కృతజ్ఞతాంజలి ఘటించాడు.

శ్రీకృష్ణ ప్రభూ ! నందనందనా ! ఆనంద విగ్రహా ! పరమానంద మూర్తీ ! తమరు దయతో భక్తి యోగాలలో సర్వ శ్రేష్ఠమైన ఆత్మయోగం సులభంగా మనసుకుపట్టేలా బోధించారు. మాకు మహా సంతృప్తి కలిగింది. తమరు మాకు మహానందం కలిగించారు. కనుక సదా భవదీయ పాదారవించాలకు శతకోటి ప్రణామాలు అర్పిస్తుంటాను.

ఇది మహాభారత అశ్వమేధ పర్వంలోనిది ఉత్తర గీత బ్రహ్మ విద్య శ్రీకృష్ణార్జున సంవాదం తృతీయ అధ్యాయం.

తారల నెన్నగ వచ్చును
భూరేణువు లెక్కపెట్ట బోలును ధాత్రిన్
నారాయణ గుణకథ వి
స్పారగ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్ ॥

4

# ఓంకార మహోత్మ్యం

## చతుర్థ అధ్యాయం

ముక్తియనగ వేరాకాశమునను లేదు
చిత్త వృత్తులడంచి నిశ్చింతనుండు
స్థితియె మోక్షము, దాన నశించుమాయ
ఆత్మయేయగుసర్వ మన్యంబుగాదు

– శ్రీ సత్యసాయిబాబా

అచ్యుత స్వామికి నమస్కారం చేసి అర్జునుడు వినమ్ర భావంతో కృష్ణదేవుణ్ణి ఇలా సంప్రశ్న చేశాడు.

" వేద వేదాంత విజ్ఞాన నిధీ ! దయానిధీ ! పురుషోత్తమా ! అనేక యోగ రహస్యాలు వివరించారు. కృతజ్ఞతాభివందనాలు. ఓంకార మహోత్మ్యం తమరు చెప్పగా విని తరించాలని మిక్కిలి కుతూహలంగా ఉంది.ప్రణవస్థానం ప్రణవ ప్రసారం ప్రణవ పరమార్ధసారం వివరించు స్వామీ ! ప్రణవం అన్ని మంత్రాలకు ప్రాణం కదా ! ప్రణవస్వరూపా !

విజయుడి అభిలాష ఆలకించి ఆనందించి భగవానుడు ప్రణవ ప్రభావం ఈ విధంగా సులభసుందర భాషా శైలిలో చెప్పసాగాడు. –

పార్ధా ! మహాబాహూ! నీవడిగిన సంప్రశ్న సమయస్ఫూర్తి గానూ జ్ఞాన

ప్రవర్ధమానంగానూ ఉంది. ప్రణవం అన్ని మంత్రాలకు ప్రాణమే విను-

ప్రజ్ఞాన మణీ ! ప్రణవంలో ముఖ్యంగా మూడు విభాగాలున్నాయి. అకారం మొదటి విభాగం. ఈ అకారతత్త్వం అరవిందం వంటిది. అకారం విచ్చుకొని భూలోకం, అగ్ని, ఋగ్వేదం ఆవిర్భవించాయి. ఇందులో విశ్వుడు జాగ్రత్స్వరూపుడున్నాడు. అంటే బ్రహ్మ. ఉకారం నుండి అంతరిక్షం, యజుర్వేదం, భువర్లోకం, సనాతుడైన విష్ణువు ఆవర్భివించారు. తైజసుడున్నాడు. మకారం నుండి ద్యులోకం, సూర్యదేవుడు, సామవేదం, స్వర్గలోకం, మహేశ్వరుడు జన్మించారు. ప్రాజ్ఞుడున్నాడు. ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరులే రామాయణంలో లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ఈ త్రిపుటియే రాముడు.

అకారం పచ్చని వర్ణంగలది. దీని నుండి రజోగుణం, ఉకారం శుద్ధమైన శుక్లవర్ణం గలది. దీని నుండి సత్త్వగుణం, మకారం నల్లని రంగు గలది. దీని నుండి తమోగుణం జనించాయి.

ధనంజయా ! ఈ అకార ఉకార మకార వర్ణాల మిశ్రమం నుండి జ్యోతి స్వరూపమైన 'ఓం' ఉద్భవించింది. ఓం ప్రణవం రెండూ ఒకటే. ఇదే ప్రణవోద్భవచరిత్ర. ఈ ప్రణవంలో అనేక రహస్యాలున్నాయి. అర్జునా ! ప్రణవంలోని విశేషాలు తెలియనివాడు బ్రాహ్మణుడే కాదు. అజ్ఞానియే సుమా !

త్రిస్థానాలు – నాభిస్థానం, హృదయస్థానం, భ్రూమధ్యస్థానం, ఈ స్థానాలలో ప్రణవం జనియిస్తుంది.

త్రిమాత్రలు – హ్రస్వం దీర్ఘం ప్లుతంతో ప్రణవం పలుక బడుతుంది.

త్రిబ్రహ్మలు – త్రిమూర్తులు బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపాలలో ప్రణవం ప్రతిఫలిస్తుంది.

త్రి అక్షరాలు – అకారం ఉకారం మకారం ఈమూడు అక్షరాల ఐక్య స్వరూపమే ప్రణవం.

త్రి అర్ధమాత్రలు – హ్రస్వాక్షరంలో సగం. ఇంద్రియాలచేత సూక్ష్మంగా అరక్షణంలో గ్రహింపబడునది. అతిస్వల్ప ఉచ్చారణ.

అష్టాంగాలు – 2 హస్తాలు, 2 పాదాలు, 2 భుజాలు వక్షస్థలం, లలాటం అష్టాంగాలు ఇవి స్థూల శరీర అంగాలు.

ఉపాసనలో అష్టాంగాలు – యమ, నియమ, ఆసన ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణా సమాధి.

చతుష్పాదాలు – భ్రూమధ్యం, కంఠం, హృదయం, నాభి, ఇవిస్థూల శరీర పాదాలు. అవిద్యాపాదం, సువిద్యాపాదం, ఆనంద పాదం.తురీయపాదం ఇవి క్రమంగా పొందాలి. జాగ్రత్త, స్వప్న, సుషుప్తి, తురీయ నాల్గు పాదాలు అంటారు.

త్రిగుణాలు, సత్త్వరజస్తమోగుణాలు, పంచదైవతాలు బ్రహ్మ విష్ణు మహేశ్వర రుద్ర సదాశివులు ఇది ఓంకార తత్త్వం.ఈ ప్రణవాన్ని పరమ యోగీంద్రులు ఇలా ప్రస్తుతించారు.

> " ఓ మిత్యేవపరం రూపం పరంబ్రహ్మ ప్రవర్తితమ్ ।
> ఓంకారే తు ప్రవిష్టోహం ప్రభవ ప్రళయస్తథా ।
> ప్రణవే సర్వగం దేవమేకీకృత్య సమభ్యసేత్ ॥"

అర్జునా ! 'ఓమ్' అనే అక్షరం సర్వోపరి సర్వోత్తమం. సర్వం సార సుందరం, సురూపం, సురుచిరం. అది పరబ్రహ్మ రూపం, పరంజ్యోతికి ప్రతీకం.

నేను ప్రణవంలో స్థిరంగా ఉన్నాను. 'ఓమ్' వల్లనే జగదుత్పత్తి స్థితి లయాలు జరుగుతున్నాయి. ఇటువంటి మహత్తరమైన ప్రణవం సర్వత్ర సూక్ష్మ రూపంలో వ్యాపించి ఉంది. నీవు సర్వత్ర ఏకీకృతమై పరమేశ్వర రూపమైన ప్రణవ రూపుని ధ్యానం చేయి. ధ్యానయోగం ప్రణవో పాసనకు ప్రాణం వంటింది.

పార్థా ! మానవుడు ' భూ ర్భువస్సువః' అనే మంత్రంతో ధ్యానం సాగిస్తే కొలది కాలంలో శరీర శుద్ధి పొందుతాడు. ప్రణవ ధ్యానంతో అనర్థాలు అజ్ఞానాలు అంధకారాలు అంతరిస్తాయి. విజ్ఞానం ఉదయిస్తుంది. ప్రజ్ఞానం ప్రభవిస్తుంది.

ప్రాణ వాయువును విడుచుటే 'రేచకం'. ప్రాణవాయువును లోపలికి తీసుకొనుటే 'పూరకం'. ప్రాణవాయువును వెలుపలికి పోనీక లోపలనే పట్టి ఉంచుకొనుటే 'కుంభకం'. ఈ రేచక పూరక కుంభక ప్రక్రియనే ప్రాణాయామం అంటారు.

ప్రధానాంగమైన శిరస్సులోగల సహస్రారం మధ్య యున్న ప్రణవమే బ్రహ్మం. ప్రణవానికి ప్రాణలక్షణం పరబ్రహ్మం అని మహాత్ములు చెప్పినారు. బాణసంధానం చేసే విలుకాడు లక్ష్యం ఏమరనట్లు ఉపాసకుడు బ్రహ్మమైన ప్రణవంపై దృష్టి నిలిపి ఆత్మ సంధానం చేయాలి.

ఓంకారం ప్రణవం బ్రహ్మం ఒక్కటే.

ఓంకార వాచ్యుడూ, కార్యకారణరూపుడూ అయిన పరమాత్మను తెలుసుకోగానే సమస్త క్రియలు నిలిచిపోతాయి. వేదాలు తత్త్వాలు అన్నీ ఓంకారం నుండి జనియించినవే కదా! ప్రణవ స్వరూప సాక్షాత్కారంలో అన్నీ ఓంకార రూపునిలో లీనమైపోతాయి. ఓంకారం నుండియే చరాచరాత్మకమైన లోక త్రయం ఆవిర్భవించింది. అట్టి మహత్తర ఓంకారం మానవహృదయ పద్మంలో విరాజిల్లుతోంది. ఓంకారం అవ్యయం, అక్షరం, అన్నిటికీ మూలం.

సర్వత్ర వ్యాప్తమైయున్న పరమేశ్వర రూపమే ప్రణవం. ప్రణవం

హ్రస్వంగా ఉచ్ఛరించితే పాపాలు దహించుకొనిపోతాయి. దీర్ఘంగా ఉచ్ఛరించితే మోహంక్షయమై మోక్షం సిద్ధిస్తుంది.

ఓంకారంలోని అర్థ తాత్పర్యాలు వివరించగలవాడే వేదవేత్త. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఓంకారం నుండి జనించిన వారే. త్రిమూర్తులకు ఓంకారం జన్మస్థానం.

యోగి ఓంకారం ఉచ్ఛరిస్తూ పరబ్రహ్మాన్ని సులభంగా పొందుతాడు. యోగిలో అణువణువున ప్రణవం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ప్రణవం పవిత్ర అగ్ని స్వరూపం. అది మహాతేజోమయం. ప్రణవాగ్ని యోగియైన ఉపాసకుడిలో ఉజ్జ్వలంగా ఉవ్వెత్తుగా జ్వలిస్తూ ఉంటుంది. ఉపాసకుడైన యోగి ఇంద్రియాలనే క్రూర మృగాలను స్వాధీనం చేసుకొని తన అదుపులో పెట్టుకొని ఆడిస్తుంటాడు. వాటిని అలా అణచి పెట్టి ఆత్మజ్ఞానం కలిగి మహా సంతోషంగా ఉంటాడు. ఇది గ్రహించిన ఉత్తమ మానవుడు ఇంద్రియాలను వశం చేసికొని భగవత్సాక్షాత్కారం పొందవలసి యున్నది.

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడుండు తనదు దేహమందె
పాప మనగ వేరు పరదేశమున లేదు
తాను సేయు పనుల తగిలి యుండు

– శ్రీ సత్యసాయిబాబా

అలా దేహంలోని ఆత్మలో పరమాత్మను చూడు. ఆ పరమేశ్వరుడు పరమపరిశుద్ధమూర్తి. పరంజ్యోతి రూపుడు దేదీప్యమానమైన జ్యోతి స్వరూపుడు. అంగుష్ఠమాత్రుడు. అచంచలుడు. అవ్యయుడు. అనంతుడు, ఆనందుడు, అప్రమేయుడు, సచ్చిదానందుడు, సర్వేశ్వరుడు అని యోగి హృదయ కర్ణికలో ఈశ్వరుని భావన చేస్తూ ధ్యానం చేస్తూ మననం చేస్తూ జీవనం పావనం చేసుకొంటాడు. సర్వంలో స్వామిని చూస్తూ చివరకు కృతార్థుడై ఈశ్వరుడిలో ఐక్యమవుతాడు.

అర్జునా ! హృదయ అరవిందం మధ్య దీపంవలె వెలుగొందు నన్ను యోగిజన ఊహలకు అందని నన్ను వేద వేదాంత సారస్వరూపమైన నన్ను ప్రణవ స్వరూపుణ్ణై సర్వత్రా ప్రకాశించే నన్ను అద్వితీయుణ్ణైన నన్ను బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపుణ్ణైన నన్ను నిర్మల నిశ్చల భక్తితో ధ్యానించిన దర్శన మిచ్చేనన్ను ఎవరు గుర్తించి చక్కగా మానస పూజ గావిస్తారో వారు తప్పక ముక్తిపదం జేరుకొంటారు. నిర్మల హృదయులైన భక్తులు నాకు అత్యంత ఇష్టులు. భక్త హృదయం భగవదాలయం.

అర్జునా ! యోగ విధానం చెప్తాను. యోగి ఉదరంలో నున్న వాయువును పూరించాలి. దానిని ఇడ నాడిలోనికి పంపాలి. దేహం మధ్యలో జ్వాలా రూపంలో అగ్నిదేవుడుంటాడు. ఆదేవుణ్ణి 'వైశ్వానరుడు' అంటారు. విశ్వం నడుపుతుండే వాడని అర్థం. ఆ వైశ్వానరుణ్ణి యోగి ధ్యానించాలి.

ఆ తదుపరి అగ్ని మండలంలో బిందువుతో గూడి రేచకం ఉంటుంది. రేచకధ్యానం చేస్తూ యోగక్రమంలో ప్రాణాయామం సాగించాలి. రేచక ప్రక్రియకాగానే పింగళనాడిలోని సున్నితనాదం ఆలకించాలి. స్వామిని స్మరిస్తూ స్వామిని ఆ రూపంలో భావనం చేయాలి. బ్రహ్మపూరక ప్రాణాయామం, విష్ణుపూరక ప్రాణాయామం, క్షరాక్షర రూపుడైన శివ పూరక ప్రాణాయామం అని దీనిని తలంచాలి.

దేహో దేవాలయః ప్రోక్తో
జీవోదేవస్సనాతనః
త్యజేదజ్ఞాన నిర్మాల్యం
సోహం భావేన పూజయేత్ ॥

పార్థా ! ఈదేహం పవిత్ర దేవాలయం. దేహంలోని జీవుడు సత్య సనాతన సారథియైన దేవుడు. ఆ దేవుడి దగ్గర దైహిక లౌకిక అజ్ఞానం అనే నిర్మాల్యం పేరుకుంటుంది. దానిని విడిచివైచి ఆత్మజ్ఞాన తోయంతో పరిశుభ్రం చేసి సోహం మంత్రంతో మహాదేవుణ్ణి అభిషేకించు. అర్చన గావించు. అపవర్గ సౌఖ్యం అనుభవించు. క్రమంగా నీవే ఈశ్వరుడవై ప్రకాశించు.

ఇలా తన దేహంలో విరాజిల్లుతున్న సర్వేశ్వరుణ్ణి మరచి బయట ఏ కొండలలోనో ఉన్నాడని క్షేత్రసంచారం చేయటం ఎంత అవివేకం ! ఇది స్వగృహంలోని పాయసం కాదని పొరుగింటికి వెళ్ళి బిచ్చం అడుక్కొని తిన్నట్లుంటుంది.

కొందరు దేవుడని పాషాణ విగ్రహాలను, మట్టి బొమ్మలనూ, బొమ్మలనూ, కల్పిత చిత్రాలనూ పూజిస్తుంటారు. అది ఏమంత మంచిది కాదు. దేవుడైన పరమాత్మ అకల్పితుడు. స్వయం జ్యోతిః స్వరూపుడు. పరంధాముడు. సర్వవ్యాపకుడు, సర్వహృదయవాసి. దేవుడుండే చోటు వివరంగా చెప్తాను. విను. మానవుడి నాభిలో ఒక పద్మం ఉంది. ఆ పద్మానికి కోమలమైన పది అంగుళాల నాళం ఉంది. అది అరటి పూవు వలె చంద్రకాంత ప్రభలను వెదజల్లుతూ ఉంటుంది. అది అధో ముఖంగా విచిత్రంగా విలక్షణంగా ఉంటుంది." అని చెప్తుండగా అర్జునుడువిని ఇలా అన్నాడు–

" జనార్ధన స్వామీ ! నీవు చెప్తున్న పద్మం విచిత్రంగా ఉందిగదా ! అది తెలుసుకొనటానికే వీలుగాకుండా ఉందే. ఆరాధించటానికి అసాధ్యం అనిపిస్తోంది. ఆ హృదయ పద్మం జేరటం ఎలా ! వివరంగా చెప్పు స్వామీ !

అర్జున హృదయం గ్రహించి పుండరీకాక్షుడు వివరించాడు–

" పార్థా ! ఇది పరమగోప్యం. విను. ఆ హృదయ పద్మం జేరటం మిక్కిలి కష్టమే. కానీ ఒక ఉపాయం ఉంది. పవిత్రమైన ప్రణవం చాలా శక్తి ప్రదమైనది. ఎక్కువ ఉపయోగకరమైనది. ప్రణవంతో పద్మం దగ్గరకు జేరాలి. ప్రణవంతోనే పద్మంలో ప్రవేశించాలి. ప్రణవంతోనే పద్మాన్ని వికసింప జేయాలి. పద్మంలో పవళించిన పద్మనాభస్వామిని ప్రణవంతోనే మేలుకొల్పి సేవించాలి. అట్లు సేవించిన విష్ణు ప్రీతిచేత అసాధ్యకార్యం సుసాధ్యమవుతుంది.

ఆ పద్మ పరిమళం దేహమంతా గుబాళించి దేహికి సుఖం సంతృప్తి ఆనందం ప్రాప్తిస్తుంది. హృదయ మధ్య స్థానంలో గల ఈ పద్మం అష్టదళాలతో పుష్ప కేసరాలతో పరీమళాలతో పరమసౌందర్యం సౌగంధ్యం విరజిమ్ము తుంటుంది. ఆ పువ్వు నడుమ బొడ్డు కలిగి స్వామి కూర్చొనే మెత్తని దిండుగా ఉంటుంది. అది అంగుష్ఠ ప్రమాణమే.

ఆ పద్మం లయమయ్యేది కాదు. పరిమళం తగ్గేది కాదు. అది వాడేది కాదు. అది నిత్య నూతనం. సత్య సుందరం. ప్రభా భాసురం.

ఆ పద్మ పీఠంపై ఆత్మదేవుడైన శ్రీ మహావిష్ణుమూర్తి విరాజమానుడై యుంటాడు. విష్ణువు పురాణ పురుషుడు. పురుషోత్తముడు. సత్య సనాతనుడు. కరుణాకరుడు. కల్యాణ వరదుడు. భక్త సులభుడు. ఆ స్వామిని ధ్యానం చేయి.

స్వామి కూర్చొనే ఆ హృదయ పద్మ విశేషాలు ఇంకా అనేకం ఉన్నాయి. శ్రద్ధగా అర్థంచేసుకొన్నావంటే అనుపమానమైన మహానందం కల్గుతుంది.

హృదయ పద్మం అష్టదళాలతో వికసించి ఉంటుందని చెప్పాను కదా ! ఆ పద్మ రాజానికి ముప్పది రెండు కోమలాలైన కుసుమకేసరాలు కింజల్కాలు బహు సూక్ష్మంగా సుందరంగా ఉంటాయి.

ఆ హృదయ పద్మం మధ్యలో విష్ణువున్న కారణంచేత ఆ మహా విష్ణువును పరివేష్టించి ఇంద్రాది దిక్పాలకులు, సూర్యచంద్ర నక్షత్ర గ్రహ తారకలు సేవిస్తుంటాయి. వారందరు ఒకరి ప్రక్క ఒకరు కలిసి పోయి కూర్చుంటారు. సూర్యుడు విష్ణువుకు దగ్గరగా ఉంటాడు. సూర్య దేవుడి కాంతి వలయంలోనే చంద్రుడు. చంద్రుని వలయం లోనే అగ్ని దేవుడు. అగ్ని దేవుడి కాంతివలయం మధ్య భాగంలో పరంజ్యోతి ప్రకాశిస్తుంటుంది.

ఆ పర్యంజ్యోతి ప్రకాశం మధ్యలో పరమ పీఠం ఉంది. అది ఒక

రత్నరంజిత రమణీయ సువర్ణ సుందర సింహాసనం. ఆ సింహాసన సౌందర్యం వర్ణనాతీతం.దాని కాంతి ధగద్ధగలు సూర్య తేజస్సులను అగ్ని కాంతి విస్ఫులింగాలను కూడా క్రిందు చేస్తుంటాయి.

ఆ భక్త హృదయ సింహాసనంపై పురుషోత్తముడైన పద్మనాభస్వామి సర్వదేవతలచేత సేవింపబడుతుంటాడు. ఆయన ఆది నారాయణుడు. దేవదేవోత్తముడు. సర్వలోకేశ్వరుడు. ఆ స్వామి స్వయం ప్రకాశమానుడు. కల్మష విదూరుడు. కామితార్ధప్రదాయకుడు. భక్తవత్సలుడు. ఆర్తత్రాణ పరాయణుడు. దీనజన బాంధవుడు. భక్త సులభుడు. అర్థించిన భక్తశ్రేష్ఠులను ప్రేమతో తన దగ్గరకు తీసుకొంటాడు. ఆ స్వామికీ ఆ స్వామి మహా భక్తులకు భేదమే లేదు. భక్తులు కూడా అంత కరుణార్ద్రహృదయులు. శక్తి సంపన్నులు.

ఆది నారాయణుడు శ్రీవత్స కౌస్తుభ మణిహార శోభితుడు. ఆ స్వామి విశాల హృదయం మధ్యలో శ్రీ వత్సం ప్రకాశిస్తూ హృదయంలోని దయాదాక్షిణ్యాలు విరజిమ్ముతుంటాయి. ఆ వక్షస్థలంపై మంచి ముత్యాల దండలు వినూత్నమణి హారాలు సూర్యతేజస్సులను వెదజిమ్ము తుంటాయి.

శ్రీ మహావిష్ణు శిరస్సుపై త్రిభువన రాజకిరీటం రాజరీవి ప్రదర్శిస్తోంది. హస్త పద్మాలలో శంఖం చక్రం గద పద్మం అపూర్వమైన అనేక భావాలను ప్రతిబింబిస్తుంటాయి. ఆయుధాలలోని లోతైన భావాలు దేవాదులకే అంతుపట్టవు.

ఆది నారాయణ స్వామికి అష్టబాహువులు అనుపమానంగా ఉంటాయి. అవి అవసరంగా ఆ విధంగా అర్చించిన భక్తులకే దర్శన మిస్తాయి. అవి అందరికీ అనవసరంగా కనుపించవు.

స్వామి చంద్రకాంతులతో ఆహ్లాదకరంగా ఆనంద దాయకంగా మందహాస మాధుర్యం విందు చేస్తుంటాడు. ఆయన తప్తకాంచన పీతాంబరచ్ఛాయ శుభప్రదంగా ఉంటుంది.

అర్జునా ! భగవానుడు భావప్రియుడు. పరిశుద్ధ బావాన్నే స్వామి చూస్తుంటాడు. కనుక స్వామిని భావాంబుజాలతో అర్చిస్తుండాలి. ఆ విష్ణుమూర్తి కృతయుగంలో స్వచ్ఛమైన శుద్ధమైన శ్వేత కాంతితో ఉన్నాడు. త్రేతా యుగంలో అరుణకాంతితో అందాలు చిందించి ఆబాలగోపాలానికి ఆనందం కలిగించాడు.

ద్వాపర యుగంలో మేఘశ్యామ సుందరుడై గోపగోపికా మానస చోరుడై ప్రకాశించాడు. ఈ కలియుగంలో పీతవర్ణ వస్త్రం ధరిస్తూ సుకుమార సుందరంగా దర్శన మిస్తున్నాడు. ప్రస్తుతం కేశసంపదయే త్రిభువన కిరీటాన్ని ప్రతిఫలిస్తుంది.

ఆ సత్యమూర్తి హృదయశాయి, సత్యసాయి, వరప్రదాయి, ఆ స్వామి శుద్ధుడు. సూక్ష్మరూపుడు, స్థూల రూపుడు, నిరాకారుడు, నిరంజనుడు,

నిరాకారుడు, నిర్మలుడు, నిర్వికారుడు.

ఆ దేవ ప్రభువు అప్రమేయుడు. అద్వితీయుడు, అనంతుడు, అన్నీ తానైనవాడు.అందరిలో ఉండు వాడు. అందరికీ ఆప్త బాంధవుడు. అందరినీ ఆరాధనీయులుగా భావించు గౌరవించు. సేవించు. ప్రేమించు.

ఆ స్వామి జ్యోతి స్వరూపుడు. ఆయన పరంజ్యోతి. యోగ విజ్ఞాన సాధనా రహితుడు. ప్రేమమయుడు. ప్రేమమూర్తి. సర్వమునకు కారణభూతుడు. అన్నిటికీ ఆధార భూతుడు. శాశ్వతుడు సర్వజ్ఞుడు సర్వేశ్వరుడు.

అట్టి స్వామిని ఇతర చింతలు మాని తదేక చిత్తంతో ధ్యానించి ఆరాధించి అనుగ్రహం పొందు. మోక్షపదం పొందు.

కుండ పగిలి పోగానే కుండలోని ఘటాకాశం మహాకాశంలో కలిసి పోతుంది. అట్లే జీవాత్మ జ్ఞానంతో పరమాత్మలో లీనమవుతుంది.

కనుక ఉత్తమ భక్తుడు ఎక్కడున్నా ప్రయాణంలో గుర్రంపై పోతున్నా రణరంగంలో యుద్ధం చేస్తున్నా, సంకటంలో ఉన్నా, సంతోషంలో ఉన్నా, పరబ్రహ్మను ధ్యానిస్తూనే ఉంటాడు.

అర్జునా ! నీవుకూడా కూర్చున్నా నిలుచున్నా నడుస్తున్నా పడుకొన్నా శుచిగాయున్నా అశుచిగా యున్నా సదా హరిచింతనం చేయి. సర్వదా భక్తి యోగంలో యోగివై ఉండిపో.

బాహ్య సంబంధాలు వదులుకో. అంతరంగంలో అన్య సంబంధాలు పెట్టుకోకు. సర్వసంగం పరిత్యజించి ఒక్క ఆత్మనే ఆత్మలోచూడు. ఆత్మలో పరమాత్మను ధ్యానిస్తూండు. నీవు పరమాత్మవై ప్రకాశిస్తావు.

ఇది మిక్కిలి విలువైనది. అతి రహస్యమైనది. నీవు నాకు అత్యంత ప్రియ భక్తుడవనీ చెప్పాను. గ్రుడ్డివాడికి చంద్రోదయ సౌందర్యం తెలియనట్లే విషయలంపటుడికి ఈ గీతా శాస్త్రం రుచించదు.

అర్జునా ! ఇది బ్రహ్మ ప్రతి పాదక వేద శాస్త్రం చేత బాగుగా నిశ్చియింపబడినది. ఇది వేదార్థాన్ని వివరించి చెప్పుతుంది. ఈ గీతా శాస్త్రం నేనే తయారు చేసి నీవంటి వారికి పూర్వం నుంచి చెప్పుతూ వస్తున్నాను.

ఈ గీతా శాస్త్రం భక్తితో శ్రద్ధగా పఠించి అర్థం చేసుకొన్నవాడు విష్ణుసాయుజ్యం పొందుతాడు. ఇది మిక్కలి పుణ్యప్రదమైనది. పాపాలు హరించేది. జన్మ ధన్యం చేసేది. దుస్స్వప్నాలను దూరం చేస్తుంది. శుభములు కలిగిస్తుంది.

శ్రీ వ్యాసులవారు నాలుగు వేదాలు పరిశోధించి సారం గ్రహించి భారతం కూర్చారు. శ్రీకృష్ణదేవుడు భారత దధి భాండంలో గీత అనే కవ్వం పెట్టి చిలికి చిలికి ఉపదేశ నవనీతాన్ని తీసి భక్త సత్తముడైన నరుడి నోటికి అందించాడు. నరునకు పెట్టిన వెన్నపూసయే ఇది.

ఇది కోటి పూజలతో సమం.
ఇది కోటి స్తోత్రాలతో సమం. ఇది కోటి జపాలతో సమం.
ఇది కోటి ధ్యానాలతో సమం.
ఇది మనో లయానికి ఆత్మ విజయానికి అత్యవసరమైన ఆత్మ వస్తువు.

ఇది మహాభారతంలోని అశ్వమేధ పర్వం లోని
శ్రీ కృష్ణార్జున సంవాదం
గీతాసార యోగం
ఉత్తర గీత
చతుర్థ అధ్యాయం
ఇతిశ్రీ.

వందే సుందర సత్యసాయి వరదం సౌందర్య రత్నాకరం
భారద్వాజస గోత్రరాజ శిఖరం ప్రేమావతారం ప్రభుమ్
ఆపస్తంబ సువర్ణ సూత్ర తరలం లీలామయం చిన్మయం
శాంతిశ్రీ వలయం ప్రశాంతి నిలయం సత్యం శివం సుందరమ్ !

**- శాంతిశ్రీ**

గీతయొక్క విలువను తెలుసుకొనవలెనన్న మొదట గీతపై పూజ్యభావం ఉండవలెను. గీతయొక్క భావార్థము గ్రహించిన అది ఎంత గాంభీర్యమో తెలియును

గీతయే భగవానుని దూత
గీతయే జగదేక మాత
గీతయే సాధకుని ఊత
గీతయే సంసారికి ఈత
గీతయే మంత్రాల మూట
గీతయే వేదాంతపు వూట
గీతయే పుష్పాల తోట
గీతయే ఘనరాజ బాట
గీతయే శ్రీ సాయి మాట

- భగవాన్ శ్రీ సత్యసాయిబాబా